# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 4, ఏప్రిల్ 2026

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 4

సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| నారాయణతత్వం–ముక్తిదాయకం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| వేదోద్ధారకుడు–మత్స్యావతారుడు | 22 |
| పరమాత్మ | 24 |
| మార్గదర్శకులు – మహర్షులు (సీరియల్) | 26 |
| సింహగిరి నరహరి.. | |
| నమో నమో దయానిధీ! | 30 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 36 |
| జయదేవుని 'గీత గోవిందము' | 40 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 44 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 50 |
| అక్షయ తృతీయ | 56 |
| మీ ప్రశ్న మా సమాధానం | 57 |
| మద్ది ఆంజనేయ స్వామి | 58 |
| నవవిధ భక్తిమార్గాలు | 60 |
| హనుమజ్జయంతి | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# సాధన

భగవంతుని సాధన నిమిత్తమై మానవ జన్మ లభించింది. దేవతలు కూడా మానవులుగా జన్మించి భగవంతుని సాధన చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కాబట్టి మానవునిగా జన్మించిన మనము ఎంతో అదృష్టవంతులము. కాని ఈనాటి మనుష్యులు భగవంతుని సాధన కంటే లౌకిక విషయాలకు ఎక్కువ విలువనీయుట శోచనీయము. కాని జీవితమును సార్థకము చేసుకోవాలని తలచిన భక్తులు మాత్రం బాహ్య ప్రపంచాన్ని లెక్క చేయక భగవంతుని సాధన యందే నిమగ్నమై ఉండువారు నేటికీ ఎంతోమంది ఉన్నారు. ఈ సృష్టిలో ఉన్న ప్రతిరూపము భగవంతునిదే! అయితే సాధకుడు అందులో తనకు నచ్చిన రూపమును మాత్రమే స్వీకరించి తగిన సాధన చేయవలెను. ఎలాగైతే ఒక విద్యార్థి చిన్నప్పుడు అన్ని సబ్జెక్టులు చదివినప్పటికీ పిహెచ్.డి చేయు సమయాన ఒకే సబ్జెక్టును తీసుకుని ఇందులో ఒకే అంశమును ఎంచుకొని దానిపైననే రీసెర్చ్ చేయవలసి ఉంటుంది. అలా చేస్తేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. అలాగే భగవంతుని సాధకుడు ఆయన యొక్క ఏకరూపమును మాత్రమే ఎంచుకుని సాధన చేయవలెను. మరియు ఈ సృష్టిలోని అణువణువు ఈ రూపము నుండి ఉద్భవించిందనే దృఢ విశ్వాసం కలిగి ఉండాలి. సమస్త సృష్టికి మూలం ఈ రూపమనే విశ్వాసం కలిగి ఉండాలి. ఈ స్థితికి చేరుటకు కఠిన సాధన చేయవలసి ఉంటుంది. పూర్వం ఋషుల లాంటి మన పెద్దలు రచించిన గ్రంథాలను, పురాణాలను చదువవలసి ఉంటుంది. దీనితో పాటు భగవంతుడు ప్రసాదించిన రామాయణ, భాగవతాది గ్రంథాలను చదువవలసి ఉంటుంది. గురువును ఆశ్రయించవలసి ఉంటుంది. వీరందరి ఉపదేశానుసారం, భక్తుని హృదయంలో జనించిన భావాలనుసారము తను సాధన చేసే రూపమును ఎన్నుకోవాలి. ఒక్కసారి ఈ రూపమును ఎన్నుకున్న తరువాత ఆ రూపమునకే కట్టుబడి సాధనను కొనసాగించవలసి ఉంటుంది. సాధకుని దృఢ విశ్వాసమును అనుసరించి తన సాధన కాలము నిర్ణయించబడుతుంది. నిజమైన సాధకుడు భగవంతునికి తన హృదయమును తప్ప మరోదానిని సమర్పించవలసిన అవసరము లేదు. భక్తులు వారి కోరికలు నెరవేర్చుటకు ధన కనకాది వస్తువులను సమర్పించవచ్చు. కాని సాధకుడు మాత్రం కేవలం తన ఆత్మను సమర్పిస్తే సరిపోతుంది.

పూర్వం శబరి, ఏమీ చదువని అజ్ఞానురాలు. కేవలం వారి గురుదేవుని ఆజ్ఞతో రాముడు వస్తాడని దృఢంగా విశ్వసించింది. మరియు ఆయనే ఈ విశ్వానికి అధిపతి అని గ్రహించింది. ఎలాగైనా ఆయనను దర్శించి, రెండు మాటలు మాట్లాడి, పండ్లు పుష్పాలు సమర్పించి ధన్యురాలు కావాలని తలచింది. ఈ క్రమంలో ఎన్నో ఏళ్ళు గడిచినా, వస్తాడన్న శ్రీరాముడు రాలేదు. తోటి జనులు కూడా ఆమెను పిచ్చిదని తలచారు. ఆమెను మార్చుటకు ప్రయత్నించారు. కాని శబరి మాత్రం చెక్కుచెదరని లక్ష్యంతో, దృఢ విశ్వాసం కలిగి సాధనలో లోటు రానీయలేదు. రాత్రింబవళ్ళు శ్రీరామునికై తపిస్తూ, పండ్లు పూలు ఏరుతూ... ఆ రోజు తప్పక వస్తాడనే దృఢ చిత్తంతో జీవించింది. ఇంతటి తపన, విశ్వాసం కలిగి సాధన చేసింది కావున శ్రీరాముడు లక్ష్మణునితో కలిసి శబరి నివాసానికి వెళ్ళాడు. ఆమెను అనుగ్రహించాడు, శబరి జీవితం ధన్యతనొందింది, తరతరాల సాధకులకు మార్గదర్శకంగా నిలిచింది. కాబట్టి ప్రతి సాధకుడు భగవంతుని పట్ల శరణాగతుడై దృఢ విశ్వాసం కలిగి సాధన చేస్తే లక్ష్యాన్ని తప్పక సాధించగలడు. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు అతి సులభుడు. భక్తవత్సలుడు. కావున ఆయనను సాధన చేసిన భక్తుడు తప్పక విజయము సాధించగలడు.

నమో వేంకటేశాయ

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| 2 సం॥ | 500-00 |
| 4 సం॥ | 1,000-00 |
| జీవిత చందా | 5,000-00 |
| పోషకులు | 10,000-00 |
| రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో॥ సుముఖం సుహృదం సులభం సుఖదం**
**స్వనుజం చ సుఖాయ మమోఘ శరమ్**
**అపహాయ రఘూద్వహ మన్యమహం**
**న కథంచన కంచన జాతు భజే**

తాత్పర్యం – సుందరమైన ముఖము గలవాడవు, మంచి హృదయము గలవాడవు, సులభముగా ఆశ్రయింపదగినవాడవు, సుఖమును కలిగించువాడవు, మంచి తమ్ముడు-మంచి భార్య కలవాడవు, వ్యర్థములు కాని బాణములు కలవాడవు, రఘువంశ తిలకుడవు అగు నిన్ను విడిచిపెట్టి వేరొక దైవమును సేవింపను.

**శ్లో॥ వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**
**హరే వేంకటేశం ప్రసీద ప్రసీద**
**ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ**

తాత్పర్యం - వేంకటేశా! నాకు నీవు తప్ప వేరొక నాథుడు లేడు. నిన్నే ఎల్లప్పుడూ స్మరిస్తుంటాను. శ్రీహరియైన వేంకటేశా! నన్ను అనుగ్రహింపుము. నేను కోరిన వరములను ప్రసాదింపుము.



# ముక్తిమార్గము

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

## శ్రీరాగం

**సకల సందేహమై – జరుగుచున్నది యొకటి**
**ప్రకటింప జీవమో – బ్రహ్మమో కాని ॥ పల్లవి ॥**

**1. వసుదేవు జఠరమను – వననిధికిఁ జంద్రుఁడై**
**అసమానగతిఁ బొడమి – నాఁడీతఁడు,**
**వసుధఁ జంద్రుఁడు నీల – వర్ణుఁడేటికి నాయ**
**కసరెత్తి నునుఁగందు – గలయఁగొనఁబోలు ॥ సకల ॥**


**2. ఇన వంశమున లోక – హితకల్పభూజమై**
**అనఘుఁడై జనియించి – నాఁడీతఁడు,**
**ననుపైన సురతరువు – నల్లనేఁటికి నాయ**
**పెనుఁగొమ్మలో చేఁగ – పెరిగి రాఁబోలు ॥ సకల ॥**

**3. తిరువేంకటాద్రిపైఁ – దెలియఁ జింతామణై**
**అరిదివలెఁ బొడచూపి – నాఁ డీతఁడు**
**గరిమెనది యిపుడు చీఁ – కటి వర్ణమేలాయ**
**హరి నీల మణుల ప్రభ – లలమి కొనఁబోలు**

భావము – సమస్త లోకమునకు సందేహము కలిగించుచు ఒకటి ప్రవర్తించుచున్నది. దాని స్వరూపము ఇదమిత్థమని నిశ్చయించి ప్రకటించుటకు అది జీవకోట్లలో ఒకటైన జీవమో, లేక సాక్షాత్పరబ్రహ్మమో తెలియుట లేదు.

ఈ దేవుడు వసుదేవుని గర్భమనెడి సముద్రమునకు చంద్రుడై సాటిలేని రీతిగా పుడమి యందుదయించినాడు. చంద్రుడైనచో తెల్లగా నుండవలెను కదా! నల్లని వాడెట్లైనాడు? ఈ చందమామలోని మచ్చ కోపగించి దేహమంతటా వ్యాపించి యుండబోలును.

కోపమునకు కారణమేమన దివినున్న చంద్రునిలో మచ్చ నియత స్థలము నుండి వ్యాపింప జాలకున్నది. భువినున్న చంద్రునైన ఆక్రమించుకొందమన్న పట్టుదలతో అది యట్లు చేసియుండవచ్చును. లేదా మా చంద్రునకొక మారుచంద్రుడా అన్న కోపముతోనైనా అది ఈ చంద్రుని ఆవరించి యుండవచ్చును.



సూర్యవంశమునందు లోకమునకెల్ల మేలు గూర్చు కల్పవృక్షమై పాపరహితుడై ఈ దేవుడు (శ్రీరాముడుగా) జనించినాడు. కల్పవృక్షమైనచో తెల్లగా ఇంపై యుండవలయును కదా! ఇది ఎందుకు నల్లబడినది? ఇందలి పెద్ద కొమ్మలోని చేవ పెరిగి చెట్టంతయు క్రమ్ముకొన్నది కాబోలు.

చేవబారిన చెట్టు నల్లనగుట సహజము. దివినున్న కల్పతరువు చేవ తక్కువై వెల వెల బారినది. దానికంటే దీనిలో చేవ ఎక్కువ యని చెప్పుటచే లోకహితము గూర్చుటయందు ఈ చెట్టుకే (భగవంతునికే) ఆధిక్యము సూచించబడినది.

శ్రీవేంకటాచలముపై ప్రకటముగా అత్యంత దుర్లభమైన చింతామణియై ఈ దేవుడు (వేంకటేశ్వరుడు) పొడచూపినాడు.

చింతామణియైనచో చీకటి రంగేల కలిగినది? ఇంద్రనీలమణుల కాంతులు విగ్రహమంతటా వ్యాపించుట వలన కాబోలు.

దీనిచే శ్రీవేంకటేశ్వర విగ్రహమును అలంకరించు ఆభరణముల వైభవము కీర్తింపబడినది. కల్పవృక్షము, కామధేనువు, చింతామణి కోరిక లిచ్చుటలో ప్రశస్తి గాంచినవి. అవి తెల్లగా నుండుననుట కవి సమయ సిద్ధము.




# నారాయణ తత్త్వం ముక్తిదాయకం

- డా|| కె.బి.రాజేంద్ర ప్రసాద్

మ॥ "పరుడై ఈశ్వరుడై మహామహిముడై ప్రాదుర్భావ స్థాన సం
హరణ క్రీడనుడై త్రిశక్తియుతుడై యంతర్గత జ్యోతియై
పరమేష్ఠి ప్రముఖా మరాధిపులకున్ బ్రాపింప రాకుండు దు
స్తర మార్గంబునఁ దేజరిల్లు హరికిం తత్త్వార్థినై మ్రొక్కెదన్"

శుక మహర్షి చేసిన శ్రీహరి సంస్తుతి. ''ప్రకృతి కన్ననూ, జీవుని కన్ననూ పరుడైన పరమాత్మ, మహా మహిమోన్నతుడు. సృష్టి, స్థితి, లయలనే ఆటలను ఆడేవాడు, ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తుల సమేతుడు, మూడు మూర్తులకు మూలమైనవాడు, ఆత్మజ్యోతి స్వరూపుడు, పరబ్రహ్మ తత్త్వమూర్తి, బ్రహ్మాది దేవతలకు అందనంత దూరంలో ఉండి ప్రకాశించేవాడు అయిన శ్రీహరిని తత్త్వ జ్ఞానాభిలాషతో మ్రొక్కుతున్నాను'' అన్నారు.

తత్త్వం అంటే ఏమిటి? శ్రీహరి లేదా నారాయణ తత్త్వం అంటే ఏమిటి? చూద్దాం.

తత్ అంటే అది. త్వం అంటే నీవు. అది నీవు లేదా అదే నీవు. అది అంటే సత్యం, నిత్యమైన జీవుడు, దేవుడు. జీవేశ్వరుల బంధం, బాంధవ్యమే తత్త్వం. ఆధ్యాత్మిక దారిలో ''తత్త్వమసి'' అంటున్నారు. అది నీవు అయి ఉన్నావు అనగా పరమాత్మే జీవాత్మ. ''తత్త్వం'' = విష్ణువు సత్య స్వరూపుడు. ''తత్త్వవిత్'' = తత్త్వం తెలిసినవాడు. ''ఏకాత్మా'' అద్వితీయమైన పరమాత్మ అంటూ విష్ణు సహస్రనామాలలో పేర్కొనడం జరిగింది.

నరులతో – నరులలో ఉండేవాడు నారాయణుడు. నీటిమధ్య ఉండేవాడనియు నారాయణ పదానికి అర్థాలు. నీరు ప్రాణికోటికి జీవాధారం, జీవనాధారం. స్వామి సర్వాత్ముడై, సర్వత్రా ఉండేవాడే నారాయణుడు. ఆయనే

పరమాత్మ, పరంధాముడు. ఆయన కానిది, లేనిది ఈ సృష్టిలో ఏదీ లేదు. ఈ సత్యాన్ని అనుభూతితో గ్రహించగల్గడమే నారాయణ తత్త్వ జ్ఞానం.

ఈ నారాయణ తత్త్వ జ్ఞానాన్ని నారాయణోపనిషత్ చాలా సులభంగా, స్థూలంగా, కష్టత, క్లిష్టతలు లేకుండా వివరించింది.

నారాయణుడే ఆదిపురుషుడు. ఇది సత్యం. సకల చరాచర సృష్టి అంతా ఆయన నుండే పుట్టి, పెరిగి, చివరకు ఆయనలోనే లీనమవుతున్నాయి. మూడు మూర్తులూ నారాయణుడే. ఇంద్రాది దేవతలు కూడా నారాయణుడే. మూలతత్త్వం శ్రీమన్నారాయణుని విభూతి మాత్రమే. ''ఏకో నారాయణః। నద్వితీయోఽస్తి కశ్చిత్ ॥ దివ్యుడైన దేవుడు నారాయణుడు ఒక్కడే. ఆయనే సర్వవ్యాపి యైన విష్ణువు. ''బ్రహ్మణ్యో దేవకీపుత్రో బ్రహ్మణ్యో మధుసూదనమ్ । సర్వభూతస్థం ఏకం నారాయణమ్'' దేవకీ పుత్రుడైన శ్రీకృష్ణుడే బ్రహ్మము. మధువనే రాక్షసుని సంహరించిన పుండరీకాక్షుడే బ్రహ్మము. సర్వభూతాలలో ఉన్న దైవం నారాయణుడు. ''ఓం నమో నారాయణాయ'' అనేది నారాయణుని అష్టాక్షరీ మంత్రం. ఈ మంత్రోపాసన లేదా పఠనంతో అమృతత్వం సిద్ధిస్తుంది. నారాయణుడు ఆనందస్వరూపుడు. ఈ ఆనందస్వరూపుని అష్టాక్షరీ మంత్రం ఉపాసకులను వైకుంఠ ధామానికి చేర్చుతుంది. కనుక నారాయణ నామ మంత్ర యుక్తమైన కీర్తనం జీవులకు శ్రీకైవల్య ప్రాప్తిని కల్గిస్తుందని తెలుస్తోంది.

ఇప్పుడు ఈ స్తుతులు, సూక్తులు, ఉక్తులు కథాత్మకంగా ఫలించిన రీతి, నీతి, సంస్కృతిని ఒకింత చూద్దాం.

అభిమన్యుడు ఉత్తరలకు జన్మించిన కుమారుడు పరీక్షిన్మహారాజు. తల్లి కడుపులో ఉన్నప్పుడే దైవాన్ని దర్శించిన భాగ్యశాలి. తాను దర్శించిన దైవం లోకంలోని ప్రత్యణువులో ఉన్నాడని పరీక్షించడం చేత ఈయన పరీక్షిత్తుగా పేరు పొందాడు. పెరిగి పెద్దవాడయిన తరువాత పాండవుల నుండి రాజ్యభారాన్ని తాను పరిగ్రహించాడు. చాలాకాలం రాజ్యపాలన చేశాడు.

పరీక్షిత్తు ఒకనాడు వేటకై అడవికి వెళ్ళాడు. ఒక మృగాన్ని చూచి వెంబడించాడు. ఆ మృగం పరుగులతో పోతూ శమీక మహర్షి ఆశ్రమ ప్రాంతానికి వచ్చి అదృశ్యమైంది. పరీక్షిత్తు ఆశ్రమంలోకి ప్రవేశించాడు. శమీకుడు ధ్యాన సమాధిలో ఉన్నాడు. ''స్వామీ! ఇటు మృగం వచ్చింది. తమరు చూచారా?'' అని పరీక్షిత్తు అడిగాడు. ముని నుండి సమాధానం రాలేదు. పదే పదే ప్రశ్నించినను ధ్యానమగ్నుడైన మహర్షి నుండి ప్రతి సమాధానం రాలేదు. పరీక్షిత్తులో సహనం నశించింది. కోపం కట్టలు త్రెంచుకొంది. ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేని స్థితిలో ఎదురుగా చచ్చి పడియున్న పాము శరీరాన్ని ముని మెడలో పడవేశాడు. సరిగ్గా అదే సమయానికి ముని కుమారుడు శృంగి వచ్చి చూచాడు. విజ్ఞత లేని ప్రభువుపై కోపించాడు. ''చేయరాని పని చేసిన నీవు ఏడు దినములలోపు తక్షకుడనే సర్పము యొక్క విషప్రభావంతో మృతిని పొందగలవు'' అని శపించాడు. తరువాత పరీక్షిత్తు ప్రభువని తెలిసినను, తండ్రి వచ్చి అనునయించినను జరగవలసింది జరిగిపోయింది. తెలిసి పట్టుకొన్నా, తెలియక పట్టుకొన్నా నిప్పు కాల్చక మానదు. అందుకే కోపం మనలో ఉన్న పెద్ద శత్రువు. ఈ కోపం పాపాలు చేయిస్తుంది. శాపాలకు గురి చేస్తుంది. తాపాల్ని అనుభవింపచేస్తుంది. నేర్పు కన్నా ఓర్పు మిన్న. సహనంతో వేచియుంటే సత్ఫలితాలు వస్తాయి. క్రోధం దుష్ఫలితాల్నే ఇస్తుంది. పరీక్షిత్తునకు ఆ కోపమే జయింపరాని శత్రువై మరణశాసనాన్ని విధించింది.

ఇప్పుడు పరీక్షిత్తుకు గతి, గమనం, గమ్యం ఏమిటి? సాధు సజ్జనులు చూపే మార్గం ఏమిటి? జీవధాని ఈ భూలోకం. జీవులకు రాజధాని పరంధాముని ఆవాసం. నదీ నదాలు ఎన్ని వయ్యారాలు పోయినా, వాగులు, వంకలు ఎన్ని వంకరలు తిరిగినా చివరకు కలవవలసింది చేరవలసింది కడలి విభుని ఒడిలోనికే. మరి జీవాత్మకు మార్గమేది? గమ్యమైన అంతర్యామిలో ఎలా కలిసేది? ఈ ప్రశ్నలకు సమాధానం తత్త్వజ్ఞాన మార్గం. ఆ తత్త్వోపదేశం కోసమే శ్రీ శుకులువారు పరీక్షిత్తునకు దొరికాడు. ఇది కూడా ఒక అదృష్టం.

శ్రీ శుకులు వారు మహాజ్ఞాని. ప్రశాంత నిర్మలుడు. బ్రహ్మ తత్త్వవేత్త. వ్యాసభగవానుని పుత్రుడు. లౌకికం అంటని పరతత్త్వ ధ్యానంతో కాలాన్ని కరిగించే మహర్షి. వేద జ్ఞానాన్ని కూడా తేనెల తేటల మాటలతో మధురంగా చెప్పగలిగినవాడు. శ్రీ శుకులువారు పరీక్షిత్తుతో ఇలా అంటున్నారు.

''ప్రభూ! తత్త్వజ్ఞానం అందునా నారాయణుని తత్త్వ విభూతి విశిష్టమైంది. వరిష్ఠమైంది. గరిష్ఠమైంది. విష్ణువు సర్వవ్యాపకుడు. ఇందున్నాడు అందులేడనే సందేహం లేదు. వినగలిగిన చెవులు, తెలియదగిన మనస్సు, మేధస్సులు మరియు చూడగల్గిన దివ్య చక్షువులు ఉంటే పరమాత్మ తత్త్వానుభూతి అనుభవం లోనికి వస్తుంది. శ్రీకైవల్యం అనగా జన్మరహితమైన మోక్షానికి దగ్గరవుతాం. ఇందుకు బలాన్ని, ఫలాన్ని తెలియచేసే ఒక కథ చెప్తాను విను.

సూర్యవంశపు రాజులలో ఖట్వాంగుడు మంచి చక్రవర్తి. ధార్మికుడు. పరాక్రమవంతుడు. ఈయన పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించారు. ఒకమారు దేవతలకు దానవులతో యుద్ధం వచ్చింది. రాక్షసుల ధాటికి దేవతలు నిలవలేకపోతున్నారు. అప్పుడు దేవతలు అన్నివిధాలా సమర్థుడు, లోకాంతరం కూడా వచ్చి యుద్ధం చేయగలవాడు ఖట్వాంగ విభుడని గుర్తించి ప్రార్థించారు. దేవకార్యార్థియై ఖట్వాంగుడు స్వర్గానికి వెళ్ళాడు. దేవతల పక్షాన నిలిచి బలపరాక్రమాలతో రాక్షసులను ఓడించి, దేవతలకు విజయాన్ని సమకూర్చాడు. అప్పుడు దేవతలు ''రాజా! మీరు చేసిన సాయానికి ప్రతిఫలంగా వరాలు ఇవ్వాలని భావిస్తున్నాం. ఏం కావాలో అడగండి''

అన్నారు. అప్పుడు ఖట్వాంగుడు ''దేవతలారా! నాకు భౌతిక సుఖాలపై ఆసక్తి లేదు. ఈ జీవితం కలగన్న భాగ్యం. దయచేసి నాకు ఇంకా ఆయుష్షు ఎంత మిగిలి ఉందో చెప్పండి చాలు'' అన్నాడు. దేవతలు లెక్కకట్టి ''ఇంకా రెండు ఘడియలు మాత్రమే తమకు ఆయువు మిగిలి ఉంది'' అన్నారు. అంతే. ఖట్వాంగుడు ఏమీ భయపడలేదు. అలా అని కాలాన్ని వృథా చేయరాదని ఎంచి, వెంటనే దేవతల దగ్గర సెలవు తీసుకుని భూలోకానికి వచ్చాడు. అంతఃపురానికి వెళ్ళాడు. ఆత్మీయులందరికీ ఈ వార్త చెప్పాడు. శుచిస్నాతుడై గోవిందుని నామాన్ని జపిస్తూ, ధ్యానిస్తూ దేహాన్ని సంతోషంగా వదిలాడు. వైకుంఠం చేరుకున్నాడు. కొద్ది క్షణాలు పరమాత్మ నామ ధ్యానం ప్రశాంత నిర్మలమైన మనస్సుతో చేసి, అనాయాస మరణాన్ని, ఆనంద సుందరమైన శ్రీహరి సాయుజ్యాన్ని పొందడం జరిగింది.

కావున రాజా! నీవు కూడా ఆ దారిలో నడవాలి. నీకు ఏడు రోజులు సమయం ఉంది. భాగవత పురాణ కథనం విను. భాగవతం శ్రీహరి భక్తుల చరిత్రలు. భగవంతుని కన్నా భక్తి, భక్తులు మిన్న. రామనామ జపంతోనే ఆంజనేయుడు స్వామిని తన హృదయంలోనే కొలువు దీరేటట్లు చేయగలిగినాడు. భగవంతుడు ఆనందస్వరూపుడు. నోములు, వ్రతాలు, తపస్సు, యజ్ఞం కన్నా భక్తితో మాత్రమే వశమై మోక్షాన్నిస్తాడు స్వామి. భక్తిమార్గం సులభమైంది. కనుక విషయ వాంఛలను వదిలేయాలి. మనోవేగాన్ని బుద్ధితో కట్టివేయాలి. బుద్ధిని జీవాత్మతో ఏకం చేయగలగాలి. క్రమంగా జీవాత్మను శుద్ధాత్మతో చేర్చితే, ఆ తరువాత శుద్ధాత్మ పరమాత్మలో లీనం అవుతుంది.

ముందు నమ్మకం కావాలి. దైవం ఎదుట కూర్చుని నమస్కరించాలి. స్వామి తత్త్వాన్ని మననం చేయాలి. అందుకే స్మరణం, ధ్యానం, భజన, పురాణ శ్రవణం, పఠనం క్రమంగా అలవాటు పడితే, అందుకు సానుకూలంగా మనస్సు, మేధస్సులు ఏకమైతే మోక్షమార్గం సులభమౌతుంది.

అంటూ శ్రీ శుకులువారు పరీక్షిత్తునకు తత్త్వ జ్ఞానోపదేశం చేశారు. ఫలితంగా పరీక్షిత్తు కూడా ఆధ్యాత్మిక రీతి, నీతి, సంస్కృతితో, పరమాత్మ నామస్మరణతో పరమ పదాన్ని చేరుకొన్నాడు. దేహం నిత్యం కాదు. ఏదో ఒక రోజు మట్టిలోనికి లేదా అగ్ని లోనికి చేరవలసిందే. ఆత్మ నిత్యమైంది. సత్యమైంది. ఈ నిత్యమైన ఆత్మ సత్యమైన పరమాత్మలో లీనమైతే అదే మోక్షం.

''ఓం నమో నారాయణాయ'' అనే అష్టాక్షరీ మంత్ర జపం భవబంధ విముక్తికి, అమృతత్వానికి సహకరిస్తుంది అని నారాయణోపనిషత్ చెప్తోంది. ''తతోఽమృతత్వ మశ్నుతే'' అని ఇది సత్యం అని ఉద్ఘాటిస్తోంది. అలాగే ''నారాయణ సాయుజ్య మవాప్నోతి'' అని కూడా సెలవిచ్చింది.

కనుకనే నారాయణ తత్త్వం విశిష్టమైంది. నారాయణమంత్రం ముక్తిప్రదమైందని పెద్దల హితవు. నారద, ప్రహ్లాదాదులు నడిచిన మార్గమిదియే. **"ఓం నమో నారాయణాయ"**


రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

37వ భాగము


# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**– గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**


**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 37 వ భాగపు లీలల ప్రచురణ. (ఆగస్టు 2021 నుండి డిసెంబర్ 2021 వరకు).



### అనుభూతుల ప్రచురణ – వాటి ప్రభావము

తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశములో స్వామివారు ప్రసాదించిన లీలలను ఏప్రిల్ 2023 నుండి ప్రారంభించి గత 36 నెలల నుండి శ్రీవేంకటేశం మాసపత్రికలో ప్రచురిస్తున్నాము. నా వరకు ప్రతి భాగం ఒక అద్భుతమైన ఘట్టం. స్వామివారు ఈ లీలలను ప్రసాదించినప్పుడు ఎంతటి ఆనందానికి లోనైనానో అంతటి ఆనందం వ్రాయునప్పుడు కూడా కలగసాగింది. పైగా లీలను పొందినప్పుడు ఆ లీల అర్థం తెలిసేది కాదు. స్వామివారు ప్రసాదించారు కాబట్టి ఆస్వాదించాను. కాని ఈ అనుభూతుల ప్రచురణ సమయములో మాత్రం దాదాపు అన్ని లీలలు వాటి అర్థాలతో సహా ఎందుకు ప్రసాదిస్తున్నారు? ఏ మార్పు నాలో ఆశిస్తున్నారు? అనే విషయం స్పష్టంగా తెలిసింది. ఒకరకంగా నేను ఈ అనుభూతుల ప్రచురణలో ప్రతి భాగం వ్రాస్తున్నప్పుడు కొంత కొంత పరివర్తన చెందాను. నేను ఈ అనుభూతులను ఫిబ్రవరి 2023 నుండి వ్రాయుట ప్రారంభించి నేటివరకు అంటే 17-03-2024 నాడు 37వ భాగమును వ్రాస్తున్నాను. ప్రచురణతో సంబంధం లేకుండా వ్రాయుట ప్రారంభించిన నుండి ప్రతిరోజూ వ్రాస్తున్నాను. కాబట్టి ఇది నాలో ఎంతో సాధన చేసిన మార్పును కలుగజేస్తున్నది.

పూర్వము ఋషి భద్రుడు, ఋషి యాదగిరి అడవిలో ఏకాంతంగా తపస్సు చేసి యోగ్యత సాధించి స్వామివారిని పొందారు. తద్వారా భద్రాచలం మరియు యాదగిరిగుట్ట క్షేత్రాల ఏర్పాటుకు కారకులైనారు. అదేవిధంగా ఈరోజు స్వామివారు నన్ను ఎన్నుకొని వారు ఆశించిన స్థాయికి చేరమన్నారని భావించాను. సంఘములో నివసిస్తూ, ఆర్థిక విషయాలతో ఎంతో కొంత

సంబంధాన్ని కలిగి ఉంటూ, కుటుంబాన్ని పోషిస్తూ స్వామివారు ఆశించిన యోగ్యతను సాధించుట ఎంతో కష్టం. నిజానికి యోగ్యతనే ప్రధానంగా నాకు స్వామివారు రెండవ సేవగా ఈ కళ్యాణాల కార్యక్రమమును ప్రసాదించారు. ఒక పర్యాయం ''నీవు అవసరమైతే మూడవ సంకల్పము తీసుకొనైనా యోగ్యత సాధించి చిన్నగుండవెల్లిలో హరినామక్షేత్రము స్థాపించవలసి ఉందని'' చెప్పారు. అంటే... యోగ్యతే ప్రధానంగా స్వామివారి సేవ ఉండాలని అర్థం. గత కొన్ని రోజుల నుండి నేను యోగ్యత సాధించుటకు, 'నా' అన్నది వదులుటకు ఎంతో కృషి చేస్తున్నాను. సాధ్యమవడం లేదు. ఇదే కాలంలో ప్రతిభాగము వ్రాయునప్పుడు నాకోసం స్వామివారు పడిన బాధలను, కలిగించిన అనుభూతులను చూచి చలించిపోయాను. తప్పక యోగ్యత సాధించాలనే పట్టుదల కలిగింది. ఇలా ఒక ప్రక్క స్వామివారి అనుభూతులను అనుభవిస్తూ మరోప్రక్క కొంత పరివర్తన చెందసాగాను. అనుభూతులను ఆత్రుతతో అనుభవిస్తూ ఉండేవాణ్ణి. కాబట్టి ఈ సమయాన పరీక్షలకు ప్రిపేర్ అగుచున్నవాడిలా మరింత సన్నబద్ధాను. ఫిబ్రవరి 2023 నుండి తేది 17-03-2024 వరకు అనుభూతులను వ్రాయుట, శ్రీనివాస కళ్యాణాలను చేయుట తప్ప మరో విషయములో తల దూర్చలేదు, ఐదు నిమిషాలు స్వామిని విడువలేక ఉన్నానంటే నమ్మండి. ఎలాంటి కాలము వ్యర్థము కాకుండా, మా ఆఫీసును మా ఇంటి దగ్గరికి ఇందులకే స్వామివారు మార్చారని తెలుసుకున్నాను. మరియు స్వామివారి అనుభూతులను వారి భక్తులకు అందించుటకు, సంకల్పము నెరవేర్చుటకు ఉపయుక్తము కాబట్టి బలవంతాన నాచే 'శ్రీవేంకటేశం' మాస పత్రికను ప్రారంభింప చేశారని కూడా భావించాను.

ఇక ఈ 37వ భాగములో కూడా స్వామివారు నాలో ఏ మార్పు తీసుకు వచ్చుటకు ప్రయత్నించారో చూద్దాం! ఈ భాగం నుండి నాలో మరింత మార్పు దిశగా, చెప్పాలంటే ఏ స్థితిలో ఉండాలనే దిశగా లీలలు ప్రసరించారు. అంచెలంచెలుగా నాకు లోకంపై వైరాగ్యం చెందునట్లు, భగవంతునిపై వ్యామోహము పెరుగునట్లు చేశాడు. లౌకికమైన అన్ని విషయాలను, చివరికి కుటుంబ, పుత్ర పౌత్రులపై వ్యామోహం నశింప చేశాడు. పూర్వం ఋషులు సాధన చేసి భగవంతుణ్ణి పొందారు. కాని భగవంతుణ్ణి పొందేస్థితి వారికి ఎలా కలిగింది? ఆ సమయాన వారి అనుభూతులు, ఆ స్థితి చేరుటకు భగవంతుడి లీలలను నా ద్వారా లోకానికి తెలియజేయ దలచారనే భావమేర్పడింది.

## కర్తవ్యం బోధపడుట

స్వామివారి అనుగ్రహము పొందాలని నేనెంతో తపించిపోయేవాడిని. ఎదురైన ఏ ఒక్క అవకాశమును వదిలేవాడిని కాదు. అలాంటిది 18 సంవత్సరాల జప సమర్పణ ఫలితమును నాకు కొంతైనా ఇవ్వకుండా వారి భక్తులకు పంచి పెట్టారు. దీనితో నేను తీవ్ర బాధకు లోనైనాను. రెండవసారి నా అనుభూతులను స్వామి ఆజ్ఞచే చదివిన తరువాత జపసమర్పణ ఫలితమును తన భక్తులకు పంచిపెట్టమని నేనే ప్రార్థించాను. స్వామివారు నా ప్రార్థన అనుసారం మొదటి సంకల్పము యొక్క పూర్తి ఫలితమును తన భక్తులకు పంచిపెట్టారు. మళ్ళీ నేను ఈ సంకల్ప ఫలమును ఆశించకుండా చేశారు. అయితే ఈ సంకల్ప ఫలితం ఎంతో కొంత నాకు ఇవ్వలేదనే బాధ నాలో ఉన్నప్పటికీ నేను మాత్రం నా సేవక ధర్మాన్ని గుర్తు చేసుకున్నాను. నేను నీ వాడినని, మీరు ఎలా చెబితే అలా చేయుదునని, దుఃఖించనని మీ సేవకుడిగా ఉండుటే నా కర్తవ్యంగా భావిస్తున్నానని అన్నాను. కాని స్వామివారిని పొందనందుకు నా మనస్సులో బాధ పూర్తిగా తగ్గలేదు. ప్రతి జపసమర్పణలో నేను కొంత జపము వ్రాసిన వాణ్ణైనప్పటికీ, నాకు ఇతర భక్తులంత ఫలితము కూడా ఇవ్వనందుకు మనస్సులో బాధ కలిగింది. అందుకని చివరిసారి స్వామివారిని ఒక ప్రశ్న అడగాలని అనుకుని ఈ విధంగా అడిగాను.

తేది 26-08-2021 : ప్రభూ నేను మీకు సేవకుడిని. నన్ను మీరు మీ ఇష్టం వచ్చినట్లు వాడుకోవచ్చు. నాపై మీకు సంపూర్ణ అధికారము ఉన్నది. జప సమర్పణ ఫలితాన్ని భక్తులకు పంచుటలోని మీ నిర్ణయాన్ని శిరసా వహిస్తున్నాను. కాని నేను ఒక అజ్ఞానిని కావున మిమ్ములను ఈ ప్రశ్న వేయుచున్నాను. దయచేసి జవాబివ్వండని వేడుకున్నాను.

నన్ను మీరు 'నా' అన్నది వదలమన్నారు. నా ప్రకారం 'నా' అన్నది అంటే ధనము, ధాన్యము, కీర్తిప్రతిష్టలు, అహంకారమును పెంచేవి అని అనుకుంటున్నాను. కాని 'నా' అన్నది అంటే భగవంతుని పైనున్న కోరికను కాదు కదా? భగవంతునిపై నున్న కోరిక పెరగాలంటే 'నా' లేక ''నేను నాది'' అన్నది వదలమని చెప్తుతుంటారు. భగవంతుణ్ణి పొందుటకు ఇవి ఆటంకము కావున అలా చెబుతారు. కానీ భగవంతుణ్ణి వదులుకోమని ఎవ్వరూ చెప్పరు కదా! నాకు మిమ్మల్ని వదులుకొనుటలో బాధ కలుగుచున్నది. మీరు మీ భక్తులకు ఈ ఫలమును పంచుటలో నాకు ఏ మాత్రమూ బాధ లేదు. కాని నాకు దొరకలేదనే బాధ నన్ను వెంటాడుతోంది. ఇక మీ ఇష్టం, నిజానికి ఇంతటి సేవ, మీరు ప్రసాదించిన ఎన్నో అనుభూతులు, మరెన్నో ఆనందాలతో నా జీవితం ధన్యమైంది. నన్ను 'సాయిరెడ్డి నావాడని' మీ నోటితో పిలిచారు, మోహినీ రూపము చూపెట్టి మీ పాదసేవకుడిగా స్వీకరించారు, నా ముందు వెనుక మీరున్నారని చెప్పారు, అత్యంత అరుదైన మీ ఆలింగన సుఖమును ప్రసాదించారు, బలిచక్రవర్తిలాగా నా తలపై మీ పాదములను పెట్టారు. ఇంతటి అనుగ్రహాలను పొందాను. ఐనప్పటికీ మిమ్మల్ని మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తున్నది, ఏ

చిన్న అవకాశమును వదులుకోవాలనిపించదు, అందుకే మళ్ళీ మళ్ళీ మిమ్మల్ని అడుగుచున్నాను. దయచేసి నా ప్రశ్నలకు సమాధానము చెప్పండి. మీరు కూడా భక్తుణ్ణి బాధ పెట్టినట్లు ఉండకూడదు. మళ్ళీ అడిగి మిమ్మల్ని వేధించుట ఇష్టం లేదు. ఇదే అంతిమ నిర్ణయము అని చెప్పి ప్రార్థించాను. నా కళ్ళవెంట నీరు కారుచుండగా దీనంగా ప్రార్థించాను. ఆ రాత్రి స్వామివారు నా ప్రశ్నకు జవాబు చెప్పుదురని ఆశించాను. కాని ఎలాంటి సందేశం పొందలేదు. అందుకని స్వామివారిని ఇకనుండి వేధించకూడదని భావించి తెల్లవారి ఈ విధంగా క్షమా ప్రార్థన చేశాను.

**తేది 27-08-2021:** నిన్న స్వామివారిని పొందలేకపోతున్నందుకు తీవ్రమైన నిరాశ, నిస్పృహతో వేసారి ఆత్రుతతో స్వామివారిని రకరకాలుగా అడిగాను, నాకంటూ ఆశలు కోరికలు ఉంటాయి కదా! 'నా' అన్నది వదలమన్నారు కాని భగవంతుణ్ణి పొందాలనే కోరికను వదలమని చెప్పలేదు కదా! 'నా' అన్నది వదిలితే భగవంత్ చింతన, ఆయనను పొందాలను భావన మరింత పెరుగును కదా. నేను ఏ తప్పు చేశాను నన్ను ఎందుకు ఆ భాగ్యానికి దూరం పెడుతున్నారు? నాకు బాధ కలుగుచున్నదని రకరకాలుగా ప్రార్థించాను. నా వ్యధను ఆయనకు తెలిపాను. ఒకరకంగా స్వామివారిని బాధపెట్టాను. నిజానికి ఇంతవరకు నేను పొందిన అనుభూతులు, ఆయన కృప ఎంతో గొప్పవి. ఇంతటి భాగ్యాన్ని పొందాను మరి చాలదా? అనే భావన నాలో ఈరోజు కలిగింది. నేను స్వామి సేవకుడిని, ఆయన ఏ పని చెబితే దానిని ఎదురు మాట్లాడకుండా చేయుట నా కర్తవ్యం. కాని నేను ఎదురు తిరిగి ప్రశ్నించాను కాబట్టి నిన్న స్వామివారిని బాధపెట్టానని, నా కళ్ళనుండి నీరు ధారలుగా కారుచుండగా, తప్పు చేశానన్న భావనతో క్షమించమని మరి మరి వేడుకున్నాను. ఒక సందర్భములో స్వామివారు నన్ను వారి ఆంతరంగిక సేవకునిగా నియమించుకున్నారు. భక్తులను అనుగ్రహించుట భగవంతుని లక్షణమైతే... ఆ భగవంతుని అవసరాలు తీర్చుట ఆంతరంగిక సేవకుని లక్షణమని గుర్తించాను. నేను సాధారణ భక్తుని లాగా ఆయన అనుగ్రహమునకై ప్రాకులాడకూడదు. స్వామిని సేవించుట, వారి అవసరాలు తీర్చుట, భక్తులకు వారి అనుగ్రహము లభించే విధంగా చేయుట, నా కర్తవ్యమని తెలుసుకున్నాను. కాబట్టి మళ్ళీ ఇలాంటి ఘటన తిరిగి ఉండదని, మిమ్మల్ని ప్రశ్నించను అని, మీ ఆజ్ఞను శిరసా వహిస్తానని నా కళ్ళలో నీరు కారుచుండగా వేడుకున్నాను. నేను మూర్ఖుడనని, ఎలా వ్యవహరించాలో తెలియని అజ్ఞానినని క్షమించండి ప్రభూ అంటూ పశ్చాత్తాపముతో వేడుకున్నాను. మరియు ఈ జపసమర్పణ ఫలితము గురించి మరొక్కసారి అడుగకూడదని భావించాను. అంతేకాదు ఇక ముందు చేయబోయే అన్ని స్వామి కార్యాలను ఏమీ ఆశించకుండా, గోవింద దాసు కర్తవ్యంగా నిర్వహించాలనుకున్నాను. పని చేయుటే మనవంతు, ఫలితము భగవతేచ్ఛ! అనే విషయమును గుర్తు తెచ్చుకున్నాను. ఇంతకుముందు చూపే శ్రద్ధలో కాని, సామర్థ్యములో కాని, ఆసక్తిలో కాని ఏ మాత్రమూ తక్కువ కాకుండా నిర్వహించుదునని ప్రమాణము చేశాను. చివరికి జప సమర్పణ ఫలితమును పొందాలనే భావనను మరచాను.

నిజానికి నా జపసమర్పణ సంకల్పములో, ఫలితమాశించక గోవిందదాసుగా మిగిలిపోవాలన్నదే నా లక్ష్యం. అలాంటిది ఏదో ఫలితమును ఆశించుట నా తప్పే ప్రభూ క్షమించమని అన్నాను. ఇలా ఎన్నోసార్లు ఫలితానికై ఆశపడి చివరికి ఆ ఫలితము ఆశించనని నాలో మార్పు చేసుకున్నాను. ఆ తరువాత కాలంలో ఏనాడూ మళ్ళీ ఇలాంటి ఆలోచనలు రాలేదు.

## తిరుమల శ్రీవారికి 19వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

తేది 29-08-2021 రోజున సాయంత్రం 5 గంటల ప్రాంతమున అలిపిరి వద్ద శ్రీవారి పాదాల మండపము పైన 19వ పర్యాయంగా 7 కోట్ల జపమును తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి పాదపద్మములకు సమర్పించుట జరిగింది. కరోనా ప్రభావము వలన రథయాత్ర లేకనే కార్యక్రమము జరిగింది. టిటిడి వారే వారి వాహనములో ఈ జపమును గోశాల నుండి అలిపిరికి, మళ్ళీ అలిపిరి నుండి గోశాలకు తీసుకెళ్ళారు.

ప్రతిసారి లాగానే జపమును పాదాలకు సమర్పించే ఒక వారం పది రోజుల ముందునుండి నాకు స్వామివారి పాదాలను కడగాలనే బలమైన కోరిక కలగడం జరిగింది. ఫలితంగా స్వామివారిని పదే పదే తమ పాదాలను కడిగే అవకాశమును ఇవ్వమని మరి మరి వేడుకున్నాను. ఇప్పటికి 19 సార్లు స్వామివారి పాదాలను జపసమర్పణ సమయాన కడిగాను. ప్రతిసారీ జపసమర్పణ సమయాన టిటిడి ఈఓ గారు అనుమతిని మంజూరు చేస్తారు. అందులో స్వామి పాదాలను కడుగుట, పాదపూజ చేయుట, ఎస్వీ గోశాలలో యజ్ఞం చేయుట, జపం సమర్పించుట ఆ తర్వాత స్వామి దర్శనం లాంటి అంశములు ఉండును. కాని ప్రతిసారీ దీనిని నేను మరిచిపోవుదును. తిరుపతికి బయలుదేరుటకు వారం పది రోజుల ముందునుండి నాకు స్వామివారి పాదములను కడగాలని, పాదపూజ చేయాలనే బలమైన కోరిక కలుగుతుంది. దీనితో రకరకాలుగా ఆయన పాదాలు కడిగే అవకాశము ఇవ్వమని దీనంగా నా కళ్ళనుండి నీరు కారుచుండగా ప్రార్థిస్తాను. ఆ పాదాలను కడగాలనే నాలోని కోరికను ఈ అలిపిరి వద్ద పాదపూజ సమయాన తీర్చుకుందును. మహదానందము అనుభవిస్తాను. ఆకలి గొన్న వారికి రుచి ఎక్కువన్నట్లు ఆయన పాదపూజ చేయాలనే తపనతో ఉండుట వలన దాని ఆనందము ఎన్నో రెట్లు పెరుగుతుంది. మొత్తం జప

సమర్పణ కార్యక్రమములో అలిపిరి వద్ద జరుగు పూజ ప్రత్యేక ఆనందమును ప్రసాదిస్తుంది.

స్వామివారు, నేను రథం తయారు చేయు సమయాన పాదాల మండపము, దానిలో నాలుగు దిక్కులలో అభిషేకానంతర రూపములో నిలబడి ఉన్న రూపాలు, ముఖ్యంగా మూడు ప్రక్కల రూపాలు నాకు ప్రత్యక్షంగా కనబడును. నేను అందులోని ఒక రూపమునకు, ఆయన పాదాలకు పూజ చేయుదును. దాదాపు ఆరేడు అడుగుల ఎత్తుతో నల్లని రూపముతో నిజపాద దర్శన రూపము కనబడును. దానిని నా మనస్సులో నింపుకొని దానినే ధ్యానిస్తూ పూజను సమర్పిస్తాను. తేది 29-08-2021 నాడు కూడా నాకు అలాగే ఈ దివ్యరూపం కనపడింది. దానికే పూజ చేశాను, పరవశించిపోయాను.

పాదాల మండప స్టాఫ్ కూడా ఎంతో సహకరిస్తారు. మేమంటే వారికి ఎంతో ఇష్టం. పాదాలు ఇచ్చి పూజ చేసుకొమ్మని చెప్పుదురు. ఎస్వీ బీసీ వారు కవర్ చేశారు.

ఈ విధంగా పాదాల వద్ద పూజ ముగిసిన తరువాత తేది 30-08-2021నాడు ఎస్వీ గోశాలలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద పూజ జరిగింది. ఒక ప్రక్క యజ్ఞం, మరో ప్రక్క విష్ణు సహస్రనామ యుక్తంగా స్వామివారి మహామంత్రమును అనుసంధానము చేయుచు పూజ చేశాము. కరోనా ప్రభావము కావున తక్కువమంది భక్తులు వచ్చారు. ఈఓ శ్రీమాన్ జవహర్ రెడ్డి గారు మరియు ఛైర్మన్ ఎస్.వి.సుబ్బారెడ్డి గారు వచ్చారు. వీరిని పూర్ణకుంభ స్వాగతముతో ఆహ్వానించాము. మొదట వీరు యజ్ఞపూర్ణాహుతి కావించారు. ఆ తరువాత స్థూపము వద్దకు వచ్చి జపానికి పూజలు జరిపారు. జపము వ్రాసినవారి కోరికలు తీర్చమని ప్రార్థించారు. ఆ తరువాత కొంత జపమును వారి తలలపై పెట్టుకుని స్థూపం చుట్టూ ఒక ప్రదక్షిణ చేసి స్థూపంలో స్వామివారికి సమర్పించారు. ఆ తరువాత 20వ పర్యాయంగా 7 కోట్ల జపమును ప్రారంభించారు. ఆ తరువాత నేను నా తృప్తి కోసం వారిని శాలువాలతో సత్కరించాను. ఆ తరువాత భక్తులు తలా కొంత జపమును స్థూపములో సమర్పించారు.

తెల్లవారి కొండపైన స్వామివారిని దర్శించుకున్నాము. గుడి చుట్టూ సంకల్పము నెరవేర్చుమని ప్రార్థిస్తూ 3 ప్రదక్షిణలు చేశాము. తరువాత హైదరాబాద్ వచ్చాము. ఆ తరువాత ఈ 19వ పర్యాయపు జప సంకల్ప ఫలితమును స్వామివారికి ధారపోశాను. స్వీకరించమని వేడుకున్నాను. మరియు తిరిగి కళ్యాణాల కార్యక్రమముపై దృష్టి పెట్టాను.

## శ్రీనివాస కళ్యాణముల విజయం కోసం ప్రార్థన

**తేది 12-09-2021 :** 2020 సంవత్సరం దసరా రోజున స్వామివారి కృపతో, శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణాలు అనే కార్యక్రమమును ప్రారంభించాము. దీని ప్రకారం మొత్తం 111 కళ్యాణాలను భక్తులచే జరిపించాలని నిర్ణయించాము. కాని కోవిడ్ మూలంగా, మరియు కళ్యాణ సింహాసనములు తయారులో ఆలస్యము కారణంగా ఈ కార్యక్రమము త్వరగా మొదలుకాలేదు. సంవత్సరానికి కనీసం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకూడదనే నిబంధన ఉల్లంఘించునట్లు అగునని బాధపడుచున్న సమయాన చివరికి తేది 20-07-2021 తొలి ఏకాదశి రోజున మొదటి కళ్యాణం జరిగింది. కాని వచ్చే దసరా లోపల 7 కళ్యాణాలు చేస్తేనే విజయము సాధించగలము. లేకుంటే ఈ రెండవ సంకల్పములో ఓడిపోగలను. తేది 12-09-2021 వరకు మొత్తం నాలుగు కళ్యాణాలను నిర్వహించాము. ఈ సంవత్సరం దసరా అంటే తేది 15-10-2021 వరకు 7 కళ్యాణాలను నిర్వహించగలనా అని చింతిస్తూ స్వామివారిని ప్రార్థిస్తున్నాను. నాకు ఈ సంకల్పములోనైనా విజయము సాధించి పెట్టమని ప్రార్థిస్తున్నాను. ఈ మొదటి సంవత్సరములో, 84 రోజుల్లో 7 కళ్యాణాలను నిర్వహించాలి. మరియు లోకంలో దీని ప్రచారం ఇప్పుడే మొదలైంది. కళ్యాణాలను చూచి ఇష్టపడి చేయించాలనే కోరిక కలిగినవారు ప్రారంభములోనే ఉన్నారు. కాబట్టి ఈ మొదటి సంవత్సరములో కష్టపడి ఈ 7 కళ్యాణాలను నిర్వహించి విజయము సాధించితే మిగిలిన కళ్యాణాలను చేయుటలో, విజయము సాధించుటలో ఇబ్బంది ఉండదనే భావన కలిగింది. కాబట్టి స్వామివారిని నన్ను విజయుణ్ణి చేయమని రకరకాలుగా ప్రార్థిస్తున్నాను. అంతేకాక ప్రతి కళ్యాణములో మీ కృప అందరికీ లభించాలని, వారికి మీ కళ్యాణాలు చేసుకోవాలనే కోరిక కలగాలని, అప్పుడే నన్ను సంప్రదించగలరని ప్రార్థించాను. నా వరకు నేను ఏ పొరపాట్లు జరగకుండా నా బాధ్యతను చక్కగా నిర్వహిస్తానని, మిగిలినది మీరే చూచుకోవాలని, తమరు తలచుకుంటేనే విజయం సాధించగలనని లేకుంటే లేదని, అంతా తమ కృప అని అత్యంత దీనంగా ప్రార్థిస్తున్నాను.

రాబోవు దసరా అంటే తేది 15-10-2021 లోపల కనీసం 7 కళ్యాణాలను చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేయసాగాను. ఓడిపోతాననే భయము, బాధతో స్వామివారిని తీవ్రంగా ధ్యానిస్తున్నాను. ఎలాగైనా విజయము సాధించాలని నా మనస్సు ఉరకలేస్తోంది, భయంతో రక్తం పరుగులు తీస్తోంది. శరీరం నుండి నిప్పురవ్వలు, పొగల రూపములో బయటికి వస్తున్నట్లు నా మనస్సులో ఆందోళన కలిగింది. తెలిసిన ప్రతి వారికి ఈ కార్యక్రమము గురించి చెప్పుచు నిర్వహించమని చెప్పేవాడిని. ముఖ్యంగా గత కొన్ని సంవత్సరాల నుండి రథయాత్రను ఆహ్వానించిన వ్యక్తులకు, కాలనీ వాసులకు ఈ విషయాన్ని చెప్పి ప్రోత్సహించేవాడిని. ఈ కళ్యాణం వారి జీవితములో ఒక మరపురాని రోజుగా ఉండిపోగలదని చెప్పేవాడిని. గెలిచినా ఓడినా ప్రయత్న లోపము ఉండకూడదని తీవ్రంగా శ్రమించాను.

స్వామివారినే గట్టిగా పట్టుకుని విజయము సాధించి పెట్టుమని ప్రార్థించాను. మరియు ఈ మొత్తం కళ్యాణ కార్యక్రమములో ప్రతి 7వ కళ్యాణమును ఒక మెట్టుగా భావించాను. కాబట్టి ప్రతి 7వ కళ్యాణము ఒక విశిష్ట కళ్యాణముగా జరగాలని కూడా ప్రార్థించాను. 6వ కళ్యాణము తేది 25-09-2021 నాడు జరిగింది. చివరికి తేది 02-10-2021 నాడు హబ్సీగూడ వీధి నెం.8 లోని రామాలయంలో 7వ కళ్యాణము జరుగుటకు నిశ్చయమైంది. ఎంతో ఆనందించాను. మరియు మిగిలిన 104 కళ్యాణములు ఏ ఇబ్బంది లేకుండా జరగగలవని అనుకున్నాను. సంకల్పంలో విజయం సాధించినంత సంతోషం కలిగింది. మరియు స్వామివారికి శతకోటి ప్రణామాలను అర్పించాను. ఈ సందర్భంగా స్వామివారు ఒక చిన్న కలను ప్రసాదించారు.

**తేది 29-09-2021 కల :** ఈ కలలో కళ్యాణమునకు సిద్ధం చేస్తున్నాము. వేదిక పైన ఒక పళ్ళెములో కొబ్బరికాయలు, పండ్లు మొదలగు వాటిని స్వామివారికి సమర్పించుటకు సిద్ధం చేస్తున్నాము. కళ్యాణము జరుగబోవుచున్నది. ఇంతే కల.

నేను ఆరాటపడుతున్న 7వ కళ్యాణము జరుగబోవుచున్నది, బాధపడకు అని బహుశా దీని అర్థమై ఉండవచ్చని భావించాను.

తెల్లవారి అంటే తేది 30-09-2021 నాడు మరో కల కన్నాను. దీని అర్థం మాత్రం వింతగా ఉన్నది.

**తేది 30-09-2021 కల :** నేను మా ఇంటిలోని సామానును ఒక క్రొత్త ప్రాంతానికి తరలించుటకు వీలుగా ప్యాక్ చేసి ఒక ట్రాన్స్ పోర్టు కంపెనీలో వేశాము. వారు ఈ సామానును వారి వాహనములో వేసుకొని నాకు రిసీప్ట్ ఇచ్చారు. మరియు ఇలా అన్నారు, ''ఇవి ఎలాంటి లోటుపాట్లు లేకుండా మీరు ఎక్కడంటే అక్కడ దింపుకోవచ్చు. చాలా భద్రంగా మీ గమ్యస్థానములో దింపుదు''మన్నారు. కాని ఆ తరువాత నాకు అర్థం అయింది, వీరు చాలా ప్రాంతాలు తిరుగుచు మేము కోరిన చోటికి వస్తారు. అంత దూరం నుండి రావడం అవసరమా? మేము నేరుగా ఆ స్థలానికి తీసుకువెళ్ళవచ్చు కదా అని అనుకున్నాను. కల చెదిరింది.


దీనర్థం బహుశా ఇక ఎలాగైనా 111 కళ్యాణాలను చేయుటలో కష్టం లేదని భావించాను. కాబట్టి నేను నా స్థావరమును హైదరాబాద్ నుండి హరినామ క్షేత్రమునకు మారగలననే భావము నా మనస్సులో ఉన్నదని సూచించారు. మరియు యోగ్యతని సాధించకుండా నేరుగా హరినామ క్షేత్రము సాధించాలనే భావం నా మూలంలో స్థిరపడిందని సూచించారు. కాని స్వామివారు మాత్రం ముందున్నది ముసళ్ళ పండుగని గుర్తు చేశారు. కళ్యాణాలు చేయుట ముఖ్యం కాదు, యోగ్యత సాధించుటే ముఖ్యం. ఒకవేళ దీనిలో కూడా యోగ్యత సాధించని పక్షంలో 3వ సంకల్పం తీసుకోవలసి ఉంటుందని గతంలో చెప్పారు.

## 7 వ కళ్యాణం ఒక నిబంధన పూర్తి – స్వామివారి చిరునవ్వు

తేది 02-10-2021 రోజున వీధి నెం.8, హబ్సీగూడ రామాలయం కళ్యాణ వేదికలో ఉదయం 10.30 గంటల నుండి 7వ శ్రీనివాస కళ్యాణము శ్రీరామాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం 8.15 గంటలకు కళ్యాణ సామగ్రితో 'నమో వేంకటేశాయ రథం' వెళ్ళింది. దీనిని వారు పూర్ణకుంభ స్వాగతముతో, గోమాత సహితంగా ఆహ్వానించారు. కోలాటాలు, భజనల యుక్తంగా ఎంతో ఆనందంగా స్వామివారిని ఎదుర్కొన్నారు. ఊరేగింపుగా కళ్యాణ ప్రాంగణము వరకు ఈ ఎదుర్కోళ్ళ కార్యక్రమం జరిగింది. చివరికి ఉదయం 10.30 గంటలకు 7వ కళ్యాణము అంగరంగ వైభవంగా జరిగింది. దాదాపు 500 మంది భక్తులు హాజరైనారు. అన్నమయ్య కీర్తనల మధ్య కళ్యాణం మధురంగా జరిగింది. చూచిన ప్రతి భక్తుడు ఆనందించారు. చివరికి కళ్యాణం తరువాత కోలాటాలు ఆడారు. మరియు అన్నప్రసాదాలతో ముగిసింది.

ఈవిధంగా మేము సంకల్పించిన మొత్తం 111 కళ్యాణాలలో భాగంగా 7వ కళ్యాణం అత్యంత ఆనందంగా జరిగింది. దసరా లోపల 7 కళ్యాణాలు చేయాలనే నా సంకల్పానికి అనుగుణంగా జరిగింది. ఇలా నా సంకల్పములోని ఒక ఆంతరంగిక నిబంధన పూర్తైనది. చాలా సంతోషించాను. ఇది నా స్వామివారి దయా దాక్షిణ్యాల వలననే సాధ్యమైంది, అని తలంచి తేది 03-10-2021 నాడు స్వామివారికి కృతజ్ఞతలను తెలుపుటకు నాచారం హెచ్.ఎం.టి ఆలయానికి వెళ్ళాను. అక్కడ కృతజ్ఞతలను తెలుపు సమయాన ఒక అద్భుత లీలను ప్రసాదించారు. చిన్నపిల్లలను కావాలని గెలిపించి పెద్దవారు నవ్వినట్లు నవ్వారు.

**తేది 03-10-2021 లీల :** నన్ను స్వామివారు 7 కళ్యాణాలను జరిపించి గెలిపించి నందులకు కృతజ్ఞతలను తెలుపు నిమిత్తమని శ్రీవేంకటేశ్వరుని ఆలయానికి వెళ్ళాను. స్వామివారి ఎదురుగా నిలబడి రెండు చేతులతో దండం పెట్టుచు ఆ స్వామివారినే తదేక దృష్టితో చూస్తూ ప్రార్థిస్తున్నాను. ఆ సమయాన భక్తులు ఎవ్వరూ లేరు. ప్రధాన పూజారి శ్రీమాన్ వేంకటేశ్వర ప్రసాదరావు గారు మాత్రం స్వామివారికి నేను అర్పించిన తులసిమాల, పూలు, టెంకాయ సమర్పించి నా వైపు వస్తున్నారు. నేను మాత్రం స్వామివారిని తదేక దృష్టితో సహాయం చేసినందులకు కృతజ్ఞతా భావంతో ప్రార్థిస్తున్నాను. ఆలయ పూజారితో ఇలా నా కళ్యాణ సంకల్పములోని, ఒక సంవత్సరములో 7 కళ్యాణాలను పూరించాలనే ఒక నిబంధన పూర్తైంది. అందుకు స్వామిని దర్శించి ఆశీర్వాదము తీసుకొనుటకై వచ్చానని తెలుపు సమయాన స్వామివారు ముసి ముసిగా నవ్వాడు. ఉన్నట్టుండి స్వామివారి విగ్రహపు రెండు పెదవులు విచ్చుకొనుటను స్పష్టంగా చూచాను.




నా ప్రార్థనకు
స్వామి వారి చిరునవ్వు

ఆ పెదవులపై ముసిముసి నవ్వును చూచాను. ఒక్కసారి ఆయన పెదవులు కదిలినట్లు ముసి ముసి నవ్వులు చిందించినట్లు ఒక్కక్షణం కనబడింది. వెంటనే మళ్ళీ ఆయనను చూచేసరికి ఆ నవ్వు మాయమైంది. ఇలా నన్ను గెలిపించి సంతోషించునట్లు చేశారు. ఎంతో ఆనందించాను.

## ఆదమరచి ఉండరాదని చెప్పట

నేను ఈ రెండవ సంకల్పములో కేవలము రెండున్నర నెలలలో స్వామి కృపతో 7 కళ్యాణాలు చేసి విజయం సాధించాను. మిగిలిన కాలములో ప్రతి సంవత్సరం 7 కళ్యాణాలను చేయుట ఏమంత కష్టం కాదనే భావనతో ఉన్నాను. ఒకరకంగా నిర్భయంగా మొత్తం సంకల్పములో విజయం సాధించినంత ఆనందమును అనుభవించాను. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు అంతటి సంతోషం వద్దని, ఆదమరచి ఉండరాదని, నిరంతరం శ్రమిస్తూ ఉండాలనే ఒక అద్భుతమైన లీలను ఈ క్రింది విధంగా చూపాడు. ఒకవిధంగా నేను మొత్తం హరినామ క్షేత్రం సాధించువరకు లేదా స్వామివారు మా ఇంటికి వచ్చువరకు ఏ చిన్న తప్పు చేయరాదన్నారు. నేను కష్టపడకున్నా... స్వామివారు తప్పక మా ఇంటికి వస్తారనే భావమును తొలగించుమని చెప్పాడు. ఏ చిన్న విరామం వద్దన్నాడు. ఒకరకంగా జీవితానికి ఈ లీల దిశానిర్దేశం చేసింది. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 05-10-2021 కల :** ఈ కలలో నేను మా ఇంటిలో ఉన్నాను. కాని ఈ ఇల్లు ప్రస్తుతము నేను నివసిస్తున్న హైదరాబాద్ లోనిది, లేదా ఊరిలోనిది కాదు, మరో క్రొత్త ప్రదేశములో ఉన్నది. ఇది అప్పుడప్పుడే డెవలప్ అగుచున్న కాలనీ. ఒక 45X70 సైజు గల 350 గజముల స్థలములో కాంపౌండ్ చుట్టూ కొంత స్థలము వదిలి మధ్యభాగములో ఇల్లు నిర్మించుకున్నాము. ఆ ఇల్లు అప్పుడప్పుడే నిర్మించినట్లు ఉన్నది. ఇంకా కొన్ని చిల్లర పనులు మిగిలి ఉన్నవి. ఈ ఇంటికి ముందు భాగములో ఒక ధ్వజ స్తంభమును కట్టుచున్నాము. సిమెంట్ పని అయింది. ఒకరకంగా ఈ ఇల్లు నా స్వామివారి దేవాలయములాగా ఉన్నది. ఇంకా పూర్తిగా కలరింగ్ కాలేదు.

ఈ ఇంటికి ముందు వెనుకాల రెండు వైపులా రోడ్లు ఉన్నవి. ప్రతి రోడ్డు వైపు ఆ ఇంటికి ద్వారములు ఏర్పాటు చేసుకున్నాము. నేను ఇల్లు వెనకాల ఉన్న ద్వారములో నిలబడ్డాను. అంతకుముందే స్వామివారు మా ఇంటి నుండి ఏదో ఉత్సవాలలో భాగంగా ఊరంతా తిరుగుటకు యాత్రకై వెళ్ళారట. యాత్ర ముగించుకొని వెనుక దారిలో దూరం నుండి స్వామివారి యాత్ర మా వైపు వస్తున్నది. తిరుమలలో మలయప్ప స్వామి ఊరేగినటుల అదేవిధంగా కట్టెపల్లకీపై

మలయప్పస్వామి వారు, ఇరువురు దేవేరులతో కలిసి, భక్తులు పెద్దయెత్తున వాయిద్యాలు మ్రోగిస్తుండగా మా ఇంటివైపుకు వస్తున్నారు. స్వామివారి ముందు పెద్ద పెద్ద డోలు వాయిద్యాలను వాయిద్యకారులు బలంగా మ్రోగిస్తున్నారు. ఆట పాటలతో ఈ ఊరేగింపు అత్యంత నెమ్మదిగా వస్తోంది. ఈ స్వామివారు మా ఇంటినుండి బయలుదేరి వెళ్ళారట. ఇప్పుడు తిరిగి మా ఇంటి వైపు విచ్చేయుచున్నారు. ఈ మొత్తం యాత్రకు, అప్పటి మా శ్రీవేంకటేశం మాసపత్రిక గౌరవ సంపాదకురాలు డా|| పులిగడ్డ విజయలక్ష్మి గారు నాయకత్వం వహిస్తున్నారు. వీరు ఈ యాత్ర ముందర నడుస్తూ మా ఇంటి వైపు వస్తున్నారు. కాబట్టి చూచిన ప్రతివారు స్వామివారు తప్పక మా ఇంటికి వస్తారని భావిస్తారు. నేను కూడా అలాగే నమ్మాను. కాని ఇంతలో ఒక హృదయాంతర భావం నాలో ఈ విధంగా నిండింది. ''స్వామివారు మా ఇంటినుండి బయలుదేరినప్పటికీ, ఆయన స్వతంత్రుడు, ఎవరి ఆజ్ఞకు కట్టుబడడు కాబట్టి తిరిగి మా ఇంటికే రావలసిన పని లేదు. కాని మాపై నున్న ప్రేమతో మా వైపుకు వస్తున్నారు'' అనే భావం బలంగా ఏర్పడ్డది. ఐనప్పటికీ ఈ యాత్ర మా పులిగడ్డ విజయలక్ష్మిగారి ఆధ్వర్యములో జరుగుచున్నది కాబట్టి తప్పక మా ఇంటికి రాగలరని నేను అనుకున్నాను. ఈలోగా ఈ వాయిద్యాలు వాయించు ఒక వ్యక్తి నన్ను చూచి రెండడుగులు ముందుకు వేసి, మరింత రెచ్చిపోయి బలంగా వాయిస్తున్నాడు. ఒకరకంగా ఈయన నాకు తెలిసినవారుగా యాత్ర మా ఇంటికే వస్తున్నట్లు సూచించాడు. యాత్ర చివరి దశకు చేరుతుంది కాబట్టి ఈ వాయిద్యకారులు రెట్టింపు ఉత్సాహముతో వాయిద్యాలను వాయిస్తున్నారు. ఈ యాత్ర తిరుమల శ్రీవారిదే అన్నట్లుంది. పైగా చాలా నెమ్మదిగా మా ఇంటివైపు వస్తూ దగ్గరి వరకు వచ్చింది. స్వామివారు మా ఇంటికే వస్తున్నారని భావించి, ఇంటి వెనుక వైపు ద్వారములో ఉన్న నేను ముందువైపు ద్వారమునకు స్వామివారిని ఆహ్వానించుటకు వచ్చాను. కాని ఈ అతి కొద్ది సమయములోనే స్వామివారు మా ఇంటి చుట్టూ తిరిగి వెళ్ళిపోయారు. వారు శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారి ఆశ్రమానికి ఏదో ఒక పని నిమిత్తమై వెళ్ళారట. అక్కడ పని పూర్తి కాగానే తిరిగి వస్తారని అక్కడి భక్తులు నాతో చెప్పారు. ఇంతే కల.

దూరం నుండి స్వామివారు మా ఇంటికి రావటానికే వస్తున్నారని భావించాను. అక్కడి వాతావరణము, దప్పు చప్పుడు చేయువారు, అందరూ కూడా స్వామివారు మా ఇంటికే వస్తున్నట్లు సూచనలిచ్చారు. నేను కూడా అలాగే విశ్వసించాను. ఎందుకంటే మా శ్రీవేంకటేశం మాసపత్రిక గౌరవ సంపాదకురాలు గారి ఆధ్వర్యంలో ఈ ఊరేగింపు జరుగుచున్నది మరియు మా ఇంటివైపే వస్తున్నది. కాని దగ్గరికి




స్వామి వారు మా ఇంటికి వస్తారని వేచి చూచుట

వచ్చేసరికి, స్వామివారిని ఆహ్వానించుటకు వెనుక ద్వారము నుండి ముందు ద్వారానికి వచ్చేలోపలే స్వామివారు మా ఇంటి చుట్టు తిరిగి నాకు కనబడకుండా వెళ్ళిపోయారు. ఇంత తొందరగా ఈ ఊరేగింపు ఎలా వెళ్ళింది? నేను వెనక నుండి ముందుకు వచ్చేసరికి మా ఇంటి చుట్టూ తిరిగి కనపడనంత దూరము వెళ్ళిపోయింది. నేను నిరాశ చెందకుండా జీయర్ స్వామి ఆశ్రమములో ఒక ఉత్సవము ఉన్నది, దీనిని చూచుకుని మళ్ళీ వచ్చెదమనే సందేశం ఇచ్చి పోయాడు. అంటే ఏమిటి అర్థం? మా ఇంటి వరకు రావడం ఎందుకు? నాకు ఆశ పెట్టడం ఎందుకు? తిరిగి కనబడకుండా వెళ్ళిపోవడం ఎందుకు? మళ్ళీ వచ్చెదమనే సందేశం ఎందుకు? ఇన్ని ప్రశ్నలు నా మనస్సులో ఉదయించాయి. ఏది ఏమైనా ఆయన స్వతంత్రుడు, నేను పరతంత్రుడను, పైగా ఆయన సేవకుడను. ఆయనను ప్రశ్నించే అధికారము కాని, నేను బాధపడే అధికారము, అవకాశము నాకు లేదు. నేను ఆయన సొత్తును, ఆయన వాణ్ణి, ఆయన ఎలా చెబితే అలాగే నడుచుకొనుట నా బాధ్యత అని భావించాను.

దీనర్థం : ఓయీ! నీవు హరినామ క్షేత్రం సాధించినానని భావించకుమన్నారు. మరియు సంకల్పము నెరవేర్చుటలో ఆరాటమును కాని, ఆత్రుతను కాని ఎంత మాత్రము తగ్గించకుమన్నారు. కాబట్టి స్వామివారు సూచించినట్లు అదే ఆత్రుతతో స్వామి సేవ చేయసాగాను. దీని మరో అర్థం : ఈ లోకంలోని సాధకుడు స్వామివారి అనుగ్రహం లేకుండా వారి సాక్షాత్కారాన్ని పొందలేడు.

**ఒక వివరణ :** ఏప్రిల్ 2021 లో హరినామక్షేత్రం ప్రసాదించుమని నేను మంకుపట్టు పట్టినప్పుడు దయామయుడైన స్వామివారు ప్రసాదించారు. కాని తనను మచ్చిక చేసుకుని సాధిస్తున్నావని చెప్పుచూ... ఈ జన్మలో నీకు హరినామక్షేత్రాన్ని ప్రసాదిస్తున్నాను. కాని పలు సంకల్పాలు తీసుకునైనా తగిన యోగ్యత సాధించవలసిందంటూ నిబంధన విధించారు. దీనర్థం – యోగ్యత విషయంలో సాధకుడికి ఎలాంటి సడలింపులు లేవు. మరియు భగవత్ సాక్షాత్కారం కోసం సాధకుడికి తగిన సాధనతో పాటు స్వామివారిని మచ్చిక చేసుకోవలసి ఉంటుంది.

## దసరా ప్రార్థన

చివరికి స్వామి కృపతో దసరా 2021 వరకు 8 కళ్యాణాలను చేయగలిగాము. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును 2002 సంవత్సరములో విజయదశమి రోజున ప్రారంభించాము. కాబట్టి ప్రతి విజయదశమి నాడు గతంలో చేసిన మొత్తం సేవలను, తప్పొప్పులను స్వామివారికి నివేదించుట ఆనవాయితీగా పెట్టుకున్నాను. ఈ విజయదశమి రోజున ఈ క్రింది విధంగా నివేదిస్తూ ప్రార్థించాను.

1. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! 2002 సంవత్సరము ఇదే రోజున శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపించి, మీకు ప్రతి సంవత్సరం 7 కోట్ల చొప్పున నామ జపమును ప్రారంభించుట జరిగింది. ఇంతింతై వటుడింతైనట్లు కాలము గడుస్తున్న కొద్దీ ఈ సేవ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం 19వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ జరిగి 20వ పర్యాయంగా 7 కోట్ల జపము నడుస్తున్నది.

2. 2004 సంవత్సరములో నమో వేంకటేశాయ రథమును ప్రారంభించి ఇంతవరకు 16 పర్యాయాలు హైదరాబాద్ నుండి తిరుపతి వరకు వివిధ మార్గాలలో త్రిప్పాము.

3. 2007 సంవత్సరం నుండి శ్రీవేంకటేశం మాసపత్రికను ప్రచురిస్తున్నాము.

4. 2011 నుండి భజగోవిందమును నిర్వహిస్తున్నాము.

5. ఈ మధ్యనే ప్రారంభించిన 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమములో ఇంతవరకు 8 కళ్యాణాలు జరిగాయి. మొదటి కళ్యాణం తేది 20-07-2021న మేమే జరిపించాము. నా సంకల్పానుసారం భక్తులు భాగస్వాములుగా జరిపించాలి. వారిలో నేను ఒకడినై, వారిని ప్రోత్సహిస్తూ, కొంత ధనమును వెచ్చిస్తూ, శాస్త్రోక్తంగా, కొన్ని వందలమంది జనాల సమక్షంలో జరిపించాలి. కాని మొదటి కళ్యాణం భక్తుల భాగస్వామ్యంతో కాకుండా మేమే జరిపించాము. వందల మంది సమక్షంలో జరిగింది కాని జరిపించుటలో మేము ఒక్కరమే కాబట్టి, దానిని స్వామివారు లెక్కలోనికి తీసుకుంటే 8 కళ్యాణాలు జరిగాయి. మొత్తం మీద దసరా 2020 నాటి నిర్ణయం ప్రకారం, దసరా 2021 వరకు కనీసం 7 కళ్యాణాలను, సంకల్పం ప్రకారం జరిపించుట జరిగింది. ఇది వందశాతం స్వామివారి అనుగ్రహంతోనే సాధ్యమైంది. ఆటలో పిల్లలను గెలిపించి వారి ఆనందమును చూచినట్లు, నన్ను గెలిపించి ఆనంద భరితుణ్ణి చేశారని అన్నాను. నా జీవితాంతం, ప్రతి సంవత్సరం నూతనోత్సాహాన్ని ఇస్తూ తన దాసునిగా రకరకాల పనులను నా ద్వారా నిర్వహించమని ప్రార్థించాను. ఆలస్యమగుచున్న హరినామ క్షేత్రమును త్వరగా ప్రారంభించమని ప్రార్థించాను. చివరికి నేను చేసిన తప్పులను, చిన్నపిల్లవానిగా భావించి పెద్ద మనస్సుతో క్షమించగలరని ప్రార్థించి ముగించాను.

## కళ్యాణాలను పరిశీలించుట

ఇంతవరకు 8 కళ్యాణాలను చేశాము కాబట్టి కళ్యాణాలలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి? భక్తులతో ఎలా మసలుకోవాలనే విషయాల పట్ల కొంత అవగాహన కలిగింది. కళ్యాణాల కార్యక్రమము ప్రారంభం నుండి 4 నెలల లోపలే స్వామి కృపతో 11 కళ్యాణాలను చేయగలిగాము. ఇప్పుడు ఈ రెండవ సంకల్పమైన 111 శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమము ఎలా జరుగుతుంది? అన్ని నిబంధనలు పూర్తగుచున్నవా? భక్తులు,

భగవంతుడు సంతోషిస్తున్నారా? లేదా? అనే విషయములను పరిశీలించదలచాను.

2020 సంవత్సరంలో నా షష్టి పూర్తి సందర్భంగా పొందిన అనుభూతి ననుసరించి ''స్వామివారి కళ్యాణమును వేలమంది సమక్షంలో, భక్తులు భాగస్వాములు కాగా, వారి మధ్యన నేను స్వామివారి కళ్యాణమును అత్యంత వైభవంగా నిర్వహించాలి. ఈ నిబంధన అనుకున్నట్లుగా జరుగుచున్నది. మరియు మరో ఆంతరంగిక కోరికను ఈ విధంగా కోరాను. ప్రభూ! నేను మీ సేవకుడను. మీకు మరియు మీ భక్తులకు సేవ చేయాలనే తలంపుతో ఉన్నాను. నాకు మీరు ఏమీ ఇవ్వవలసిన అవసరం లేదు. కాని నా వల్ల మీ భక్తులకు ఆనందము, పేరు ప్రతిష్ఠలు మరియు మీ అనుగ్రహము లభించాలని కోరాను. దాని ననుసరించి ఇంతవరకు జరిగిన ప్రతి కళ్యాణములో, ఆయా కళ్యాణ నిర్వాహకులకు మంచి పేరు వస్తుంది. కళ్యాణము తరువాత అక్కడి ప్రజలు వారిని పొగడ్తలతో ముంచేస్తున్నారు. నిజానికి వారందరూ నా ప్రోత్సాహముతో చేశారు. నేను నా సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని, శ్రమకోర్చి, వారికి ఉచితంగా కళ్యాణం నిర్వహించాము. కాని నాకంటే వారికే పొగడ్తలు ఎక్కువగా వచ్చుటను గమనించాను. నా కోరిక ప్రకారము స్వామివారు కళ్యాణ కర్తలకు వారి కృపా కటాక్షాలతో అనుగ్రహిస్తున్నారని స్పష్టం అయింది. నేను కూడా ప్రతి కళ్యాణానికి ముందు స్వామివారి అనుగ్రహము కళ్యాణకర్తలతో పాటు, వీక్షించిన భక్తులందరికీ లభించాలని మరీ మరీ ప్రార్థించేవాడిని. కళ్యాణ కర్తలతో పాటు చూచిన ప్రతి భక్తుడు ఎంతో ఆనందించసాగారు. దీనిని చూచి నేను ఎంతో సంతోషించేవాడిని. నా దాస్య ధర్మమును పాటించే విధంగా పరిస్థితులు ఉన్నవని మురిసిపోయేవాడిని. అన్ని ప్రాంతాలలో లడ్డూలు లభించవచ్చు కాని తిరుమల లడ్డూల రుచే వేరు అన్నట్లు ఎంతోమంది కళ్యాణాలు చేయవచ్చు కాని శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం వారి కళ్యాణం మజానే వేరు అన్నట్లు పరిస్థితులు కనిపించాయి.

## వైఖానసులను ఏర్పాటు చేయుట

ఈ కళ్యాణాలు ఎలా జరుగుచున్నవి? మేము ఏమన్నా తప్పులు చేస్తున్నామా? భక్తులకు కాని భగవంతుని యందు కాని ఏదేని అపరాధము తెలిసో తెలియకనో జరిగినచో దయచేసి తెలుపమని స్వామివారిని అమ్మవారిని పదే పదే ప్రార్థించాను. కాని ఎలాంటి జవాబు రాలేదు. కాని ఈ మధ్యన నాకు ఈ కళ్యాణాలను వైఖానసాగమము ప్రకారంగా అంటే తిరుమల సాంప్రదాయాన్ని పాటించుట లేదనే భావన బలంగా వచ్చింది. మన సాంప్రదాయంలో ప్రతి గుడికీ ఒక ఆచారముంది. అలాగే తిరుమల గుడికి వైఖానసాగమం ఆచారం. తిరుమల స్వామివారి కళ్యాణం శాస్త్రోక్తంగా జరగాలంటే అది వైఖానసాగమానుసారమే జరగాలి. కాని మేము అలా చేయుట లేదు. కావున శాస్త్రోక్తంగా జరగాలనే నా ప్రధాన కోరిక తీరుట లేదు. భక్తులు సంతోషిస్తున్నప్పటికీ శ్రీవేంకటేశ్వరుణ్ణి తృప్తి పరుచుట లేదనే భావం నా మనస్సులో రోజు రోజుకు ఎక్కువవుతోంది.


తిరుమల శ్రీవేంకటేశ్వరుని కళ్యాణం శాస్త్రోక్తంగా జరిపించాలంటే తప్పకుండా మేము వైఖానసాగమానుసారం కళ్యాణం నిర్వహించాలి. కాని ఈ కళ్యాణాల కార్యక్రమము ప్రారంభించినప్పుడు నాకు వైఖానసులు దొరకని కారణంగా స్వామివారిని ప్రార్థించి పాంచరాత్రాగమానుసారంగా నిర్వహిస్తున్నాము. ఈ లోపము వల్ల స్వామివారు ఆనందంగా లేరనే భావము నాకు కలుగుతోంది. ఈ అపరాధ భావము రోజురోజుకూ పెరిగింది. ప్రతి కళ్యాణములో భక్తులు తృప్తి చెందుచున్నారు కాని భగవంతుడు తృప్తి చెందుట లేదనే భావం కలుగసాగింది.

చివరికి తేది 20-11-2021 నుండి హైదరాబాద్ లో నాకు తెలిసిన వైఖానసులను సంప్రదించుట ప్రారంభించాను. ఎవ్వరూ ముందుకు రాలేదు. చివరికి శ్రీవేంకటేశ్వరుణ్ణే వైఖానసులను ప్రసాదించమని వేడుకున్నాను. తెలిసిన వాట్సాప్ గ్రూపులలో ప్రచారము చేశాను. చివరికి తెనాలి నుండి శ్రీమాన్ చక్రవర్తి ఆచార్యులు ఫోన్ చేసి తాను మొత్తం 100 కళ్యాణాలకు కావలసిన వైఖానస బ్రాహ్మణులను ఏర్పాటు చేయగలనని, దిగులు చెందనవసరం లేదని అన్నారు. పైగా తాను తిరుమల కొండపై స్వామి సేవలను చేసేవాడినని తెలుపుచూ కొన్ని ఫోటోలను పంపాడు. ఈ మాట విన్న నేను చాలా సంతోషించాను. శ్రీవేంకటేశ్వరుడే ఈ ఏర్పాటు చేశాడని నమ్మాను. మరియు నేను జీవితాంతం మీకు ఋణపడి ఉండగలనని ఆ బ్రాహ్మణునితో చెప్పాను. డిసెంబర్ 2021 నుండి జరుగు కళ్యాణాలను వైఖానసాగమోక్తంగా చేయ నిర్ణయించాము. ఇలా నేను ప్రార్థించిన మరుసటి రోజున స్వామివారు వైఖానసులను ఏర్పాటు చేశారు.

## కళ్యాణాలను మెచ్చి మిఠాయి ఇచ్చిన స్వామివారు

ఇక ఈ కళ్యాణాలు ఎలా జరుగుచున్నవి? మా నుండి ఏమైనా పొరపాట్లు జరుగుతుంటే తెలపండి అనే ప్రార్థనకు ఇంతవరకు జవాబు లేదు. కాని ఇదే విషయమై నా భార్య సురేఖ స్వామివారిని ప్రార్థించిందట. కళ్యాణాలు మీకు నచ్చుతున్నాయా? ఏమైనా తప్పులు జరుగుచున్నాయా? అని ప్రార్థించిందట. దీనికి స్వామివారు చక్కగా జరుగుచున్నాయని మెచ్చుకుంటూ మాకు మిఠాయి తినిపించారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 21-11-2021 కల :** ఈ కల సురేఖకు వచ్చింది. అందులో ఇలా జరిగింది. అది దీపావళి పండుగ రోజట. మేము అంటే నేను మరియు సురేఖ మాత్రమే మా ఇంటిలో ఉన్నామట.




కళ్యాణాలు మెచ్చి మిఠాయి ఇచ్చుట

మా పిల్లలందరూ అమెరికాలో ఉన్నారు. మేము ఉదయము లేచి ఇ ల్లును చక్కగా అలంకరించుకున్నాము. అంటే అన్ని గుమ్మాలకు పూలు, మామిడి ఆకులు కట్టి, పూజ చేసి ఉన్నాము. సాయంత్రానికి దీపాలు వెలిగించుటకు అన్నీ సిద్ధం చేశాము. నేను మాత్రం మధ్యాహ్నం కొంతసేపు పడుకున్నానట. లేచాక ఏవో కొన్ని స్నాక్స్ తిని టీ కూడా ఇద్దరము కలిసి త్రాగుచూ ఏదో మాట్లాడుకుంటున్నాము. సమయము దాదాపు సాయంత్రం 4.30 -5.00 అవుతోందట. ఇంతలో అనుకోకుండా మా సొంత గ్రామమైన చిన్నగుండవెల్లి నుండి నా మిత్రుడు చిట్టిమెళ్ళి శేఖరం మా ఇంటిలోకి నవ్వుచు ప్రవేశించాడు. ఈ రోజు దీపావళి, పండుగరోజు ఈయన ఏంటి ఊరు వదిలి మా ఇంటికి వచ్చాడని సురేఖ ఆలోచిస్తున్నదట. ఇంతలో ఆయన వెనకాల ఆయన భార్య శ్రీమతి భాగ్యమ్మ కూడా వచ్చిందట. వీరిని చూచి సురేఖ ఎందుకొచ్చారని ఆశ్చర్యపోయిందట. మామూలు రోజైతే అర్థం ఉంటుంది కాని పండుగ రోజు, అదీ దీపావళి రోజు ఎందుకు వచ్చారనే ఆలోచనలతో ఉన్నది. ఇంతలో శేఖరం తాను తెచ్చిన స్వీట్ పాకెట్టును మాకు ఇచ్చాడట. ఏం శేఖరం పండుగ రోజు వచ్చారని సురేఖ అడిగిన ప్రశ్నకు ఏమీలేదని, కేవలం మిమ్మల్ని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపి స్వీట్ ఇచ్చి వెళదామనే ఉద్దేశ్యముతో మాత్రమే వచ్చామని చెప్పాడట. ఇంతలో కల చెదిరింది.

దీనిని ఈరోజు ఉదయం సురేఖ నాతో చెప్పింది. ఈ కల మాహాత్మ్యము ఏముంటుందని నేను ఆలోచించాను. చివరికి తాను కూడా స్వామివారిని మరియు అమ్మవారిని ఈ కళ్యాణాలు ఎలా జరుగుచున్నవని అడిగానని చెప్పింది. బహుశా స్వామివారు మా ప్రశ్నకు బదులిచ్చారు. తాము ఈ కళ్యాణాలకు సంతోషించామని తెలుపుచు మాకు మిఠాయి బాక్స్ ను బహుమతిగా అందించారని భావించాను. కాని స్వామివారి రూపంలో ఒక బ్రాహ్మణుడు కాని, గోవిందుడు కాని రావాలి కాని మా ఊరి శేఖరం ఆయన భార్య ఎందుకు వచ్చారని ఆలోచించాను. చివరికి స్వామి లీలలను అర్థం చేసుకునే సామర్థ్యం నాలో లేదు. కళ్యాణాల అంతిమ లక్ష్యం చిన్నగుండవెల్లి కాబట్టి చిన్నగుండవెల్లి నుండి శేఖరం ఆయన భార్య వచ్చారని భావించాను.

## నా భావన

11వ కళ్యాణం జరిగాక కూడా నాకు స్వామివారి అనుగ్రహ పూర్వక స్వప్న అనుభూతి కలుగ లేదు. దీనికి కారణం నేను కళ్యాణములను పాంచరాత్రాగమ పూర్వకంగా నిర్వహించుటనా? అనే సందేహం కలిగింది. నిజానికి మొదట అనుకున్నది తిరుమల సాంప్రదాయమైన వైఖానస పద్ధతి. కాని హైదరాబాదులో వైఖానసులు తగినంతమంది లేరు కావున పాంచరాత్రాన్ని అవలంబిస్తున్నాము. కాని వైఖానసుల కొరకు నేను ఇంతవరకు ఎలాంటి ప్రయత్నము చేయలేదు. నా సంకల్పానికి విరుద్ధంగా పాంచరాత్రాగమం ప్రకారంగా జరిపిస్తున్నాను. కాబట్టి స్వామివారికి కోపం వచ్చి నన్ను అనుగ్రహించుట లేదా? అనే కోణంలో ఆలోచించి వైఖానసుల

కోసమని వాట్సాప్, ఫేస్ బుక్ లలో తేది 20-11-2021 నాడు ప్రకటనలు ఇచ్చాను. బహుశా నా ఈ శక్తికొలది ప్రయత్నాలను చూచి స్వామివారు మెచ్చి మరునాడు నా భార్యకు స్వీట్ ఇచ్చారని భావించాను. నాకైతే ఇంతవరకు ఎలాంటి అనుభూతిని కలిగించలేదు. బహుశా కొద్ది రోజులలోనే నాకు కూడా ఒక మధురమైన అనుభూతిని కలిగిస్తారని భావించాను.

తేది 30-11-2021 రోజు సాయంత్రం హైదరాబాద్ లోని జెమినీ కాలనీలో 14వ కళ్యాణం జరిగింది. ప్రతి 7వ కళ్యాణం ఒక విశిష్ట కళ్యాణం కావాలనే నా కోరిక ప్రకారం ఈ కళ్యాణం అత్యంత భారీ స్థాయిలో జరిగింది. దాదాపు 2000 మంది కంటే ఎక్కువ మంది భక్తులు వచ్చారు. శ్రీశ్రీశ్రీ దేవనాథ్ జీయర్ స్వామివారు కూడా వచ్చారు. చాలా సంతోషం వేసింది. ఇది పాంచరాత్రాగమానుసారం జరిగిన చివరి కళ్యాణం. 15వ కళ్యాణము నుండి వైఖానసాగమానికి మారుదుమని అనుకున్నాము.

## వైఖానస పద్ధతిలో మొదటి కళ్యాణం

తేది 12-12-2021 నాడు బోయిన్ పల్లిలో జరిగిన 15వ కళ్యాణము వైఖానసులైన శ్రీమాన్ విద్యాసాగర్ గారి ఆధ్వర్యములో జరిగింది. చాలా బాగా జరిగింది. మేము చాలా ఆనందించాము. కళ్యాణములోని ఒక తంతైన స్వామివారి కాళ్ళు కడిగి కన్యాదానము చేయు సమయాన నా కళ్ళ నుండి ఆనంద బాష్పాలు రాలాయంటే ఆ సంతోషం ఏ స్థాయిలో ఉన్నదో తెలుసుకోవచ్చు. మేమే కాకుండా కళ్యాణ నిర్వహణ దంపతులతో పాటు భక్తులు కూడా తన్మయత్వం చెందారు. వారి జీవితంలో ఇంతవరకు ఇలాంటి కళ్యాణమును చూడలేదని, వారి ఆనందానికి హద్దులు లేవని అన్నారు. నేను ఎంతగా ఆనందించానంటే ఇక నుండి ప్రతి కళ్యాణం వైఖానస పద్ధతి ప్రకారమే జరగాలని నిర్ణయించుకున్నాము. వైఖానసములో మంత్ర పఠనము ఎక్కువగా ఉన్నది. పైగా శ్రీమాన్ విద్యాసాగర్ గారు దిట్ట, మంచి పట్టున్న వ్యక్తి, కళ్యాణం మధ్యలో మాకు తెలియని ఎన్నో దైవిక విషయాలను చెప్పారు. కళ్యాణములో పాల్గొన్న ప్రతి వ్యక్తి సంతోషించారు.

## కళ్యాణాలను మెచ్చిన స్వామివారు

తెల్లవారి అంటే తేది 13-12-2021 నాడు శ్రీవేంకటేశ్వరుణ్ణి ఈ విధంగా ప్రార్థించాను. ప్రభూ! మేము తేది 20-07-2021 నుండి 14వ కళ్యాణము వరకు పాంచరాత్రాగమానుసారంగా శ్రీనివాస కళ్యాణములను చేశాము. ఈ కళ్యాణాలు ఎలా జరుగుచున్నవని ప్రార్థించినప్పటికీ నిన్నటి వరకు మీనుండి ఎలాంటి స్పందనను చూడలేదు. చివరికి నిన్న 15వ కళ్యాణమును వైఖానస పద్ధతిలో చేశాము, దీనికైనా మీరు సంతోషించారా? ప్రభూ! అంటూ అత్యంత దీనంగా సమాధానం చెప్పమని ప్రార్థించాను. దీనికి సంతోషించిన స్వామివారు ఆధ్యాత్మికంగా పై మెట్టుకు వెళ్ళినట్లు ఒక చక్కని లీలను ఈ క్రింది విధముగా చూపారు.

**తేది 14-12-2021 కల :** గతంలో నన్ను స్వామివారు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ఉస్మానియా యూనివర్సిటీలో ఆధ్యాత్మిక మాస్టర్ డిగ్రీని చదువమని చేర్పించారు. ఈ కలలో కూడా నేను ఇదే ఇంజనీరింగ్ కళాశాలలో ఆధ్యాత్మిక మాస్టర్ డిగ్రీని చదువుచున్నాను. అందరూ నాతోటి విద్యార్థులు మంచి ధోవతులు, తిరునామము ధరించి చక్కటి శ్రీవైష్ణవ సాంప్రదాయానుసారము తయారైనారు. వీరందరూ ఒక ఊరేగింపు చేయుటకై లైనులో నిలబడ్డారు. ఒక దాని ప్రక్కన మరో లైను ఇలా మొత్తం 4 వరుసలలో కళాశాల ముందు గల రోడ్డుపైన నిలబడ్డారు. అందరూ చూచుటకు దాదాపు హరేరామ హరేకృష్ణ భక్తుల లాగా ఉన్నారు. వీరందరూ నాతోటి చదువుచున్న మిత్రులే! ఈ మొత్తం ఊరేగింపు నాకు ఇంజనీరింగ్ లో బోధించిన గురువుల ఆధ్వర్యములో జరుగుచున్నది. వారు కూడా పంచెలు, తిరునామము ధరించి ఉన్నారు. వారు ఈ ఊరేగింపును పర్యవేక్షిస్తున్నారు. నేను మాత్రం అదేరకమైన వేషధారణలో ఉన్నప్పటికీ అంటే పంచె కట్టుకుని తిరునామము పెట్టుకుని ఉన్నప్పటికీ, ఈ ఊరేగింపులో తోటి విద్యార్థుల మధ్య నిలబడలేదు. వేరే ఇతరమైన పనులను అనగా ఇతర అరేంజ్ మెంట్లు చూచుటకై అన్నట్లు ప్రక్కకు ఉన్నాను. ప్రక్కన మా ఇంజనీరింగ్ కళాశాల కూడా కనబడింది. ఆ కళాశాలలోని ఒక గదిలో ఏదో పని నిమిత్తమై నేను లోనికి వెళ్ళుటకు సిద్ధంగా ఉన్నాను. మా ఉపాధ్యాయులు శ్రీమాన్ జగన్నాథ్ జెట్టి గారు మరియు శ్రీమాన్ మురళీకృష్ణ గారు పర్యవేక్షించుటను స్పష్టంగా చూచాను. వీరు మంచి సాంప్రదాయ వస్త్రములను కట్టుకుని ఉన్నారు. మొత్తం మీద ఒక అత్యంత పవిత్రమైన రోజున జరుగు ఒక ఉత్సవమునకు మేమందరం ఎంతో ఉల్లాసంగా సిద్ధమగుచున్నట్లు ఉన్నది. మరియు ఆధ్యాత్మికంగా పై మెట్టుకు వెళ్ళిన భావన కూడా ఏర్పడ్డది. ఇంతలో కల చెదిరింది.

వైఖానస పద్ధతిలో మొదటి కళ్యాణము జరిగిన తరువాత ఈ అనుభూతిని పొందాను. కాబట్టి స్వామివారు ఈ పద్ధతిని స్వీకరించారని భావించాను. మరియు మిగిలిన మొత్తం కళ్యాణాలను ఇదే పద్ధతిలో చేయాలని నిర్ణయించాము.

ఆ మధ్యన ఒక భక్తుడు హైదరాబాద్ నుండి దాదాపు 85 కిలోమీటర్ల దూరములో ఉన్న 'వెల్దండ' అనే పట్టణము నుండి ఫోన్ చేసి వారి ఊరిలో కళ్యాణం చేయమని అడిగాడు. కాని నేను మాత్రం మా సంకల్పం హైదరబాద్ వరకేనని, అంతదూరం వరకు రథం మరియు బ్రాహ్మణులు రావడం కష్టమని, రాలేమని అన్నాను. చివరికి స్వామివారిని ఈ విషయమై వేడుకుని మీరు వెళ్ళమంటే వెళ్ళగలను అన్నాను. కాని స్వామివారు మాత్రం నా




పైమెట్టుకు ఎక్కినట్లు భక్తుల ఊరేగింపు చూపుట

విజ్ఞతకే వదిలినట్లు ఏమీ చెప్పలేదు. ఆ భక్తుడు ఎంతో ఆత్రుతతో మళ్ళీ మళ్ళీ అడిగాడు. చివరికి నేను పూనుకొని కళ్యాణాన్ని వదలలేక, స్వామి భక్తులను నిరాశపరచలేక దాస్య వృత్తిని పాటిస్తూ తేది 22-12-2021 నాడు కళ్యాణాన్ని చేయుటకు నిర్ణయించాము.

దీనికి ఒక్కరోజు ముందు అంటే 21-12-2021 నాడు స్వామివారు ఈ క్రింది లీల చూపారు.

తేది 21-12-2021 కల : నేను ఒక క్రొత్త పట్టణములోని ముఖ్యవీధిలో బహుశా కళ్యాణ నిమిత్తమై ఉన్నాను. ఈ వీధికి ఇరుప్రక్కల పెద్ద పెద్ద దుకాణాలు ఉన్నవి. ఇంతలో ఒక వ్యక్తి, బహుశా ఆ ప్రాంతపు మునిసిపల్ అధికారి ఏదో ఒక పూజకై లేదా స్వామివారి కళ్యాణము చేయుటకై స్కూటర్ పై వచ్చాడు. సాంప్రదాయ వస్త్రాలను ధరించాడు. పట్టుపంచెను కట్టుకున్నాడు, పైన ఒక కండువా కప్పుకున్నాడు. షర్ట్ ను ధరించలేదు, ఈయన ఒక స్కూటర్ పై వచ్చాడు. బహుశా ఆ కళ్యాణము జరిగే ప్రాంతములో పార్కింగ్ కు స్థలము లేక ఇక్కడ తన స్కూటర్ ను పార్కు చేయుటకై వచ్చాడు. మీ షాపు ముందు ఒక ప్రక్క పార్కు చేయుదునని అడిగాడు. వారు సరేననగా ప్రక్కన పార్కు చేసి కళ్యాణానికి వెళ్ళుచున్నాడు. ఆ వ్యక్తి ఆరడుగుల పొడవుతో మంచి రూపు, రంగు కలవాడుగా ఉన్నాడు. సాంప్రదాయ వస్త్రాలతో ఒక్కడే వచ్చాడు. ఇంతే కల.

దీని అర్థమును గ్రహించలేదు, బహుశా మా కళ్యాణాలలో ఎక్కువ మంది వస్తారని కావచ్చును. లేదా నన్ను ప్రోత్సహించుటకు చూపవచ్చని అనుకున్నాను.

**ఈ కాలంలో జరిగిన కళ్యాణాలు:** సంకల్పించిన 111 కళ్యాణాలలో భాగంగా 5 వ కళ్యాణం నుండి 16 వ కళ్యాణం వరకు మొత్తం 12 కళ్యాణాలు జరిగాయి.

**నా దశ:** ప్రతి భాగం అనుభూతుల ప్రచురణలో ఎంతో పరివర్తన చెందసాగాను. చీటికీ మాటికీ స్వామి కృపను ఆశించక ఆంతరంగిక సేవకుడి మాదిరిగా జీవించదలచాను. స్వామివారికి 19వ జపసమర్పణ జరిగింది. కళ్యాణాలలోని ఆంతరంగిక నిబంధన పూర్తైనది. స్వామివారు ఆదమరచి ఉండకుమన్నారు. చివరికి కళ్యాణాలను వైఖానసాగమానికి మార్చి స్వామివారిని తృప్తి పరచాను.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/- ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/-కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/- స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

శ్రీమహావిష్ణువు అవతారములలో ప్రథమావతారము మత్స్యావతారము. మత్స్యావతార ఆవిర్భావం చైత్ర బహుళ పంచమి నాడు జరిగింది. వేదోద్ధారకుడు, మత్స్యావతారుడు అయిన శ్రీహరిని స్మరించుకుంటూ చైత్ర బహుళ పంచమి నాడు మత్స్య జయంతిని జరుపుకుంటారు.



# వేదోద్ధారకుడు మత్స్యావతారుడు

: చిల్లర సీతారామారావు

పరీక్షిన్మహారాజు శుకమునీంద్రుడిని – మునీంద్రా! శ్రీహరి లీలలు అద్భుతమైనవి. ఆయన ప్రథమావతారము మత్స్యావతారము. లోకనింద్యము, తమస్స్వభావము, దుస్సహము నగు మత్స్యరూపమును స్వతంత్రుడగు శ్రీహరి కర్మ పరతంత్రుడగు జీవుని వలె ఎందుకు దాల్చవలసి వచ్చింది? శ్రీహరి చరితము వినిన సమస్త ప్రాణులకు సుఖమే కలుగుతుంది. దయచేసి మత్స్య వృత్తాంతమును వివరించండి అని ప్రార్థించాడు. శుకమహర్షి పరీక్షిన్మహా రాజునకు విష్ణువు యొక్క మత్స్యావతార లీలలను వివరించసాగాడు.

**శ్లో ॥ "గో విప్ర సుర సాధూనాం ఛందసామపి చేశ్వరః**
**రక్షా మిచ్ఛంస్త మార్ధత్తే ధర్మస్యార్థస్య చైవహి"**

రాజా! భగవంతుడు గోవులను, విప్రులను, సురలను, సాధువులను, వేదములను రక్షించు నిమిత్తము ఆయా దేహములను ధరిస్తూ ఉంటాడు. వాయువు ఉచ్చ నీచ ప్రాణుల యందు సంచరించుచున్ననూ, ఆయా ప్రాణుల ఉచ్చ నీచ గుణములను తాను పొందదు. నిర్గుణుడైన భగవంతుడు సమస్త ప్రాణులయందు, ఆత్మ రూపములో ఉన్ననూ ఆయా ప్రాణుల ఉచ్చ నీచ గుణములను తాను పొందడు.

కల్పాంతము కాగానే ప్రళయం సంభవిస్తుంది. ప్రళయమనగా పర్వత, వన, దుర్గ, సముద్ర, పట్టణ, గ్రామాదులను వ్యత్యాసము లేకుండా సృష్టి సమస్తము జలమయమవుతుంది. సంవర్తము, భీమనాదము, ద్రోణము, ఇంద్రము, వలాహకము, విద్యుత్పతాకము, శోణము అను మహా మేఘములు విజృంభించి అధిక వృష్టిని కలిగిస్తాయి. తత్ఫలితంగా ఎత్తు పల్లాలు, పర్వతములు అను వ్యత్యాసము లేకుండా సమస్తము జలసంద్రమవుతుంది. గతించిన కల్పాంతమున బ్రహ్మ నిద్రించాడు. అప్పుడు నైమిత్తిక ప్రళయము సంభవించింది. ఆ సమయమున భూలోకము మున్నగు లోకములు జలమయమైనాయి. నిద్రిస్తున్న బ్రహ్మ ముఖము నుండి వేదములు వెలువడినాయి. వాటిని హయగ్రీవుడను రాక్షసుడు అపహరించాడు. ఇది తెలుసుకొనిన విష్ణుభగవానుడు వేదములను తిరిగి బ్రహ్మకు ఇవ్వవలెనని సంకల్పించుకొని ప్రథమావతారమైన మత్స్యావతారము నెత్తాడు.

ఆ కల్పమున సత్యవ్రతుడను ఒక రాజర్షి ఉండేవాడు. అతడు గొప్ప విష్ణుభక్తుడు. ఆయన నీటిని మాత్రమే ఆహారముగా తీసుకుంటూ తపము చేయసాగాడు. ఒకనాడు సత్యవ్రతుడు కృతమాలా నదీతీరములో శ్రీహరిని ఉద్దేశించి జల తర్పణము చేస్తున్నాడు. అతడు దోసిలితో నీటిని పట్టగా అందులో ఒక చిన్న చేపపిల్ల అతని దోసిట్లోకి వచ్చింది. అతడు ఉలిక్కిపడి దానిని తిరిగి నదీ జలములో విడిచిపెట్టాడు. ఆ చిరుచేప వెంటనే ఇలా అంది.

**శ్లో ॥ యాదేభ్యో జ్ఞాతి ఘాతేభ్యో దీనాం మాం దీనవత్సలా**
**కథం విసృ జసే రాజయన్ భీతామస్మిన్ సరిజ్జతే**

దీనవత్సలా! దీనురాలగు నేను, తమ జాతికే చెందిన ప్రాణులను జంపి తిను జలజంతువులకు భయపడి నీ దోసిలిలోనికి వచ్చితిని. నన్ను తిరిగి ఈ నదిలో విడుచుట భావ్యమా? చేప దీనాలాపములకు కరుణించి తన కలశ జలములో చేపను ఉంచి తన ఆశ్రమమునకు వెళ్ళాడు. ఆ చేప

కలశములో ఒక పగలు, ఒక రాత్రి ఉండి పదహారు అంగుళాలు పెరిగింది. తను ఉండటానికి ఆ కలశము చాలక రాజుతో రాజా! ఈ కమండలములో నాకు నివసించడం చాలా కష్టముగా ఉన్నది. విశాలమైన వేరొక స్థలమున నన్ను విడువుము అని పలికింది. రాజు చేప కోరినట్లు దానిని కమండలము నుండి తీసి నూతిలోని నీటిలో వేశాడు. ఆ చేప గంటలో మూడు మూరలు పెరిగింది. రాజుతో – రాజా! నేను ఈ నూతిలో సుఖముగా ఉండలేను. వేరొక విశాలమైన స్థావరమును చూడుము అని అడిగింది. రాజు ఆ చేపను నూతినుండి తీసి సరస్సునందు వేశాడు. ఆ చేప నిరంతరము పెరిగి సరస్సును ఆవరించింది. మరల రాజుతో రాజా! నాకు నీరే ఆవాసము. ఈ సరస్సులోని నీరు నా సుఖ విహారము కొరకు సరిపోవడం లేదు. నీరు ఎన్నటికీ క్షీణించని వేరొక తావున విడిచిపెట్టుము అని వేడుకొన్నది. రాజు ఆ చేపను సముద్రములో వేయబోతుండగా ఆ చేప రాజుతో – రాజా! సముద్రమున బలమైన మొసళ్ళు తిమింగలములు ఉంటాయి. అవి నన్ను తినేస్తాయి. ఇట్టి సముద్రమున నన్ను విడుచుట నీకు తగునా? అని పలికింది. మధురమైన మాటలతో మోహింప చేయుచున్న ఆ చేపతో రాజు ఇలా అన్నాడు. చేప రూపములో మమ్ములను మోహ పెట్టుచున్న నీవు ఎవరవు? నీవు మత్స్యానివి కావు. మత్స్యరూపములో నన్ను వంచించినావు. ఒక్కరోజుననే శత యోజనముల పరిమితి గల ప్రాంతము నాక్రమించినావు. నీవంటి పరాక్రమము గల జలచరమును మేము చూడలేదు. వినలేదు. నిన్ను నేననుగ్రహింపగలను.

**శ్లో ॥ నూనం త్వం భగవాన్ సాక్షాద్ధరిర్నారాయణోఽవ్యయః**
**అనుగ్రహాయ భూతానాం ధత్సేరూపం జలౌకసామ్"**

నీవు సాక్షాత్తు అవినాశి యగు నారాయణుడవు. నీవు భూతము (ప్రాణము) లను అనుగ్రహించుటకు మత్స్యరూపము దాల్చిన నారాయణుడవు. లోక సృష్టి, స్థితి, సంహారకారీ, నీకు నమస్కారము. భక్తితో శరణాగతులైన మాకు నీవే ముఖ్యగతి యైన ఆత్మ స్వరూపుడవు. నీవు అవతారములనెత్తి గావించు లీలలన్నీ ప్రాణుల అభ్యుదయము కొరకు హేతువులగుచున్నాయి. నీవీ మత్స్యరూపమును దేనికొరకు ధరించితివో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను అని రాజు పలుకగా మీనరూప ధారుడైన శ్రీహరి రాజుతో ఇలా అన్నాడు. నేటినుండి ఏడవ రోజుకు బ్రహ్మదేవునకు ఒక పగలు కాలం పూర్తవుతుంది. మూడు లోకములు సముద్రములో మునిగిపోతాయి. అప్పుడు నాచే పంపబడిన ఒకానొక విశాలమైన నౌక నీ వద్దకు రాగలదు. నీవు సకల ఓషధులను, నానావిధ బీజములను సంగ్రహించి, సప్తర్షుల తోడ ఆ నావ నెక్కుము. ప్రళయ సముద్రములో కాంతి ఉండదు. ఆ కారు చీకట్లో మహర్షుల తేజ పుంజము దీపములాగా కనిపిస్తుంది. ఆ ప్రళయములో వాసుకి నీటిమీద తేలుతూ వస్తుంది. ఆ సర్పమును తాడుగా చేసి, నేను అక్కడికి వచ్చినప్పుడు నా చేప కొమ్ముకు, నావకు కలిపి కట్టివేయుము. బ్రహ్మ రాత్రి కాలము గడుచు వరకు నావను లాగుతూ సముద్రములో విహరిస్తాను. ప్రశ్నోత్తర రూపమున పరబ్రహ్మ స్వరూపమును నీకు వివరిస్తాను అని పలికి అంతర్ధానమయ్యాడు.

సత్యవ్రతుడు తూర్పుదిశగా దర్భలను ఆసనముగా పరచి, దానమీద కూర్చొని భగవంతుడిని ధ్యానించసాగాడు. ఏడవ రోజున సముద్రము పొంగింది. మహా మేఘములు వర్షించగా భూమండలము జలమయము అయ్యింది. భగవంతుడి ఆదేశానుసారం అక్కడికి ఒక నావ వచ్చింది. సత్యవ్రతుడు ఓషధులను, పునః సృష్టి కోసం కావలసిన బీజములను తీసుకుని సప్తర్షులతో కలిసి నావనెక్కాడు. సప్తర్షులు సత్యవ్రతుడిని భగవంతుడిని స్తుతించమని బోధించారు. ఆయనను ధ్యానించినట్లయితే ఆయన మనలను కష్టముల నుండి రక్షించి సుఖములను ప్రసాదిస్తాడు అని పలికాడు. సత్యవ్రతుడు మహర్షుల వచనానుసారం భగవంతుడిని స్తుతించాడు. భగవంతుడు మత్స్యరూపమున ప్రత్యక్షమైనాడు. ఆ మత్స్యము నిడివి లక్ష యోజనములు గలది. బంగారము వలె మెరుస్తున్నది. ఆ చేపకు ఒక పెద్ద కొమ్ము ఉంది. పూర్వం భగవంతుడు ఆదేశించినట్లు సత్యవ్రతుడు వాసుకితో నావను ఆ చేప కొమ్ముకు కట్టాడు. పిదప భగవంతుడిని స్తుతించి, పరబ్రహ్మ స్వరూపమును, ఆత్మ తత్త్వమును ఉపదేశించమని ప్రార్థించాడు. అతని భక్తికి సంతోషించిన శ్రీహరి అతనికి సాంఖ్య యోగానికి చెందిన ప్రక్రియతో పురాణ సంహితను ఉపదేశించాడు. ప్రళయము ముగిసింది. బ్రహ్మ నిద్ర నుండి మేల్కొన్నాడు. శ్రీహరి హయగ్రీవ రాక్షసుడిని సంహరించి వేదములను తీసుకొని వచ్చి బ్రహ్మకు ఇచ్చాడు.

శ్రీహరి భక్తుడగు సత్యవ్రతుడు భగవంతుడి అనుగ్రహము చేత వైవస్వత మనువు అయినాడు. సత్యవ్రతునకు నారాయణునకు ప్రశ్నోత్తర రూపమున నడిచిన సంవాదము మత్స్యపురాణముగా ప్రసిద్ధి కెక్కింది. ప్రతిదినము మత్స్యావతారమును స్తుతించినవారి సంకల్పములు నెరవేరి తుదకు వైకుంఠమునకు చేరుకుంటారు.

**శ్లో ॥ ప్రళయ పయసి ధాతుః సప్తశక్తేర్ముఖేభ్యః**
**శ్రుతిగణ మపనీతం ప్రత్యుపా దత్త హత్వా**
**దితిజమ కథయన్ యో బ్రహ్మ సత్యవ్రతానాం**
**తమహ మఖిలహేతుం జిహ్మ మీనం నతోఽస్మి**

ప్రళయ సముద్రము నందు బ్రహ్మదేవుడు నిద్రించునప్పుడు, ఆయన ముఖము నుండి వెడలిన వేదరాశిని హయగ్రీవుడు అను రాక్షసుడు అపహరించగా, శ్రీమహావిష్ణువు ఆ దైత్యుడిని సంహరించి వేదరాశిని బ్రహ్మకు తిరిగి ఇచ్చాడు. సత్యవ్రతునకు, సప్తర్షులకు పరబ్రహ్మ స్వరూపమును బోధించాడు. సమస్త జగత్తుకు కారణభూతుడు, మత్స్యావతారుడు అయిన శ్రీహరికి ప్రణమిల్లుతున్నాను.



# పరమాత్మ

– శ్రీమాన్ డా|| అద్దంకి శ్రీనివాస్

పరమాత్మ అంటే శ్రేష్ఠమైన ఆత్మ. చేతనా చేతనాత్మకమైన ప్రపంచం ఆవిర్భావానికి, స్థితికి, లయకు, సంసార నివృత్తికి కారణమైనవాడు. అనంతమైన కళ్యాణగుణములు కలవాడు. సమస్త జీవ జడ ప్రపంచం కంటే విలక్షణమైన స్వరూపం పరమాత్మది. సర్వాత్మ, పరబ్రహ్మ, పరంజ్యోతి, పరతత్వం, సత్ మొదలైన శబ్దాలు పరమాత్మనే సూచిస్తాయి.

సమస్త ప్రపంచాన్ని నియమించేవాడు పరమాత్మే. అవిద్య అనే కర్మ సంబంధం వల్ల జీవులకు ప్రకృతితో సంబంధం కలుగుతుంది. దానివల్ల జనన – మరణ – సుఖ – దుఃఖాలతో కూడిన సంసారం తగులుకుంటుంది. ఈ సంసారాన్ని పరమాత్మే నశింప చేస్తాడు.

పరమాత్మను తెలుసుకోవడం ఎలా?

మాటల ద్వారా గానీ, బుద్ధి ద్వారా గానీ శాస్త్రజ్ఞానం ద్వారా గానీ తెలుసుకోలేము. అన్ని ఉపాయాలను విడిచి, పరమాత్మనే ఉపాయంగా భావించి ఆరాధించేవాడికే ఆ పరమాత్మ స్వరూపం అవగతమవుతుంది.

పరమాత్మనే అనన్య భావంతో శరణు వేడిన వారికి తనను పొందడానికి కావలసిన బుద్ధి యోగాన్ని అనుగ్రహించేది పరమాత్మే. అలా ఉపాసించిన అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపం ద్వారా నశింపచేసేదీ పరమాత్మే.

ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నవాడు పరమాత్మ. బ్రహ్మము అంటే ''స్వరూపం చేత, గుణాల చేత అనవధికమైన అతిశయం గల వస్తువు'' అని అర్థం. అలాగే శరీర భూతమైన సమస్త ప్రపంచంలో అంతర్యామిగా ప్రవేశించి, అతిశయింప చేసేవాడని మరో అర్థం.

పరమాత్మనే పరంజ్యోతి అంటాం. అంటే సర్వోత్కృష్టమైన జ్యోతిస్సు అని అర్థం. పరిమితి లేని ప్రకాశమే పరంజ్యోతి. పరమాత్మకే పరతత్త్వం అని వ్యవహారం. అంటే పరమ ప్రాప్యమైన తత్వం అని. తత్వం అంటే యథార్థమైన వస్తువు. దేశ – కాల స్వరూపాల ద్వారా అపరిచ్ఛిన్నమైన వ్యాప్తి కలదీ, తనకంటే గొప్పది వేరొకటి లేనిదీ పరమాత్మ. సమస్త భూతాలకూ భగవానుడే ఆత్మ. ఆ భగవానుడికి వేరొక ఆత్మ లేదు. అందుకే పరమాత్మ.

**మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ!**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ.**

దారంలో మణులు ఎలా గుచ్చబడి ఉంటాయో అలాగే ఇదంతా పరమాత్మలో ఉంటుంది. తాను తప్ప దీనికంతటికీ కారణం వేరొకటి లేదు.

ఈ తత్వాన్ని శ్రీకృష్ణుడు ఇలా చెప్పున్నాడు – నీటిలో ఉన్న రసం నేనే. చంద్రసూర్యులలో ఉన్న కాంతినీ నేనే. సమస్త వేదాలలోనూ ఓంకారాన్ని నేనే. ఆకాశంలో శబ్దాన్ని నేను. పురుషులలో ఉండే పౌరుషాన్ని (పురుషత్వాన్ని నేను), పృథివిలో ఉండే గంధాన్ని, సూర్యుడిలోని తేజస్సునూ, సకల ప్రాణులూ జీవించడానికి కావలసిన అన్నాన్నీ, తపస్వులలోని తపస్సునూ నేనే.

అన్ని ప్రాణులకూ ప్రాచీనమైన బీజాన్ని నేనే. బుద్ధిమంతులలోని బుద్ధీ, తేజస్వంతులలోని తేజస్సూ నేనే. బలవంతుల లోపలి కామరాగ వివర్జితమైన బలమూ నేనే. ప్రాణులలో ఉన్న ధర్మానికి అవిరుద్ధమైన కామాన్నీ నేనే.

సత్వ – రజస్ – తమో గుణాల వల్ల పుట్టే పదర్థాలన్నీ నానుండే పుడుతున్నాయి. నేను వాటిలో లేను కానీ అవన్నీ నాలో ఉన్నాయి. అయితే త్రిగుణాత్మకమైన పదార్థాలతో వ్యాపించి ఉన్న ఈ జగత్తు నన్ను గుర్తించలేకపోతోంది. నేను వీటన్నింటికీ అతీతుణ్ణనీ, మార్పు లేని వాణ్ణని మోహవశాత్తూ తెలుసుకోలేకపోతోంది. ఇదంతా నా మాయ. మూడు గుణాలతో

కూడి ఉన్న నా మాయను దాటడం అసంభవం. అయితే తమకు ఆత్మనైన నన్నే శరణు పొందిన వాళ్ళు మాత్రం దీనిని ఇట్టే దాటగలరు.

పాపాత్ములూ మూఢులూ అయిన నరాధములు నన్ను ఆత్మభావంతో పొందలేకపోతున్నారు. మాయ వాళ్ళ జ్ఞానాన్ని మటుమాయం చేస్తుంది.

**చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున!**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ!**

అర్జునా కష్టాలలో ఉన్నవాడు (ఆర్తుడు), జిజ్ఞాసవూ, ధనం కోరుకునువాడూ, జ్ఞాని అనే ఈ నలుగురు పుణ్యాత్ములు మాత్రం నన్ను భజిస్తూ ఉంటారు. వాళ్ళలో పరమాత్మ మీదే భక్తి గల జ్ఞాని ఆత్మ పట్ల నిత్యమూ ఏకాగ్రతతో ఉంటాడు. అందువల్ల అతడు విశిష్టుడు. అతడంటే నాకు ఇష్టం. నేనంటే అతనికి ఇష్టం.

వీళ్ళంతా గొప్పవాళ్ళే. అయితే జ్ఞాని నా ఆత్మ. ఎందుకంటే జ్ఞాని నన్నే ఉత్తమగతిగా భావించి అర్చిస్తాడు. ఎన్నో జన్మల తర్వాతైనా చివరకు జ్ఞానపరిపాకాన్ని పొంది, నన్నే సర్వస్వంగా భావించి, నన్ను పొందుతాడు. అటువంటి మహాత్ముడు అరుదు. ఎవరు ఏ రూపాన్ని కోరి సేవిస్తారో వారికి ఆ రూపంలోనే ఆరాధించే శ్రద్ధ నిలిచి ఉండే విధంగా నేనే చేస్తాను. ఎవరు ఏ రూపాన్ని ఆరాధన చేసినా ఆ అన్ని రూపాలూ నేనే. అందరి కోర్కెలూ తీర్చేది నేనే.

**అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్,**
**దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి**

అల్ప బుద్ధులకు లభించే ఫలం అంతమై పోతుంది. దేవతల్ని పూజించేవాళ్ళు ఆయా దేవతల్ని పొందుతారు. నా భక్తులైతే నన్నే పొందుతారు. ఎంతో ఉత్తమమైన నా స్వరూపం ఏ మార్పుకూ లోను కాదు. అల్పబుద్ధులకు ఈ విషయం అందదు. అంతకుముందు వ్యక్తం కాని నేను కాలాంతరంలో వ్యక్తుణ్ణయ్యానని అనుకొంటారు.

నన్ను యోగమాయ కప్పి ఉంటుంది. అందుకే అందరికీ నేను స్పష్టంగా కనబడను. ఈ లోకం మూఢమైనది. నేను ఏ మార్పూ పొందననీ, పుట్టుకన్నదే నాకు లేదని గుర్తించదు.

సమస్త భూతాలూ కూడా సృష్టి సమయంలో ఇచ్ఛ, ద్వేషం అనే రెండింటి వల్ల కలిగే మోహంతో తెలివితప్పి ఉంటాయి. ప్రకృతి నుండి పుట్టిన దేహాదులే అన్ని రకాలైన కర్మల్ని చేస్తుంటే అహంకారం వల్ల మూఢాత్ముడైన మానవుడు అవన్నీ నేనే చేస్తున్నాననుకుంటాడు. దీనికి కారణం అరకొర జ్ఞానమే.

విషయాన్ని అసంపూర్ణంగా తెలుసుకున్న వాళ్ళు ప్రకృతి గుణాల వల్ల మూఢులై ఆ గుణాల వల్ల జరిగే కర్మల పట్ల ఆసక్తిని పెంచుకుంటూ ఉంటారు. అటువంటి బుద్ధిహీనుల్ని సంపూర్ణ విషయజ్ఞానం కలవాడు పట్టించుకోకూడదు. వాళ్ళ దారిన వాళ్ళను పోనివ్వాలి.

నా స్వరూపం ఇంద్రియాలకు గోచరించదు. అయినా నేను ఈ జగత్తు అంతటా వ్యాపించి ఉన్నాను. సమస్త భూతాలు నాలోనే ఉన్నాయి. కాని నేను మాత్రం వాటిలో లేను. నేను సంగం లేనివాడను కాబట్టి నిజానికి భూతాలు కూడా నాలో లేవు.

నేను ఈశ్వరుణ్ణి – అంటే అంతటినీ నియమించే శక్తి కలవాణ్ణి. సమస్త భూతాలనూ పుట్టించి వాటిని భరించే నేను ఆ భూతాలలో ఉన్న అసంగుణ్ణి అగుటచే ఆ భూతాలలో లేనట్లే.

ఆకాశంలో వాయువు లాగా నాలో సమస్త భూతాలు ఉన్నాయి. కల్పాంతంలో అవి నా ప్రకృతిలో లీనమైపోతాయి. నేనే మళ్ళీ కల్పారంభంలో సృష్టిస్తూ ఉంటాను.

ఈ భూతాలన్నీ ఎవరి అధీనంలో ఉంటాయో తెలుసా? స్వభావానికి అధీనంలో. అందువల్ల భూతాలకు స్వాతంత్ర్యం లేదు.

నేను నా ప్రకృతిని ఆధారంగా చేసుకునే మాటి మాటికీ సృష్టిస్తూ ఉంటాను. నాదెప్పుడూ ఉదాసీన వైఖరే. దేనితోనూ నాకు సంబంధం ఉండదు. ఏ కర్మ పైనా నాకు ఆసక్తి ఉండదు. అందుకే ఆ కర్మలు నన్ను బంధించవు. నేను ఒక అధిపతిగా, సాక్షిగా మాత్రమే ఉంటాను. ప్రకృతే ఈ జంగమ – స్థావర రూపాత్మకమైన జగత్తును సృష్టిస్తుంది. ఆ కారణం చేతనే జగత్తు నడుస్తుంది.

నేనే క్రతువు, నేనే యజ్ఞం, నేనే స్వధ (పితృకార్యం), నేనే ఔషధం, నేనే మంత్రం, నేనే ఆజ్యం, నేనే అగ్ని, నేనే హోమద్రవ్యం. నేనే ఈ జగత్తుకు తండ్రి. నేనే తల్లి. నేనే కర్మఫలం ఇచ్చేవాణ్ణి. నేనే పితామహుణ్ణి. అందరూ తెలుసుకోవలసింది నన్నే. నేనే పుణ్యకర్మ. నేనే ఓంకారాన్ని. నేనే ఋగ్వేదాన్ని. సామవేదాన్ని. యజుర్వేదాన్ని కూడా. నేనే గతిని, నేనే పోషకుణ్ణి. ప్రభువును, సాక్షిని, నివాసాన్ని, రక్షకుణ్ణి, మిత్రుణ్ణి, ఉత్పత్తి స్థానాన్ని, ప్రళయాన్ని, ఆధారాన్ని, నిధిని, బీజాన్ని. ఆదిత్యుణ్ణయి నేనే తపింపచేస్తాను. వర్షాన్ని ఆపుతాను, విడుస్తాను. మానవులకు మృత్యువునూ, దేవతలకు అమృతమూ నేనే. కార్యమూ, కారణమూ నేనే.

ఈ భగవానుని వాక్యాలే పరమాత్మ స్వరూపాన్ని విశదం చేస్తాయి.

ఆ పురుషుడే మూడు లోకాలలో ప్రవేశించి, వాటిని నిలబెడుతూ ఉంటాడు. ఆ పరమాత్మ సమున్నతుడు. అందుకే లోకంలోనూ, వేదాలలోనూ పురుషోత్తముడిగా కీర్తిస్తారు.

**తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తితే**
**(భగవద్గీత 10-10)**

ఎవరైతే ఆసక్తితో ప్రీతిపూర్వకంగా సేవిస్తారో వాళ్ళకు బుద్ధియోగాన్ని అనుగ్రహిస్తూ, వాళ్ళ అంతఃకరణంలోనే ఉంటూ, వాళ్ళ అజ్ఞానాన్ని పరమాత్మ తొలగిస్తాడు.

ధారావాహికం



# మార్గదర్శకులు మహర్షులు

**డా॥ శివానందమూర్తి**

**గత సంచిక తరువాయి**

కాశీని వదిలిపెట్టి అగస్త్యుడు దక్షిణ దేశానికి వచ్చిన తరువాత, దానిని వదిలిపెట్టడం చేత దుఃఖం పట్టుకుంది ఆయనకు. ఎందుకో ఆయనకు కాశీ పట్టణం మీద అంత మమకారం! ఆయన కావాలనుకుంటే లోకమంతా ఆయనదే కదా! కాశీ వియోగం భరించలేక బాధపడుతూ ఆయన ఆంధ్రదేశంలోని గోదావరీ తీరానికి వచ్చాడట. పంపా సరస్సు, దండకారణ్యము దాటుకుంటూ గోదావరీ తీరంలో ఉన్నటువంటి భీమేశ్వరం (నేటి దక్షారామం) అనే క్షేత్రానికి వచ్చాడట. దక్షిణారామమైన భీమేశ్వరానికి వచ్చి అక్కడ భీమేశ్వరుడిని కొలిచాడు. భీమేశ్వరం కాకినాడకు దగ్గరలో ఉంది. అక్కడ కాశీ విశ్వేశ్వరుడు అగస్త్యునితో, ''నేను ఇక్కడనే ఉంటాను. నీవు కూడా ఇక్కడ ఉండు. ఇది దక్షిణ కాశీ అని ప్రసిద్ధి చెందుతుంది. నీకు కూడా కాశీ వదిలిపెట్టిన దుఃఖం ఉండదు. నువ్వు ఎట్లాగూ దక్షిణం ఉండదలచుకున్నావు కాబట్టి, నా చుట్టూ పరిభ్రమిస్తూ, ఈ దక్షిణ దేశంలో తిరుగుతూ ఉండు'' అని చెప్పి ఆయనకు శాంతిని కలుగజేశాడు.

భీమేశ్వర క్షేత్రమే దక్షిణ కాశీగా పిలువబడుతున్నది. యథార్థంగా ఈ సంగతి పురాణంలో కూడా చెప్పబడింది. అనేక క్షేత్రాలను కూడా, స్తోత్రం చేయడం కోసమని దక్షిణ కాశీ అని అంటూ ఉంటారు. భీమేశ్వరం మాత్రం వాస్తవంగా దక్షిణ కాశీయే. ఏదైనా సరే, కాశీతో సమానమని చెప్పడం చేత ఒక క్షేత్రాన్ని గౌరవించినట్లు భారతీయుల భావం. మన అలవాటు అది.

(ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఆంధ్రదేశంలో ఒకటే ఉంది – అది శ్రీశైలం ఒక్కటే. 'ఢాకిన్యాం భీమశంకరం' అంటే – ఆ భీమశంకరం వేరు. ఇక్కడ ఇప్పుడు చెప్పుకున్న భీమేశ్వరం అనేది వేరు. ద్వాదశ జ్యోతిర్లింగాల శ్లోకంలో 'ఢాకిన్యాం భీమశంకరం' అంటాము. ఢాకిని అంటే ఢాకా నగరం. అది ప్రస్తుతం మన



దేశంలో లేదు. అది నేటి బంగ్లాదేశ్ లోని ఢాకా నగరం. దానిని ఢాకినీ క్షేత్రం అనేవారు. ఢాకినీదేవి అక్కడ ఉండేది. శాకినీ, ఢాకినీ కాళి యొక్క అవతారాల్లోనివి. అక్కడ ఆ క్షేత్రంలో జ్యోతిర్లింగం ఉండేది. ఇంతకుపూర్వం అది మనకే ఉండేది. ఇప్పుడు నాశనం అయింది. అసలు భీమశంకరుడు అక్కడ ఉండేవాడు. ఇప్పుడు భీమశంకరం అనే పేరుతో మహారాష్ట్రలో ఉన్న ఒక క్షేత్రాన్ని ఆ జ్యోతిర్లింగం పేరు మీద మనం కొలుస్తున్నాం. అలా చాలా పోయినవి. సింధునదీ తీరానికి చెందిన అనేక గొప్ప ఆర్య క్షేత్రములు – సనాతనమైనవి – ఎన్నో పాకిస్తాన్ కు పోయినవి. వాటికి వెళ్ళాలంటే కూడా ఇప్పుడు కుదరదు. అలా ఎన్ని క్షేత్రాలు భారతదేశం కోల్పోయిందో, ఆ నష్టాల చరిత్ర వ్రాసుకుంటూ పోతే అదే ఒక పురాణం అవుతుంది).

అగస్త్యుడు దక్షిణ దేశంలో తిరుగుతూ కొల్హాపురం అని చెప్పబడే ఒక మహాలక్ష్మి క్షేత్రాన్ని కూడా దర్శనం చేసుకున్నాడు. పురాణం ఈ విషయాన్ని చెబుతున్నది. కొల్హాపూర్ మహారాష్ట్రలో నేటి షోలాపూర్ దగ్గర ఉంది. 'కోలాహల పుర స్థితాయై నమః' అని సహస్ర నామాల్లో ఆ మహాలక్ష్మి వర్ణించబడింది. ఆ 'కోలాహల పురాన్నే' ప్రస్తుతం కొల్హాపురం అని పిలుస్తున్నారు. అక్కడ ఆయన మహాలక్ష్మిని దర్శించి స్తోత్రం చేశాడట.

ఆయన అమ్మవారిని చేసిన స్తోత్రానికి అర్థం ఇలా ఉంది. ''అమ్మా! నీవు చంద్రునిలో ఉండే వెన్నెలవు. సూర్యునిలో ఉండే తీక్షణమయిన ప్రకాశానివి నీవు. ఆ చల్లదనము, ఈ వేడి రెండూ నీవే. అగ్నిలో దహించే శక్తివి. మరి దేహంలో వైశ్వానరాగ్నిగా ఆహారం పచనం చేసే శక్తివి (అది దహించే అగ్ని, ఇది ఉపకారం చేసి రక్షించే అగ్ని) ఆ రెండూ కూడా నీవే. అట్టి పరాశక్తీ! నీకు నమస్కారము'' అని చెప్పి ఆయన స్తోత్రం చేశాడు.

మహర్షులు తత్త్వం తెలిసి మాట్లాడుతారు. ఆ స్తోత్రంలో సత్యం ఉంటుంది. కాబట్టి ఆ స్తోత్రాలను మనం చదువుకుంటే, అందులో ఉన్న సత్యమే మనల్ని కాపాడుతుంది. నాశనంగాని, వినాశనం గాని అజ్ఞానం వలన ఏర్పడుతాయి. మనిషికి ఆయుర్దాయం, భాగ్యం అన్నీ కూడా సత్యజ్ఞానం వలన కలుగుతాయి. మహర్షులు చేసే స్తోత్రములన్నీ కూడా సత్యములే. సృష్టిలో రహస్యంగా కనబడీ కనబడకుండా ఉండే సత్యాలతో వారు చేసిన స్తోత్రములు నిండి ఉండటం చేత, వాటికి ఆ శక్తి ఉంది. అంతే కాని వట్టి స్తోత్రాలు కావవి.

''ఆ చైతన్యమే బ్రహ్మ, విష్ణు, రుద్రులలో ఉండి సృష్టి స్థితి లయములకు కారణమవుతున్నది. ఎవరైనా సరే – ఒకడు సూర్యుడయినాడు, ఒకడు ధన్యుడైనాడు, ఒకడు మన్మథుడైనాడు అంటే, అదంతా నీ కటాక్షమే. ఆయా జీవులందరికీ ఆ శక్తి రావటము నీ వలననే. పురుషుల యందు నీవు భాగ్యానివి, భాగ్యరేఖవు. భోగభాగ్యాలు పురుషుడికి నీ వల్ల వస్తాయి. నీవు స్త్రీ యందు విలాసరేఖవు. పురుషుని రంజింప చేయగలిగినటువంటి ఆ విలాసమేదయితే ఉన్నదో, అది నీవల్లనే స్త్రీలకు కలుగుతుంది. (మానసిక సౌందర్యము – అంతః సౌందర్యము, బహిః సౌందర్యములను కలిపి విలాసము అంటారు). రెండు సౌందర్యాలూ ఏక కాలంలో ఏ పురుషుని ఆశ్రయిస్తాయో, వాడు భాగ్యవంతుడు. ఆ విలాసము కలిగిన స్త్రీ నీ స్వరూపిణియే. నీవు ఎక్కడ ఉంటావో అది రసవంతమౌతుంది. నీవు లేనిచోట రసహీనమవుతుంది. (అంటే మంచి పుష్టిగా ఉండే చెఱుకు కర్రకు, ఎండకు ఎండిపోయిన పుల్లకు తేడా ఉంది. రసవంతము, రసహీనము అంటే అదియే). నీ కటాక్షం కలిగినవాడే సమస్తమూ కలిగినవాడు''.

''నిన్నే సమస్త దేవతలూ వాళ్ళ వాళ్ళ సౌఖ్యం కోసమనే అర్చిస్తున్నారు. వాళ్ళ భాగ్యం కోసమని అర్చిస్తున్నారు. మానవ లోకాన్ని పాలించే దేవతలు కూడా నిన్ను కొలుస్తున్నారు. దేవలోకాలలో ఆ సౌఖ్యాన్ని నీ వల్ల పొందుతున్నారు. ఇక్కడ నీవు వేంచేసి భూలోకాన్ని అనుగ్రహిస్తున్నావు. భూలోకంలో నువ్వు, నీ మహత్తు తెలుసుకోలేని జీవుల మధ్యన, నీ కటాక్షం చేత ఉంటున్నావు. దేవేంద్రాదులు అక్కడ దేవలోకాల్లో నిన్ను అర్చిస్తున్నప్పటికీ, అటువంటి నీవు ఇక్కడ ఉంటున్నావు. నీ కటాక్షం గొప్పది కదా!'' అని ఆమెను స్తుతించాడు అగస్త్యుడు.

ఆయన చేసిన స్తోత్రానికి అమ్మవారు సంతోషించి ఆయనకు దర్శనమిచ్చిందట. ''ఓ మహర్షీ! నీ స్తుతిలో పరమ సత్యాలున్నాయి. ఇప్పుడు 28వ మహాయుగం జరుగుతున్నది. తరువాత కలియుగం వస్తుంది. (ద్వాపర యుగం యొక్క సమాప్తంలో కృష్ణుని యొక్క చరిత్ర సంభవించింది. అంటే, అంతకంటే పూర్వం ఇది జరిగిందని అర్థం చేసుకోవాలి). కలి తరువాత 20వ మహాయుగం వస్తుంది. అందులో కూడా ద్వాపరం ఉంటుంది. ఆ ద్వాపర యుగంలో నువ్వు మళ్ళీ కాశీ పట్టణానికి చేరుతావు. ఆ యుగంలో నీవే వేదవ్యాసుడి వవుతావు. అప్పటికి వేదములన్నీ నశించి శిథిలమైపోతాయి. వేదములను మళ్ళీ ఉద్ధరించుకుని – జ్ఞాపకం తెచ్చుకుని – మళ్ళీ ఈ లోకానికి ఇచ్చి వేదవ్యాసుడనే పేరుతో నువ్వు లోకోపకారం చేస్తావు. భవిష్యత్తులో నువ్వుండబోయే కాశీ యొక్క లక్షణము, చరిత్ర, మరికొన్ని విషయములు కూడా నీకు ఈశ్వరాంశ సంభూతుడయిన కుమారస్వామి వలన తెలుస్తాయి. దక్షిణాన తుంగభద్రా నదీతీరంలో 'స్వామిమల' అనబడే క్షేత్రం ఉంది. నువ్వు దక్షిణాపథంలో ఉండదలచుకుని వచ్చావు కదా! అక్కడికి వెళ్ళి అక్కడే ఉండు. ఉత్తర దేశానికి నువ్వు భవిష్యత్ యుగంలో వెడతావు కాబట్టి, అప్పటి వరకూ ఆ స్వామిమల లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని గురువుగా భావన చేసి, ఆయన దగ్గర ఉండి అన్నీ తెలుసుకో. నీకు కాశీ క్షేత్రము, లోకముల చరిత్ర అంతా కూడా ఆయన చెబుతాడు. కాశీ యొక్క మహత్తు తెలుసుకుంటే, అదంతా నీలో జీర్ణించుకుని భవిష్యత్తులో మళ్ళీ

కాశీక్షేత్ర వాసివవుతావు నువ్వు'' అని అగస్త్యుడికి చెప్పింది. ''లోపాముద్రా సహితమయినటువంటి అగస్త్య మహర్షిని ఎవరయితే తలచుకుంటారో, వాళ్ళకు సమస్త శుభాలు, కళ్యాణము జరుగుతాయి. శ్రీమహాలక్ష్మి అనుగ్రహం వాళ్ళకు సంపూర్ణంగా కలుగుతుంది'' అని, ఆ కోలాహలపుర స్థితయైనట్టి సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి వరమిచ్చింది. ఈ రోజుకీ మనం ఆ అమ్మవారినే పూజిస్తున్నాం.

పురాణ గోత్ర కర్తలయిన సప్త ఋషులు వేరు. సప్త ఋషులలో, అంటే గోత్రకర్తలలో అగస్త్యమహర్షి లేడు. నక్షత్ర మండలంలో ఉన్నాడు. ఒక యుగంలో ఆ నక్షత్రానికి అధిపతిగా, యజమానిగా ఉన్నాడాయన. వసిష్ఠుడు, అరుంధతి ఎక్కడయితే ఉన్నారో, ఇప్పుడు అక్కడ లోపాముద్రా సహితంగా అగస్త్యుడున్నాడు. సప్తర్షులు అంటే ఒకే సమూహము కాదు అని మనం అర్థం చేసుకోవాలి.

ఒకప్పుడు దక్షిణా పథాన్ని ఇంద్రద్యుమ్నుడు అనేటటువంటి ఒకానొక రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన పరమవైష్ణవుడు (విష్ణుభక్తుడు). ఆయన రాజ్యాన్ని పరిత్యాగం చేసి అరణ్యానికి వెళ్ళి, నారాయణుని గురించి తపస్సు చేస్తూ ఒక నియమం పెట్టుకున్నాడు. ''నేను దేహాత్మ భావనను వదిలిపెట్టి తురీయావస్థలో ఉంటాను, ఎవరొచ్చినా కన్ను తెరిచి చూడను. విష్ణువే వచ్చి నాకు కనబడిననాడు తప్ప, ఇతరులు ఎవరు వచ్చినా కళ్ళు తెరవను! చూడను! ఏ విషయాన్నీ గమనించను'' అనే తీవ్రమైన ప్రతిజ్ఞతో, ఏకాగ్రతతో నారాయణ భావనతో, శిఖరాగ్రం మీదికి వెళ్ళి ఒంటికాలిమీద నిల్చుని, అక్కడ తపస్సు చేయటం మొదలుపెట్టాడు ఆయన. అలా చాలాకాలం తపస్సు చేశాడు.

దక్షిణాపథంలో సంచరిస్తున్నటువంటి అగస్త్యుడు, ఇంద్రద్యుమ్నుడు తపస్సు చేస్తున్నాడు చూద్దామని ఎదురుగా వెళ్ళాడు. చాలాసేపు నిలబడ్డాడు ఆయనకు ఎదురుగా. కానీ ఇంద్రద్యుమ్నుడు కన్ను తెరచి చూడలేదు. ఆయన దీక్ష అట్లాంటిది. కళ్ళు తెరిచి ఈయనకు నమస్కరించలేదు. చాలాకాలం అలా ఎదురు చూసినా ఆయన కళ్ళు తెరిచి చూడకపోవడంతో అగస్త్యుడు హుంకరించి, ''నీ తపస్సు, నీ ఏకాగ్రత ఏదైనప్పటికీ కూడా మహాత్ముడు ఎదురుగుండా వచ్చి నిలుచున్నప్పుడు, లేచి నిలబడి నమస్కరించవలసిన ధర్మం ఒకటుంది. మహాత్ములకు, జ్ఞానులకు నమస్కరించటం, వారి దర్శనాన్ని అపేక్షించి వారి ఆశీస్సులను తీసుకొనటం తపస్సుకు బలాన్నిస్తుందే తప్ప అది నీకు భంగం కాదని నీకు తెలియదా?'' అని ఆయన ఎదురుగుండా పద ఘట్టనం చేశాడు. ఆయన లేవలేదు. అతడికి కళ్ళు మూసుకుపోయాయని అగస్త్యుడికి కోపం వచ్చింది.

''నీవు మదోన్మత్తుడి వలె ఉన్నావు. వట్టి మొద్దులా పడి ఉన్నావు. ఏం తపస్సు ఇది! చైతన్య రహితుడివై ఉన్నావు. మహాత్ముడు ఎదురుగా వచ్చినా చూడవా! తపస్సులు చేసినవాళ్ళను మేము చూడలేదా! పెద్దలొస్తే అర్ఘ్య పాద్యాలివ్వలేదా?'' అని ఆయనను కోప్పడ్డాడు అగస్త్యుడు. ''ఈ అపరాధానికి నేను నిన్ను శపిస్తున్నాను. నువ్వు పెద్ద ఏనుగువై పుట్టు'' అని శపించాడు.

ఇంద్రద్యుమ్నుడు ఆయన కాళ్ళమీద పడి



‘‘మ హాత్మా! నేను ఎవరినీ చూడదలచుకోలేదు. చూచినా నమస్కరించదలచుకోలేదు. అలాంటి సంకల్పంతో, దీక్షతో నేను ఈ ధ్యానం చేస్తున్నాను. అంతేకానీ మీ యెడల ఎలాంటి చులకన బుద్ధితోనూ నమస్కరించకపోవటం కాదు. కాబట్టి నన్ను అనుగ్రహించవలసింది’’ అని అన్నాడు.

అగస్త్యుడు అప్పుడు ఇంద్రద్యుమ్నుడితో, ‘‘ప్రతి జీవుడిలోనూ దోషము ఉంటుంది. ఆ దోషం నివృత్తి అయ్యేదాకా విష్ణుతత్త్వంలో నీవు లీనం కాలేవు. ఇంకొక జన్మ ఎలాగూ రాసి పెట్టి ఉంది. ఇలా ఎంతకాలం ఉంటావు? ఆ దోష నివృత్తి కాకపోతే ఇంతే. నువ్వు కొన్ని వేల సంవత్సరాలు ఇలాగే ఉండాల్సివస్తుంది. నీకు ఒకే ఒక జన్మ విధించి, ఆ దోష నివారణ చేసి, నిన్ను పరిశుద్ధుణ్ణి చేసి, విష్ణుపదానికి పంపించాలనే ఉద్దేశ్యంతో వచ్చాను. నా పట్ల నీవు ఏదో ఒక అపరాధం చేయకపోతే, నిన్ను నేను ఈ జన్మలోంచి పశు జన్మలోకి ఎలా పంపించగలను? అందుకని అలా చేశాను. నీకు నేను ఇంకొక జన్మను ఇస్తాను. కాబట్టి నువ్వు గజేంద్రుడివై, ఏనుగులకు రాజుగా పుట్టు. నిన్ను నీ బాగు కోసమనే శపించాను. నువ్వు నాకు నమస్కరించకపోతే నాకేమిటి నష్టం? నిమిత్తమాత్రంగా ఇప్పుడు నీచేత ఆచరించబడినటువంటి ఈ అపరాధం నీకు పునర్జన్మ హేతువవుతుంది. తద్వారా నీ దోష నివృత్తి అగును గాక! ఆ జన్మలో సాక్షాత్తు నీకు విష్ణుదర్శనం అవుతుంది. అతడి చేతుల్లోనే అతడిలోనే లయం అవుతావు. నిన్ను తనలో ఆయన ఐక్యం చేసుకుంటాడు’’ అన్నాడు అగస్త్యుడు. అలా ఆయన భాగవతంలోని ఒక మహోత్తమ ఘట్టానికి కారకుడయ్యాడు. అగస్త్యుడి శాపం చేత, పూర్వపుణ్యం చేత ఇంద్రద్యుమ్నుడు గజేంద్రుడయి పుట్టాడు. అదే గజేంద్ర మోక్షం చరిత్ర.

ఈ తపస్సులు ఎలాంటివి? ఎన్ని జన్మలు ఎన్ని వేల సంవత్సరములు ఎంత చేసినా అలా ఎందుకవుతుంది? దీనికి ఒక ముగింపు లేదా? ఈశ్వరుడు ప్రత్యక్షం కావాలి కదా? అని ప్రశ్న. అంటే ముక్తికొరకై ఆచరించబడేటటువంటి తపస్సుకు, ఈశ్వరుడిలో లయం చెందుదామనే తపస్సుకు అవరోధంగా ఏదో ఒక చిన్న కర్మశేషం మిగిలి ఉంటుంది. ఆ కర్మశేషం నివారణ అయ్యేవరకు కూడా అలాగే వేలాది సంవత్సరములు తపస్సు చేకుంటూనే ఉన్నారు. తపస్సు అంటే ఆత్మదర్శనం అని వేదాంతి చెప్తాడు. ఈశ్వర దర్శనం అని భక్తుడు చెప్తాడు. అలాంటిదేదో అయిన తర్వాత కూడా, ఆ జీవత్వం అతడిని వదలక ఆ కర్మశేషం అనుభవింపచేస్తుంది. ధృవుడి చరిత్ర కూడా అంతే. విష్ణుదర్శనమయితే అయింది కానీ, ముక్తినడిగితే ఆయన వెంటనే ఇవ్వలేదు. నీకింకా 26 వేల సంవత్సరాలు వ్యవధి ఉందన్నాడు. మరి మిగిలినవాళ్ళకి ఏమవుతున్నది? లౌకికమైన కోరికలతో చేసే తపస్సుల్లో, వ్యక్తి తపస్సును అనవసరంగా ఎక్కువగా పెరగనీయకుండా, ముందే ప్రత్యక్షమై, అతడికి ఆ భౌతికమైన కోరికలిచ్చేసి, అంతటితో తపస్సులోంచి బయటికి లాగి మళ్ళీ మామూలు మనుష్యుల్లో పడేస్తుంది దైవం.

ఆత్మజ్ఞానం కోసం చేసే తపస్సు అనంతంగా సాగుతూనే ఉండవచ్చు. అలాగ అనేకమంది ఈ కాలంలో కూడా తపస్సు చేస్తూనే ఉన్నారు. ఈ శతాబ్దంలో కూడా 50 ఏళ్ళపాటు ఒక యోగి తపస్సులో కూర్చుని ఉన్నాడు లంబికాయోగంతో. ఏమైంది చివరకు? అతడు ఆత్మదర్శనం కలగాలని కూర్చున్నాడు. లంబికాయోగం వలన జరిగినదేమిటంటే, దేహం తన మామూలు పరిస్థితులలోని అవసరాలైన అన్నవస్త్రాలు, నిద్ర – ఇట్లాంటి అవస్థలన్నింటికీ దూరమైపోయి, వ్యక్తి మాత్రం నిశ్చింతగా ఉండిపోతాడు. ఈ సృష్టిలో ఏదీ కూడా తనను ఆకర్షించదు. వైరాగ్యం పెరుగుతుంది. అంతర్ముఖత్వం ఇస్తుంది. అవన్నీ ఏర్పడతాయి. అయినా కూడా ఆత్మదర్శనం, కాలాంతరమందు ఎప్పుడో ఈశ్వరానుగ్రహం చేత జరగవలసిందే. మరి ఈ తపస్సు దేనికోసమంటే – ఆ ఆత్మదర్శనం కోసం వేచి ఉండటమే తప్ప, తాను వెళ్ళి ప్రయాణం ముగించి సంపాదించుకోవటం అనేది లేదు. ఆ ప్రయాణానికి అంతు లేదు. దానంతటదే అది లభించవలసిందే. ఆ కారణం చేతనే – భారతంలో, రామాయణంలో, ఏ పురాణంలో చూచినప్పటికీ, అనేకమంది వేలాది సంవత్సరములు అరణ్యాలలో తపస్సు చేస్తున్నారు అని ఉంటుంది. వేల సంవత్సరములు తపస్సు చేయటమేమిటి? వీళ్ళకేం పని కావటం లేదా? అలాగ తపస్సులు చేసినవాళ్ళు కూడా కొందరు రాక్షసుల వాతపడి సంహరించబడ్డారు కదా! కారణం ఏమిటి? రాక్షసుల చేతుల్లో సంహరించబడటమేమిటి తపస్సులు చేసుకునేవాళ్ళు. వాళ్ళ తపస్సు వాళ్ళను రక్షించలేదా? వాళ్ళు కోరే కోరిక తీరదా? – ఇలాంటి సందేహాలు కలుగవచ్చు.

వాళ్ళు కోరే ముక్తికి ఏ కర్మ అయితే అడ్డు వస్తున్నదో, ఆ కర్మానుభవం వాళ్ళకి రావలసిందే. ముక్తికి అడ్డం వచ్చేటటువంటి కర్మ, కర్మఫలం, సంస్కారం, మానుషత్వం, ఈ ప్రపంచపు వాసన – ఇదంతా నిశ్శేషంగా దానంతటది పోదు. ఏదో ఒక సంఘటన, ఒక అనుభవం, ఒక జన్మ అయితేనే అవుతుంది. ఎవడి అదృష్టం పండుతుందో వాడికి ఆ తపస్సు అక్కడితో భంగమై, ఆ కర్మ శేషానికి – దాన్ని ఖర్చు పెట్టడానికి – ఏయే సంఘటనలు కావలెనో ఆ సంఘటనలు వెంటనే జరిగితే, అతడు ముక్తిని పొందుతాడు. ఆ తపస్సుకు భంగం కలగటమే వాడి అదృష్టం. అలా కాకపోతే శిలామయంగా కూర్చుని ఉంటాడే తప్ప వాడికేమీ సుగతి ఉండదు. వేలాది సంవత్సరములు ఎందుకు తపస్సులో ఉన్నారు అంటే, సమాధానం ఇదే.

**–శివానంద సుపథ**
**ఫౌండేషన్ సౌజన్యంతో**



# సింహగిరి నరహరి... నమో నమో దయానిధీ!

– చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో ॥ "శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగీంద్ర భోగమణి రాజిత పుణ్యమూర్తే
యోగేశ శాశ్వత శరణ్య భవాబ్ధి పోత
లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్"

విశాఖ నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం వైశాఖ మాసం. 'ధాత' అనే పేరుతో సూర్యుడు లోకాన్ని ప్రకాశింపచేసే కాలం వైశాఖం. ఈ మాసం మాధవ మాసమని ప్రతీతి.

"న మాధవ సమో మాసో న కృతేన యుగం సమమ్
న చవేద సమం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్"

కృతయుగంతో సమానమైన యుగం, వేదంతో సమానమైన శాస్త్రం, గంగతో సాటి యగు తీర్థం లేనట్లే, వైశాఖమాసంతో సాటి వచ్చే మాసం లేదని శాస్త్ర వాక్యం. ఈ మాసమునకు ఇంద్రుడు, అగ్ని అధిపతులు. వసంతమాసం, ఋతువులో మొదటిమాసంగా వచ్చే చైత్రమాసానికి మధుమాసం అని వైశాఖమాసానికి మాధవ మాసమని పేరు.

యుగాలు నాలుగు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో యజ్ఞయాగాలు, ద్వాపరయుగంలో హరిహర పూజలు, కలియుగంలో స్నానవ్రతాలు ముఖ్యమైనవి. స్నానవ్రతాదులు కామధేనువు వంటివి. అవి కోరిన కోరికలను నెరవేరుస్తాయి.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

సత్పురుషులను సంరక్షించుటకు, దుష్టులను రూపు మాపుటకు, ధర్మమును స్థిరము కావించుటకు నేను ప్రతియుగంలో తదనుగుణంగా అవతరింతును – అని గీతాచార్యులు పలికిన పలుకులు అక్షర సత్యములు. అన్ని యుగముల యందును, ఎల్లవేళల యందును, సకల లోకములందును ధర్మానికి, అధర్మానికి, సత్యానికి, అసత్యానికి, సత్త్వమునకు, తమోగుణమునకు, పుణ్యపాపములకు మధ్య

ఎప్పుడూ ఘర్షణలు జరుగుతూనే ఉంటాయి. వెలుగుల ముందు చీకట్లు పారిపోతూనే ఉంటాయి. అంతిమ విజయం ధర్మానికే దక్కుతుంది. ధర్మాన్ని రక్షించటానికి భగవానుడు ఎత్తిన దశావతారాలలో నరసింహావతారం విశిష్టమైనది. భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని ప్రకటించిన అవతారం ఇది. ఆర్తత్రాణ పరాయణునిగా నారాయణుడిని నిరూపించే అవతారం కూడా ఇదే. భక్తుని నమ్మకాన్ని నిరూపించిన భక్తపరాధీనుడు నరసింహుడు. వైశాఖ శుద్ధ చతుర్దశి నాటి మునిమాపు వేళ

**"దేవతాకార్య సిద్ధ్యర్థం సభా స్తంభ సముద్భవమ్"**

ఉగ్రస్తంభం నుంచి నరసింహుడు ఆవిర్భవించాడు. నరసింహుని ఆవిర్భావం కేవలం రాక్షస సంహారం కోసం కాదు. దైవచింతన, దైవం పట్ల నమ్మిక ఎంతటి మహత్తును ప్రకటించగలవో నిరూపించడమే. భక్తికి ఎంతటి అపరిమితమైన శక్తి ఉందో ఆ స్వామి స్వయంగా నిరూపించాడు. సగం మానవుడు, సగం సింహం రూపంలో అపర రుద్రుడై స్వామి ఆవిర్భవించాడు. అందుకే ప్రదోష కాలంలో శివుని పూజించినట్లే నరసింహస్వామిని పూజిస్తారు. శివుడే విష్ణువు... విష్ణువే శివుడని నిరూపించే మరొక లీల నరసింహావతారం.

కుంఠం కానిది వైకుంఠం. ఆ వైకుంఠమునందు ద్వారపాలకులు జయ విజయులు. విష్ణుసేవా తత్పరులు. ఒకమారు సనక సనందనాద మునులు నారాయణుని దర్శనార్థమై వైకుంఠమునకు రాగా నారాయణుని దర్శనానికి ఇది తగిన సమయం కాదని ద్వారపాలకులు వారిని అడ్డగించారు. అందుకు మునులు ఆగ్రహించి యుక్తాయుక్త జ్ఞాన మెరుంగక మమ్మల్ని అడ్డగించినందుకు మీరు విష్ణులోకానికి దూరమయ్యెదరని శపించారు. అప్పుడు జయ విజయులు శ్రీమహావిష్ణువును శరణు కోరగా మహర్షుల శాపానికి తిరుగు లేదని, శిక్ష (శాపము) అనుభవించక తప్పదని, మీరు నా భక్తులైనందున మీకు కొంత శాప విమోచనం కలిగిస్తానని పలికి నా భక్తులుగా ఉంటూ ఏడు జన్మలు కానీ, విరోధులుగా మెలుగుచూ మూడు జన్మలు కానీ భూలోకమున జన్మించి, పిమ్మట వైకుంఠానికి వస్తారని ఉపశమనాన్ని ఇచ్చాడు. అందుకు వారు మీకు దూరంగా ఏడు జన్మలు ఉండలేమని, విరోధులుగా మూడు జన్మలు ఎత్తుతామని పలికారు.

కశ్యప మహర్షికి దితియందు హిరణ్యాక్ష హిరణ్యకశిపులనే మహావీరులు జన్మించారు. హిరణ్యాక్షుడు తపమాచరించి బ్రహ్మ చేత వరములను పొంది వరగర్వితుడై బ్రాహ్మణులను, మునులను, దేవతలను హింసిస్తూ అందరినీ భయకంపితులను గావించాడు. హిరణ్యాక్షుని బాధలను భరించలేక అందరూ శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. భూదేవి హిరణ్యాక్షుని వలన తాను అనుభవించిన వేదనలను వివరించగా, శ్రీహరి ఆమెను ఓదార్చి, వరాహావతారం ఎత్తి హిరణ్యాక్షునితో తలపడి యుద్ధమొనర్చి అతనిని సంహరించాడు.

సోదరుని మరణానికి చింతించి, అందుకు కారణభూతుడైన శ్రీహరి మీద పగ పెంచుకుని బ్రహ్మను గురించి తపమాచరించి వరాలను పొందాడు. వరగర్వితుడైన హిరణ్యకశిపుడు లోక కంటకుడై అందరినీ బాధించసాగాడు. ఆ రాక్షసుని బాధలను భరించలేక విష్ణువుని ప్రార్థించగానే వారి ప్రార్థనలను ఆలకించిన విష్ణువు ఆ రాక్షసుని వధించి శిష్ట రక్షణను కావించెదనని వారికి అభయమిచ్చాడు.

హిరణ్యకశిపుని భార్య లీలావతి. వారి కుమారుడు ప్రహ్లాదుడు. అఖిల లోకానికి హ్లాదము కలిగించడం చేత బాలునకు ప్రహ్లాదుడు అను నామధేయాన్ని ఒసగించాడు నారదుడు. ప్రహ్లాదుడు జన్మతః పరమ భక్తుడు. పెద్దల పట్ల వినయ విధేయతలతో దరి చేరి నమస్కరించేవాడు. పర స్త్రీలను తల్లిలా చూచి గౌరవించేవాడు. కలలో సైతం అసత్యమాడేవాడు కాదు. నిత్యం హరినామ స్మరణ తప్ప ఇతరం ఎరుగనివాడు. యుక్త వయసు రాగానే విద్యాభ్యాసమునకై గురువులకు అప్పగించాడు హిరణ్యకశిపుడు.

కొన్ని రోజుల తర్వాత హిరణ్యకశిపుడు తన కుమారుని రప్పించి ఇంతవరకూ నేర్చుకున్న శాస్త్ర పాఠమొకటి చెప్పమని అడిగాడు. అందుకు ప్రహ్లాదుడు వినయంతో గురువులు ఎంతగానో చదివించారు. వారి కృపా కటాక్షములతో సకల శాస్త్రములను చదివితిని. అంతేకాదు చదువులలో దాగి ఉన్న రహస్యాలను కూడా తెలుసుకుంటినని పలికాడు. అందుకు ఆగ్రహించిన హిరణ్యకశిపుడు ఈ జ్ఞానం నీకెలా వచ్చిందని అడుగగా ఎప్పుడూ శ్రీహరినే ధ్యానించేవారికి సర్వమూ అవగతమవుతుందని వేరొకరు చెప్పాలా! అని పలికాడు. ఆ మాటలను విన్న హిరణ్యకశిపుడు క్రోధంతో పదే పదే శ్రీహరీ శ్రీహరీ అని పలుకుతున్నావు. ఆ శ్రీహరి ఎక్కడ? ఎక్కడుంటాడని పలుకగా ఇందు గలడందు లేడని సందేహం వలదని, శ్రీహరి అంతటా ఉంటాడని పలికాడు. అందులకు ఆగ్రహించిన హిరణ్యకశిపుడు ఎన్నో శిక్షలకు గురి చేశాడు. అయిననూ శ్రీహరి నామస్మరణ వదలకపోవడంతో అతణ్ణి శిక్షించడానికి సముద్రంలోకి తోసివేశాడు. ప్రహ్లాదుడు సముద్ర గర్భం నుంచి ''త్రాహి త్రాహి నారాయణా'' అని వేడుకున్నాడు. భక్తుని ఆర్తిని అందుకున్న శ్రీహరి పరుగు పరుగున బయలుదేరాడు. తన చెంతనే యున్న లక్ష్మీదేవికి, తన వాహనమైన గరుత్మంతునికి చెప్పకుండా పీతాంబరం జారిపోతున్నా సరి చేసుకొనకుండా భక్తుడైన ప్రహ్లాదుణ్ణి ఒక చేత్తో పట్టుకున్నాడు. నారాయణుని ఆ వేగానికి గరుత్మంతుడు ఆశ్చర్య చకితుడయ్యాడు. భక్తుని రక్షించుటలో క్షణకాలమైనా ఆలస్యాన్ని సహించలేని పరమాత్మ ఒక్క ఉదుటన కిందకు దూకినాడు. ఆయన పాదాలు పాతాళం వరకు విస్తరించాయి. ఆది వరాహ స్వామి రూపంలో





భూమండలాన్ని ఎత్తినట్లు పర్వతాన్ని ఎత్తి ప్రహ్లాదుణ్ణి రక్షించాడు. తనను రక్షించిన స్వామిని ప్రహ్లాదుడు పరి పరి విధాలుగా స్తుతించాడు.

ఈ విషయాన్ని గ్రహించిన హిరణ్యకశిపుడు తమ కులాచారములను నేర్పించవలెనన్న ఉద్దేశ్యముతో గురువులకు తిరిగి అప్పగించాడు. కొన్ని రోజుల తరువాత హిరణ్యకశిపుడు గురువుల వద్ద చదువుచున్న ప్రహ్లాదుణ్ణి రప్పించి గురువులు నేర్పిన శాస్త్రములలో ఇంతవరకూ నేర్చుకున్న శాస్త్రపాఠమొకటి చెప్పమని అడిగాడు.

తండ్రీ! గురువులు ఎంతగానో చదివించారు. వారు కృపతో నేర్పించిన శాస్త్ర సారాంశాన్ని అంతటినీ గ్రహించాను. మర్మములన్నీ వినయంతో అభ్యసించితినని పలికాడు. అందుకు హిరణ్యకశిపుడు అభ్యసించిన మర్మములలోని సారాంశమేమనగా ప్రహ్లాదుడు బదులిస్తూ అఖిలాండములకు జీవనాధారమైన శ్రీహరి, తమస్సును పోగొట్టి జ్ఞానామృతమును ప్రసాదిస్తాడనే విషయాన్ని శ్రద్ధతో గ్రహించానని పలికాడు. ఆ మాటలు విన్న హిరణ్యకశిపుడు క్రోధంతో పదే పదే శ్రీహరి అని పలుకుతున్నావు. ఆ శ్రీహరి ఎక్కడ? ఎక్కడుంటాడని పలుకగా, శ్రీహరి సర్వాంతర్యామి యని, ఎందెందు వెతికినా అందందు కనిపిస్తాడని ప్రహ్లాదుడు బదులిచ్చాడు. అయితే ఈ స్తంభమునందు చూపగలవా? ఆ చక్రిని అని అడిగాడు. సర్వాంతర్యామియైన శ్రీహరి ఈ స్తంభమునందు ఎందుకుండడని ప్రహ్లాదుడు అన్నాడు. అలాగా, సరే చూద్దామని స్తంభముపై గదతో కొట్టగా బ్రహ్మాండం బద్దలయినట్లు భీకరంగా అరుస్తూ హిరణ్యకశిపుని ఒడిసిపట్టి తన ఒడిలో వేసుకుని, వజ్రాల వంటి తన నఖాలతో చీల్చి చెండాడాడు. రుధిరం పారబోశాడు. ప్రేవులను చీల్చి చెండాడాడు. దాంతో దేహం ఛిద్రమై హిరణ్యకశిపుడు ముక్తి నొందాడు. హిరణ్యకశిపుని శరీరం నుండి జ్యోతి బయల్వెడలి శ్రీహరిలో లీనమైంది.

అనంతరం స్వామి ప్రహ్లాదుణ్ని ఆశీర్వదించి బయలుదేరి వెడుతూ కొంతకాలం పుట్టలో నివసించసాగాడు. కొన్నాళ్ళకు షట్చక్రవర్తులలో ఒకడైన చంద్రవంశపు వాడైన పురూరవ చక్రవర్తి ఊర్వశితో విహరిస్తూ ఆ ప్రాంతానికి వచ్చాడు. విహరించి విహరించి చీకట్లు కమ్ముకుని రాత్రవగా తన రాజ్యానికి చేరుకుని నిద్రించాడు. ఆ రాత్రి చక్రవర్తికి స్వామి కలలో కనిపించి నేను ఇక్కడే ఉన్నాను. నన్ను ఆరాధించుమనే సందేశాన్ని ఇచ్చాడు. మరునాటి ఉదయం నుంచి స్వామి ఆచూకీ కోసం వెతికి వైశాఖ శుద్ధ తృతీయ నాడు స్వామిని కనుగొన్నాడు. స్వామిపై ఉన్న పుట్టను తొలగించాడు. గంగధారతో అభిషేకించాడు. పంచామృతాభిషేకం గావించాడు. ఆవిధంగా స్వామిని ఆరాధించగా అనుగ్రహించి చక్రవర్తితో నేను ఇన్నాళ్ళు పుట్టలో ఉన్నాను కనుక చల్లగా ఉన్నాను. ఇప్పుడు బయటకు రావడంతో

ఉష్ణాన్ని భరించలేకుండా ఉన్నాను. చల్లదనం కోసం గంధపు పుట్టను కల్పించి శ్రీచందనమును సమర్పించమని ఆదేశించాడు. స్వామి ఆనతి ప్రకారం చందనాన్ని సమర్పించాడు చక్రవర్తి. అలా చక్రవర్తి కాలం నుంచి సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారికి చందనోత్సవం జరుగుతోంది.

సింహాచల క్షేత్రంలో ప్రధాన ఉత్సవం చందనయాత్ర. వైశాఖ మాసంలో జరిగే చందనసేవకై తమిళనాడులోని తిరువత్తూరు నుంచి తెచ్చిన గంధపు చెక్కలను అరగదీసి శ్రీగంధాన్ని సిద్ధం చేస్తారు. చందన యాత్ర చేపట్టేముందు రోజు నుంచి కుంభ వాహనాది కార్యక్రమములు జరుగుతాయి. తదియనాడు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి స్వామికి ఉన్న చందనాన్ని తీస్తారు. స్వామి నిజరూపంలోకి వచ్చిన వెంటనే అభిషేకించి స్వామికి శిరస్సున, ఛాతిపైన చలువ చందనాన్ని ముద్దలుగా ఉంచుతారు. మొదటగా నిజరూప దర్శనాన్ని ఆనువంశిక ధర్మకర్తలకు కలుగజేస్తారు. ఆ తరువాత భక్తులు సేవిస్తారు. జీయరు స్వాముల శ్రీహస్తాలతో సహస్ర ఘటాభిషేకం జరుగుతుంది. గంగధార జలాలను వెయ్యి కలశాలతో తెచ్చి స్వామిని అభిషేకిస్తారు. ఆ రోజు రాత్రి వరకు నిజరూప దర్శనాన్ని భక్తులకు కలుగజేస్తారు. తదనంతరం మూడు మణుగుల శ్రీగంధాన్ని స్వామికి సమర్పిస్తారు. చందనోత్సవం కొరకు, నిజరూప దర్శనార్థమై జనులు తండోప తండాలుగా తరలి వస్తారు.

''వైశాఖ శుక్ల పక్షే చతుర్దశ్యాం సమాదరేత్ మజ్జన్మ సంభవం వ్రతం పాపం ప్రణాశనం'' అని నరసింహస్వామియే స్వయంగా చెప్పిన వాక్కులు. ఎవరైతే నరసింహ జయంతి వ్రతాన్ని ఆచరిస్తారో వారి పాపములన్నీ నశింపబడి స్వామి అనుగ్రహానికి పాత్రులవుతారు. ఆ రోజున నువ్వులు, ఉసిరికపిండిని ఉపయోగించి స్నానం చేసి –

''ఉపోష్యేహం నరసింహ భుక్తి ముక్తి ఫలప్రద, శరణంత్వాం ప్రపన్నోస్మి భక్తిం మే నృహరే దివ'' అని సంకల్పం చెప్పుకుని సాయం కాలం వరకు ఉపవాసం చేసి, సాయంకాలమునందు నరసింహుని అర్చించిన తరువాత ''పరిత్రాణాయ సాధూనాం జాతో విష్ణుః నృకేసరీ గృహాణార్ఘ్యం మయాదత్తం స లక్ష్మీనృహరే స్వయం'' అని అర్ఘ్యమును ముమ్మార్లు సమర్పించాలి. ''కరావలంబనం దేహి శేషశాయిన్ జగత్పతే శ్రీ నృసింహ రమాకాంత భక్తానాం భయనాశన'' క్షీరాంబుధి నివాసస్త్వం చక్రపాణే జనార్దన వ్రతానానేన దేవేశ భక్తి ముక్తి ప్రదోభవ'' అని ప్రార్థనా నమస్కారములు ఆచరించాలి. మరుసటి రోజు ఉదయం యథావిధిగా స్వామిని పూజించి, పూజానంతరం స్వామివారి చిత్రపటాన్ని బ్రాహ్మణునకు – ''నృసింహ చ్యుత గోవింద లక్ష్మీకాంత జగత్పతే అనేనార్చ ప్రదానేన సఫలాస్స్యుర్మనోరథాః'' అంటూ దానం ఇవ్వాలి.

పరమ పావన దినమైన చందనోత్సవమునాడు చిత్తశుద్ధితో స్వామిని అర్చించి, పూజించి ధన్యులమవుదాము. ఆ స్వామి కృపకు పాత్రులమవుదాము.

**"ఓం నమో నరసింహాయ వజ్ర దంష్ట్రాయ వజ్రిణే**
**వజ్రదేహాయ వజ్రాయ నమో వజ్ర సఖాయ చ**
**ఆ నా భేర్ద్ర బ్రహ్మణీరూపం అగళా ద్వైష్ణవం వపుః**
**ఆశీర్షాద్రు ద్రమీశానాం తదగ్రే సర్వత శ్శివం"**
**- చతుర్ముఖ బ్రహ్మ చేసిన లక్ష్మీ నృసింహ స్తుతి**

''సర్వేజనాః సుఖినోభవంతు''



# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 401.చక్రిణే నమః

అప్రతిహతమైన సుదర్శనమను పేరు గల వేయి అంచుల చక్రాయుధమును ధరించినవాడు చక్రి అని కీర్తింపబడుతున్నాడు. అతడే విష్ణుదేవుడు. చక్యతే తృప్యతే, జగత్, ప్రతిహన్యతే చ తమో యోన తచ్చక్రం – సోస్యాస్తీతి – చక్రీ అని వ్యుత్పత్తి. జగత్తును తృప్తి పరచేది, అంధకారాని, శత్రువులను ఎదుర్కొని సంహరించేది – చక్రం. దానిని కలవాడు తృప్తికారకుడు, శత్రుసంహారకుడు, దుష్ట సంహారకుడగు విష్ణువు. జగత్తుకు తృప్తిని కలిగిస్తూ, అంధకారాన్ని సంహరించే-తొలగించే – సూర్యుడు కూడా చక్రి అనబడుచున్నాడు.

చక్రి యొక్క అర్చావతారమగు వేంకటేశునకు నమస్కారము.

చక్రీ నామము విష్ణు సహస్ర నామములలో 908, 995 సంఖ్యలతో ఉన్నది.

చక్రాయుధము విష్ణుదేవునకే అసాధారణ ఆయుధము కనుక దాని పేరుతోనే చక్రీ నామము ఏర్పడింది. మన్మస్తత్త్వాత్మకం సుదర్శనాత్మ చక్రమ్ అని శంకర భాష్యం. మనస్సే చక్రము. మనస్సుకు చేతనత్వం కలిగించే ఆత్మ చక్రీ. అగ్ని తత్త్వమ్ సుదర్శన చక్రమని భాగవతం. షట్కోణములతో, పదహారు భుజములతో ప్రకాశించే పురుషదేవత సుదర్శనుడు. సుదర్శన చక్రమును పూజించే సంప్రదాయం వైష్ణవులలో ఉంది. కుమ్మరి కూడా చక్రి నామధేయుడే.

విష్ణుదేవుడు కృష్ణావతారమున శిశుపాల వధ, నరకాసుర వధ, పౌండ్రక వధ, కాశీరాజు వధ మున్నగు వానిలో కృష్ణుడు చక్రాయుధమునే ఉపయోగించెను. విష్ణువు గజేంద్ర రక్షణకై మొసలిని కూడా చక్రాయుధముతో సంహరించెను.

కురుక్షేత్ర యుద్ధములో కృష్ణుడు సూర్యమండలమును కప్పి పుచ్చుటకు చక్రాయుధమునే ప్రయోగించినాడు. ఈ సంఘటన చక్రాయుధ ప్రభావములలో ఒకటి. అర్జునుడు తన కుమారుడైన అభిమన్యుని వధకు కారకుడైన జయద్రధుని సూర్యాస్తమయం లోగా సంహరించేదనని ప్రతిజ్ఞ చేసినాడు. గడువులోగా అతనిని వధింపలేనిచో నేను ఆత్మహత్య చేసుకొందునని కూడా శపథం చేసినాడు.

అప్పుడు కౌరవులు సాయంకాలము వరకు జయద్రధుని దాచి పెట్టినారు. అర్జునుడు జయద్రధుని వధింపజాలని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు కృష్ణుడు సాయంకాలమునకు ముందే చక్రమును ప్రయోగించి సూర్యమండలమును కప్పివేసినాడు. అంత సూర్యాస్తమయమై చీకటి ప్రవేశించెనని లోకులందరూ భ్రమించిరి. దుర్యోధనాదులు అర్జునుడు ప్రతిజ్ఞను నెరవేర్చుకొనలేకపోయినాడు. ఇక అతని ఆత్మహత్య తప్పదని సంబర పడినారు. జయిద్రధుని దాచిన చోటు నుండి వెలుపలికి తెచ్చినారు. దానిని గమనించిన కృష్ణుడు దూరమున నున్న జయద్రధుని చూపించి బాణప్రయోగము చేయమని అర్జునుని ఆదేశించి వాని వధ కాగానే సుదర్శన చక్రమును ఉపసంహరించుకొనగా ఆకాశమున మరియొక గంట ప్రొద్దు ఉండి సూర్యుడు ప్రకాశించెను. అర్జునుని ప్రతిజ్ఞ నెరవేరింది. విశాల సూర్యమండలమును ఆచ్ఛాదించుట ఈ చక్రాయుధమునకు తప్ప మరెవరికి సాధ్యము? ఇది యొక అద్భుత ప్రయోగము. ఇట్లు ఎన్నో ప్రభావములు కల అసాధారణమైన సుదర్శన చక్రాయుధమును హస్తమున అలంకారముగా ధరించినవాడు అని చక్రి నామమునకు తాత్పర్యము. ఈ చక్రి నామము విష్ణునికి, కృష్ణునికి కూడా అన్వయించుచున్నది. వేంకటేశ్వరుడు పై కుడిచేతిలో చక్రమును ధరించి యున్నాడు. ఉత్సవముల కడపట జరిగే అవభృథ స్నానమునకు చక్రస్నానమను పేరు కలదు. బ్రహ్మోత్సవములలో కడపటి దినమున (9) వరాహస్వామి ఆలయంలో మలయప్పస్వామికి దేవేరులకు సుదర్శన విగ్రహానికి స్నపన తిరుమంజనం జరుగుతుంది. తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారునకు మాత్రమే స్వామి పుష్కరిణిలో అవభృథము చక్రస్నానము జరుగుతుంది.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

## 402.దైత్యాంతకాయ నమః

దితి సంతానమగు దైత్యులను – రాక్షసులను – అంతమొందించిన – సంహరించిన – వాడు – విష్ణుదేవుడు.

ఈ నామము రక్షస్సందోహ భంజనాయ నమః (80) అని గలదు. వివరములకు ఈ నామ (80) వ్యాఖ్యను పరిశీలించండి.

ఈ సందర్భమున ఈ నామమునకు పర్యాయ నామముగా నున్న దండకాసుర విధ్వంసినే నమః (87) అను నామము దైత్యఘ్నే నమః (253) అను నామముల వ్యాఖ్యను పరిశీలించండి. దైత్యాంతకుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 403. సభ్యాయ నమః

సభలో ఉండుటకు అర్హుడు. ధర్మరాజు నిర్వహించిన రాజసూయ యాగ సభలో అగ్ర స్థానమునకు (ప్రథమ గౌరవమునకు) కృష్ణుడు తగిన వాడని భీష్ముడు ధర్మ రాజుకు చెప్పినాడు. ధర్మరాజు కృష్ణుని అగ్రసింహాసనమున కూర్చుండబెట్టి అగ్రపూజను చేసి ధన్యుడైనాడు.

కృష్ణుడు రాయబార సందర్భమున కౌరవ సభలో దుష్ట చతుష్టయము తనను బంధించుటకు ప్రయత్నించినపుడు తన విశ్వరూపమును ప్రదర్శించి సభ్యులను ఆశ్చర్య చకితులను, విమోహితులను, నిశ్చేష్టితులను చేసినాడు.

సభ్యుడైన విష్ణుదేవుని అవతారమైన కృష్ణుని అభేద రూపుడగు వేంకటేశునకు నమస్కారము.

## 404. రాజబంధ విమోచకాయ నమః

కంస వధానంతరము ఉగ్రసేన మహారాజును నిర్బంధము నుండి విముక్తుని చేసి రాజసింహాసనమున ప్రతిష్ఠించినవాడు కృష్ణుడు. అంతేకాక జరాసంధ వధ అనంతరం జరాసంధుడు బంధించి కారాగారంలో పెట్టిన రాజులనందరినీ బంధ విముక్తులను చేసినాడు.

ఇట్లు రాజబంధ విమోచకుడైన కృష్ణునికి అభేద రూపుడైన వేంకటేశునకు నమస్కారము.

## 405. రాజసూయ హావిర్భోక్త్రే నమః

ధర్మరాజు చేసిన రాజసూయ యాగమునకు సంబంధించిన హవిస్సును భుజించిన వాడు కృష్ణుడు.

ధర్మరాజునకు పూర్వం హరిశ్చంద్రుడు రాజసూయ యాగం చేసినాడు.

రాజసూయ హవిర్భోక్త అయిన కృష్ణుని అవతారమైన వేంకటేశునకు నమస్కారము.

## 406. స్నిగ్ధాంగాయ నమః

నిగ నిగ అని ప్రకాశించు శరీర వర్ణము కలవాడు కృష్ణుడు.

తళుకు లీనుచున్న శరీరవర్ణము కల కృష్ణుని మరుజన్మ అయిన వేంకటేశునకు నమస్కారము.

## 407. శుభలక్షణాయ నమః

సాముద్రిక శాస్త్రము చెప్పిన శరీరమునకు సంబంధించిన అన్ని శుభ లక్షణములు గలవాడు – కృష్ణుడు.

సాముద్రిక శాస్త్రము చెప్పిన పురుష శరీర శుభలక్షణములు గల కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

- రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

## హితవచనాలు

ఆ రాత్రి గడిచింది. తెల్లవారింది. ధర్మార్థాలను నిశ్చయించాడు విభీషణుడు. అన్నకు మేలు చేయాలనుకున్నాడు. నిర్భయంగా నిజం చెప్పాలనుకున్నాడు. అదొక సాహసమే.

రాక్షసాధిపతి భవనం చేరాడు. పర్వత శిఖరంలా ఎత్తైన భవనం. మతిమంతులు, మహామంత్రులు, విద్వాంసులు ఆయా భవనాల్లో ఉన్నారు. భవన రక్షణ భద్రంగా ఉంది. మదపుటేనుగుల నిట్టూర్పులు, శంఖనాదాలు, వాద్యధ్వనులు, యువతుల కిలకిల సవ్వడులు, వేదమంత్ర ఘోషలు వినపడుతున్నాయి. లోపలికి వెళ్ళాడు విభీషణుడు. అక్కడి రక్షకులు స్వాగతం పలికారు. వారి పూజలందుకున్నాడు. సింహాసనం మీద ఉన్నాడు రావణుడు. తమ్ముణ్ణి చూశాడతడు. కనుసైగ చేశాడు. బంగారు సింహాసనం మీద కూర్చున్నాడు విభీషణుడు. అతడు దేశకాలాల్ని బట్టి మంచి చెడ్డలు నిర్ణయించే సమర్థుడు. అంటున్నాడు రావణునితో.

అన్నా! సీత ఎపుడు వచ్చిందో అప్పుడే మన లంకలో అశుభాలు కనబడుతున్నాయి. హోమగుండాల్లో అగ్ని ప్రజ్వరిల్లడంలేదు. నిప్పురవ్వలు చిటపట లాడుతున్నాయి. పొగలు కమ్ముతున్నాయి. వంటశాలల్లో అగ్ని గృహాల్లో వేదాధ్యయన ప్రాంతాల్లో పాములు



పారాడుతున్నాయి. నెయ్యి పెరుగు పాయం ఇవి హోమద్రవ్యాలు. వాటికి చీమలు పట్టాయి. పాడి ఆవులు ఎండిపోయాయి. భద్రగజాలు మద ధారలు కార్చడం లేదు. గుర్రాలు దీనంగా సకిలిస్తున్నాయి. పచ్చిగడ్డి మేయడం లేదు. గాడిదలు కంచర గాడిదలు ఒంటెల రోమాలు నిక్కపొడుచుకున్నాయి. అవి కన్నీరు కారుస్తున్నాయి. వాటి జబ్బు ఏమిటో తెలియలేదు. చికిత్సలకూ లొంగటం లేదు. మామూలు స్థితికి రాలేకున్నాయి. ఎక్కడ చూసినా కాకులు గుంపులుగా చేరుతున్నాయి. కటువుగా అరుస్తున్నాయి. మేడల పైభాగాల్లో వాలుతున్నాయి. తొలి మలి సందెల్లో నగరం సమీపానికి నక్కలు వస్తున్నాయి. అశుభంగా

అరుస్తున్నాయి. క్రూరమృగాలు గుమిగూడుతున్నాయి. అవి కూడా నగర సమీపానికి వస్తున్నాయి. వాటి అరుపులు పిడుగులు పడ్డట్టున్నాయి.

అన్నా! లంకా నగరం క్షేమంగా ఉండాలంటే – దహింపబడకుండా ఉండాలంటే సీతాదేవిని రామునికి అప్పగించడం మంచిది. అదే మన దోషాలకు తగిన ప్రాయశ్చిత్తం. నేను అజ్ఞానంతో చెప్పడంలేదు. బతుకుపై ఆశతో చెప్పడంలేదు. నీకు అలా తోచితే తప్పుగా భావించకు. దుశ్శకున దోషం మన స్త్రీలకు పురుషులకు అందరికీ తెలుసు. చాలామంది నీకు భయపడుతున్నారు. చెప్పలేకపోతున్నారు. నీ తమ్ముణ్ణి కనుక నేను చూసింది, విన్నది నీకు చెప్పాలనుకున్నాను. చెప్పాను. బాగా ఆలోచించు, ఏది న్యాయమో దాన్ని చెయ్.

మంత్రుల సమక్షంలో విభీషణుడు చెప్పాడు రావణునికి. ఆ మాటలు మృదువుగా ఉన్నాయి. యుక్తి యుక్తంగా ఉన్నాయి. విన్నాడు రావణుడు. క్రోధ పరవశుడైనాడు. 'నాకు ఏ భయమూ లేదు. రాముడు రాలేడు. మైథిలిని తీసుకుపోలేడు. ఇంద్రాది దేవతలతో కూడి వచ్చినా రాముడు నా ముందు నిలవలేడు – అన్నాడు రావణుడు. తమ్ముణ్ణి పంపించేశాడు.

## ఆలోచనా మందిరం

రావణుని మనసు పాపాలోచనా మయమైంది. మైథిలి పట్ల కామ మోహితుడైనాడు. తమ్ముని మాటల్ని తిరస్కరించాడు. చింతా క్రాంతుడైనాడు. సీతాదేవిని రామునికి అప్పగించడం లేదు. యుద్ధం అనివార్యమైంది. ఇంతవరకు సీతాపహరణ విషయం లంకా వాసులకి తెలియదు. బంధుమిత్రులకి తెలియదు. మంత్రి మండలికి తెలియదు. ఇప్పుడు అందరి సానుభూతి పొందాలి. యుద్ధానికి తోడ్పడాలి. అది రావణుని ఆలోచన. కుటిల రాజనీతి.

రథమెక్కాడు రావణుడు. అది రాజభవనం వైపు నడిచింది. రాక్షస యోధులు కొందరు రథాన్ని అనుసరించారు. ముందుగా నడుస్తున్నారు. కొందరు రథాలమీద, కొందరు ఏనుగుల మీద, కొందరు గుర్రాల మీద, కొందరు నడిచి వెడుతున్నారు. వివిధ ఆయుధాలతో కొందరు వెళుతున్నారు.

రాజభవనం సమీపించింది. వేలకొద్దీ తూర్యారవాలు, శంఖనాదాలు ఆకాశాన్ని తాకాయి. రథం దిగాడు రావణుడు, చూచాడు. ఎందరో తలలు వంచారు. నమస్కరించారు. జయ జయ ధ్వానాలు చేశారు. కొందరు ఆశీర్వదించారు. కొందరు స్తుతించారు.

ఆ భవనం విశ్వకర్మ నిర్మితం. వెండి బంగారు స్తంభాలు స్ఫటికాలు పొదగబడ్డాయి. ఆరు వందల మంది పిశాచాలు కాపలా కాస్తున్నారు. ఉత్తమ ఆసనం మీద కూర్చున్నాడు రావణుడు. దూతల్ని పిలిచాడు. రాక్షస నాయకుల్ని పిలుచుకురండి ఆదేశించాడు. ఇంటింటికి వెళ్ళారు వాళ్ళు. రాజాజ్ఞ



వినిపించారు. పరుగుల మీద వచ్చారు అందరూ. వచ్చీరాగానే రావణునికి పాదాభివందనం చేశారు. కొందరు బంగారు ఆసనం మీద, కొందరు దర్భాసనాల మీద, కొందరు నేలమీద – వారి వారి స్థాయిని బట్టి కూర్చున్నారు. ముఖ్యమంత్రులు పండితులు సర్వజ్ఞులు గుణవంతులు బుద్ధిమంతులు ఎందరో ఉన్నారు.

అది బంగారు రథం. చిత్ర విచిత్రంగా ఉంది. దానిపై వచ్చాడు విభీషణుడు. రాగానే రావణునికి పాదాభివందనం చేశాడు. సమీపంలోని ఆసనంలో ఆసీనుడైనాడు. సభాభవనం నిండుగా ఉంది. వందల వేల మంది హాజరైనారు. అక్కడున్న వారంతా భయంకరులు. పరాక్రమవంతులు. రాజు హితం కోరేవారు.

ఒక్కసారి సభంతా కలయచూశాడు రావణుడు. సేనాపతి ప్రహస్తుణ్ణి చూశాడు. ''మన చతురంగ బలాల్ని అప్రమత్తం చేయించు. మన యోధుల్ని జాగరూకులై ఉండాలని, నగర రక్షణ పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పు'' అన్నాడు.

వెంటనే లేచాడు. రాజాజ్ఞ అమలు పరచాడు ప్రహస్తుడు. సభామందిరం లోపల వెలుపల బలగాల్ని నిలిపాడు. నగర రక్షణకు వేరుగా సైనికుల్ని నియమించాడు.

అంటున్నాడు రావణుడు. ''సభాసదులారా! ధర్మార్థకాములకి సంకట స్థితి వస్తే మంచి చెడ్డలు, లాభాలాభాలు తెలుసుకోవాలి. ఇపుడా స్థితి రాబోతోంది. మీకోసం నేను చేసిన పనులన్నీ సఫలమైనాయి. మీ తోడ్పాటు నాకు విజయాన్ని అందించింది. నా తమ్ముడు కుంభకర్ణుడు. వాడు మహాబలవంతుడు. సకలాస్త్ర కోవిదుడు. ఆరు నెలలు నిద్రపోతాడు. ఒకరోజు మేలుకుంటాడు. ఇపుడే మేలుకుని వచ్చాడు. వాడి సమక్షంలో చెబుతున్నాను.

రామపత్నిని, జనకమహారాజు కుమార్తెని, సీతాదేవిని – దండకారణ్యం నుంచి తెచ్చాను. నాతో భోగాలనుభవించాలని కోరాను. అందుకామె ఇష్టపడలేదు అంటూ సీతమ్మ అంగాంగాన్ని వర్ణించాడు రావణుడు. అవి అయిదు శ్లోకాలు. (నిండు సభలో పరస్త్రీని వర్ణించడం – తన కామ ప్రవృత్తిని బయట పెట్టడం ఒక రాజుగా రావణునికి తగదు. అదెంత సిగ్గుచేటు!) కోపంలో ఉన్నా, సంతోషంలో ఉన్నా, బాధలో ఉన్నా నా దేహాన్ని వివర్ణం చేస్తున్నాడు మన్మథుడు. నన్ను కలవరపెడుతున్నాడు. అయితే

ఆ భామిని భర్త కోసం (రాముని కోసం) నిరీక్షిస్తోంది. దానికి ఆమె ఏడాది పాటు గడువు కోరింది. నేను అంగీకరించాను (ఇది పచ్చి అబద్ధం). చాలా దూరం నడిచిన గుర్రంలా కామ భారంతో అలసిపోయాను నేను.

మిత్రులారా! సముద్రాన్ని దాటలేరు వానరులు. ఇక్కడికి రాలేరు. ఎలా వచ్చాడో ఒక వానరుడు వచ్చాడు. మనతో యుద్ధం చేశాడు. వెళ్ళిపోయాడు. ఏయే పనులు ఎప్పుడు ఎలా జరుగుతాయో చెప్పలేం. దేవాసుర యుద్ధం జరిగింది. అప్పుడు మీ సహకారం లభించింది. విజయం సాధించాను. అలాగే ఇప్పుడూ ఎప్పటికీ నాకు సహకారులుగా ఉంటారు మీరు. ఆ నమ్మకం ఉంది నాకు. దేవతల్ని జయించాను. ఇక మానవులంటే భయమెందుకు? సుగ్రీవాదులు, రామలక్ష్మణులు సీతాదేవి ఉన్నచోటు తెలుసుకున్నారు. వాళ్ళిప్పుడు సముద్రం ఆవలి తీరంలో ఉన్నారు. నేను సీతాదేవిని అప్పగించను. రామలక్ష్మణుల్ని చంపాలి. ఒకవేళ వానరులు సాయం చేసినా రామలక్ష్మణులకు సముద్రం దాటే సామర్థ్యం లేదు. కనుక తప్పక విజయం సాధిస్తాను. ఇది నా నిశ్చయం. మీరు ఆలోచించండి. ఉపాయం చెప్పండి. నిశ్చయించండి.

విన్నాడు కుంభకర్ణుడు. రావణుడు కామాతురుడు. వాని మాటలు శ్రద్ధగా విన్నాడు. ఉగ్రుడైనాడు. అంటున్నాడు. అన్నా! నీవు రామలక్ష్మణులను వంచించావు. సీతాదేవిని అపహరించావు. అపుడు మాతో ఆలోచించలేదు. మాట మాత్రం చెప్పలేదు. నీకు నీవే నిర్ణయం తీసుకున్నావు. మమ్మల్ని సంప్రదించకుండా చేశావు. అది మంచిది కాదు. ముందుగా చెప్పి ఉంటే ఉపాయం ఏదైనా చెప్పేవాళ్ళం. కార్యనీతి తెలిసినవారు ముందు వెనుకలు ఆలోచిస్తారు. చేయాల్సిన పని – మంత్రులతో ఆలోచిస్తారు. తర్వాత ప్రారంభిస్తారు. అలాంటివాడు ఉత్తముడు. ఎవ్వరితో ఆలోచించడు. తనకు తానే నిర్ణయిస్తాడు. కార్యాన్ని ధర్మబద్ధంగా ప్రారంభిస్తాడు. వాడు మధ్యముడు. ఈ తెగలకు చెందినవాడవు కావు నీవు. నీకు నీవే ఆలోచించావు. సీతను తెచ్చావు. న్యాయమార్గం ఆలోచించి చేస్తే సంతాపాలుండవు. అనాలోచితంగా ఆచరిస్తే అనర్థాలు సంభవిస్తాయి. అపవిత్రమైన పాత్రలో పవిత్రమైన హవిస్సులా కర్మలు నిష్ఫలమవుతాయి. అనర్థాలు తెస్తాయి. నేనే బలవంతుణ్ణి అని విర్రవీగడం – తొందరపడటం చపల చిత్తుల పని. ఆ లోపాల్ని శత్రువు పసికడతాడు. దెబ్బ తీస్తాడు. నీ కార్యం అనాలోచితం. సీతాపహరణం – విషమిశ్రితమైన మాంసంలా ప్రాణాపాయకరం. అపుడే రాముడు నిన్ను చంపలేదు. అది నీ అదృష్టం. శత్రువు పట్ల నీ ప్రవర్తన అనుచితమైంది.

రాజా! అయినా నీవు దుఃఖించకు. నేను వాళ్ళని చంపేస్తాను. నిన్ను కాపాడుతాను. నేను బతికే ఉన్నాను. భయమెందుకు? నీ శత్రువులు ఇంద్ర సూర్యులైనా, అగ్ని వాయువులైనా, కుబేర వరుణులైనా – హతమారుస్తాను. నా శరీరం పర్వతంలా విశాలం, దృఢం. పరిఘ పడతాను. యుద్ధం చేస్తాను. ఎవరైనా సరే గజగజ వణికిపోవాలి. రాముడు నాపై బాణం వేస్తాడు. రెండో బాణం వేసేలోగా వాడి రక్తం తాగుతాను. నీవు దిగులు పడకు. ఊరడిల్లు. రామలక్ష్మణుల్ని చంపేస్తాను. వానరుల్ని భక్షిస్తాను. నీవు ఏ చీకూ చింతా పెట్టుకోకు. హాయిగా విహరించు. మంచి మద్యం సేవించు. నీకు తోచిన పనులు చేసుకో. రాముడు చచ్చాక సీత నీకు శాశ్వతంగా వశమవుతుంది.

## బ్రహ్మ శాపం

విన్నాడు రావణుడు. కుంభకర్ణుని మాటల్లో రాజనీతి ఉంది. అయినా కోపం వచ్చింది రాక్షస రాజుకి. అది గమనించాడు మహాపార్శ్వుడు. క్షణం ఆలోచించాడు. చేతులు జోడించాడు. అంటున్నాడు రావణునితో.

ప్రభూ! రామలక్ష్మణులు నరశార్దూలులు. వారి రక్షణలో ఉంది సీతమ్మ. అక్కడికి వెళ్ళావు. ఆమెను అపహరించావు. ఆమెతో రమించు. ఎందుకు కాలం వ్యర్థపుచ్చుతున్నావు? అది మూర్ఖత్వమే. రాజా! నీవు ముల్లోకాలు జయించావు. సర్వ నియంతవు. ఈశ్వరునికి ఈశ్వరుడవు. శత్రువుని లెక్క చేయకు. వైదేహితో క్రీడించు. లొంగలేదా? కోడిపుంజులా బలాత్కరించు. అనుభవించు. (కోడిపెట్టకి ఇష్టం లేకపోయినా – పుంజు కోడి బలవంతాన ఆక్రమిస్తుంది. రమిస్తుంది) దానికి భయమెందుకు? అలా సీతాదేవిని ఆక్రమించుకుని వశపరుచుకో. అనుభవించు. సంతోషించు. నీ కోరిక తీర్చుకో. ఆపదలు వస్తే ఎదుర్కో. అవి నిన్నేం చేయలేవు. ఇంద్రుడు రామునికి సాయం వచ్చినా



మేం ఉన్నాం. కుంభకర్ణుడున్నాడు. ఇంద్రజిత్తు ఉన్నాడు. రాముణ్ణి చంపేస్తాం. యుద్ధం చేయలేని వాళ్ళకే సామ దాన భేదోపాయాలు. నీవు రణధీరుడవు. సమర్థుడవు. దండోపాయమే కార్యసిద్ధి. శత్రువుల్ని శస్త్రాగ్నితో వశపరుచుకో. సందేహించకు.

విన్నాడు రాక్షసేశ్వరుడు. మహాపార్శ్వుణ్ణి మెచ్చుకున్నాడు. అంటున్నాడు. ఓ రహస్యం చెబుతాను. నేను ఒక పని చేశాను.



అది జరిగి చాలాకాలమైంది. నేనొకనాడు బ్రహ్మలోకం వెడుతున్నాను. ఆ ఆకాశమార్గంలో పుంజికస్థల ఒక అప్సరస. అగ్నిశిఖ లాంటిది. బ్రహ్మకోసం పోతోంది. ఆమెని పట్టాను. వివస్త్రని చేశాను. బలవంతాన అనుభవించాను. ఏనుగు నలిపి పడేసిన తామర కాడలా ఉందామె. అలాగే వెళ్ళింది బ్రహ్మదేవుని దగ్గరికి. జరిగింది తెలిసిపోయిందాయనకి. కుపితుడైనాడు. నన్ను చూశాడు.

రావణా! ఈ క్షణం నుంచి పరస్త్రీని బలాత్కరించి రమిస్తే వెంటనే నీ తల నూరు ముక్కలైపోతుంది అన్నాడు.

ఆ శాపంతో భయపడ్డాను. సీతను బలవంతం చేయలేకపోతున్నాను. నేను సముద్రంలా శక్తిమంతుణ్ణి. నా గమనం వాయువేగంతో సమానం. అది తెలియదు రామునికి. అందుకే నా మీదికి వస్తున్నాడు. గిరి గుహలోని సింహంలా – మృత్యుదేవతలా ఉన్న నన్ను రెచ్చగొడుతున్నాడు. విషసర్పాల్లాంటి నా బాణ ప్రభావం రాముడు ఎరుగడు. మండే కాగడాల్లా వజ్రతుల్యమైన నా బాణాలు వందల కొద్దీ ప్రయోగిస్తాను. రాముణ్ణి పరితపింప చేస్తాను. నక్షత్ర కాంతిని ఉదయించే సూర్యుడు లాగేస్తాడు. అలా నేను నా సేనలతో రాముని బలాన్ని లాగేస్తాను. ఇంద్ర వరుణులు నన్ను జయించలేకపోయారు. కుబేరుడు జయించలేకపోయాడు. రాముడు, వాడి వానరసేన ఒక లెక్కా నాకు.

## విభీషణుని పలుకులు

కుంభకర్ణుడి గర్జన విన్నాడు విభీషణుడు. రావణుని ఉపన్యాసం విన్నాడు. లేచాడు. నీతి చెప్పాలనుకున్నాడు. అంటున్నాడు రావణునితో.

రాజా‘ సీతాదేవి ఒక మహా సర్పం లాంటిది. ఆమె వక్షః స్థలాన్ని కౌగలించుకోవాలనుకున్నావు. కాని అది పాము శరీరం. రాముని ఎడబాటు అనే ఆమె చింతన పాము విషం. ఆమె చిరునవ్వే పాము కోరలు. ఆమె అయిదు వేళ్ళు అయిదు తలల పాము. ఆ కాల సర్పాన్ని నీ మెడకు చుట్టుకున్నావు. వానరుల ఆయుధాలు గోళ్ళు, కోరలు. వాళ్ళు పర్వతాకారులు. మన లంకపై దాడికి రాకముందే మైథిలిని రామునికి అప్పగించు.

రాముని బాణాలు వాయు వేగ వంతాలు. వజ్రాయుధాల్లాంటివి. ఆ బాణాలు మనపై పడకముందే మైథిలిని దాశరథికి అప్పగించు. రాజా! నీవు కాని, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, మహాపార్శ్వుడు, మహోదరుడు, కుంభ నికుంభులు, మహాకాయుడు ఎవరైనా సరే రణరంగంలో రాముణ్ణి ఎదుర్కోలేరు. నిలవలేరు. సూర్యుడు కాని దేవతలు కాని దాచిపెట్టినా నిన్ను వదిలిపెట్టడు రాముడు. ఇంద్రుని ఒడిలో ఉన్నా – నిన్ను మృత్యువు కాపాడినా – ఆకాశంలో ఉన్నా – పాతాళానికి పోయినా నిన్ను వదలడు రాముడు.

విన్నాడు ప్రహస్తుడు. లేచాడు. విభీషణా! మాకు దేవతలతో భయం లేదు. దానవులతో భయం లేదు. యక్షులు గంధర్వులు నాగులు పతగులు ఇంకా ఎవరు వచ్చినా భయం లేదు. ఇక రాముని (మానవుని) వల్ల మాకు భయమెందుకు? అన్నాడు.

ప్రహస్తుని మాటలు విన్నాడు విభీషణుడు. అతడు రాజు హితం కోరేవాడు. పూజ్యుడు. ధర్మార్థ కామములు తెలిసినవాడు. అర్థవంతంగా అంటున్నాడు. ప్రహస్తా! అధర్మపరునికి స్వర్గప్రాప్తి దుర్లభం. అలాగే రాముని పట్ల మీరేం చేయాలనుకున్నా అవన్నీ అసాధ్యం. తెప్పకొయ్య లేనివాడు సముద్రాన్ని ఎలా దాటుతాడు? అలా నీవు నేను రాక్షస యోధులు రాముణ్ణి చంపడం అసాధ్యం.

**(సశేషం)**



# జయదేవుని గీత గోవిందము

– డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

గత సంచిక తరువాయి

## పీయూష లహరి

పీయూష లహరి జయదేవుడు రచించిన ప్రముఖ సంస్కృత గోష్ఠీ రూపకము. దీనికి కథావస్తువు గీత గోవిందంలోని కథా వస్తువైన రాధ ప్రధాన నాయికగా శ్రీకృష్ణుడు రాసలీల నడపడము కథాంశము. అందువలన పీయూష లహరిని – గీతగోవిందానికి భూమికగా శ్రీకార్ మహాశయుడు అభిప్రాయ పడ్డాడు. ప్రాచీనకాలంలో జగన్నాధస్వామి ఆలయంలో అనేకములైన ఏకాంక నాటికలను ప్రదర్శించే వారు. పీయూష లహరిని కూడా అటువంటి నాటక సమాజంతో కలిసి జయదేవుడు దీనిని ప్రదర్శించి నట్లు పీయూష లహరి లోని "గోష్ఠి శ్రీ జయదేవ పండితమణేః సావర్తతే నర్తితుమ్" అన్న వాక్యం వల్ల వ్యక్తమౌతున్నది.

జయదేవుడు గీతగోవిందంలోనూ, పీయూష లహరి లోనూ నిరూపించిన 'రాసలీల' భాగవతం పురాణాన్ని అనుసరించింది కాదు. భాగవత రాసలీల శరత్తులో జరుగుతుంది. జయదేవునికి మూలం బ్రహ్మవైవర్తము. ఈ రాసలీల మూడు దినాలు. భాగవత రాసలీల పంచదశరాత్రులు. జయదేవుని తరువాత జన్మించిన అనేక వైష్ణవ కవులు కూడా ఈ బ్రహ్మవైవర్త రాసమే అనువదించారు. జయదేవుని గీతగోవిందం, పీయూష లహరిని అర్థం చేసుకోవటానికి ఒరిస్సా వైష్ణవాన్ని గురించిన విజ్ఞానం కొంత అవసరం.

కళింగదేశంలో సా.శ. 8 వ శతాబ్దములో ప్రవేశించిన మహాయాన బౌద్ధం క్రమంగా వజ్రయాన, సహజయానాలుగా రూపొందింది. సా.శ.729 నాటి ఒరియా రాజు ఇంద్రభూతి చెల్లెలు లక్ష్మింకర వల్ల సహజయానం ఆ దేశంలో ప్రవేశించిందని ప్రతీతి. ఇంద్రభూతి జ్ఞానసిద్ధిలో జగన్నాధుడుని బుద్ధదేవునిగా స్తుతించాడు. సహజయానం ప్రచారం చేసినవారు కౌపదాదులు, ఔఢ్ర దేశీయులు. వజ్రయానము, సహజయానము, వైష్ణవాలు కలిసి ఔఢ్ర దేశంలో నూతన వైష్ణవానికి దారితీసి ఉంటాయి. దానికి ముఖ్యమైన ప్రవక్తలు – జయదేవుడు, రామానంద రాయలు. సహజయాన పాంధేయులు జయదేవుణ్ణి ప్రథమ ప్రవక్తగానూ, నవరసికుల్లో ఒకడినిగాను ప్రకటిస్తారు. సా.శ. 15, 16, 17వ శతాబ్దాల్లోని ఔఢ్ర రచయితలు సరళదాసు, బలరామదాసు, అచ్యుతా నందులు, పీతాంబరుడు మొదలైన



కవులు సహజయానాన్ని అనేక గీతాల్లో ప్రశంసించారు.

రామానుజుడు, మధ్వాచార్యుడు ఇరువురూ పూరీ జగన్నాథానికి వెళ్ళి వైష్ణవమతాన్ని ప్రచారం చేసారు. తరువాతి వాడైన జయదేవుడు వారి ప్రభావం వల్లనూ, అనాది నుంచి వస్తూన్న ఇంద్రభూతి చెల్లెలు తెచ్చి పెట్టిన సహజయాన బౌద్ధ ప్రభావం వల్లనూ నూతన రాధాతత్వాన్ని సాధించి ప్రబోధించాడు. దానిని స్వీకరించిన అద్వైతాచార్యుడు, ఈశ్వపూరీలకు గురువైన మహేంద్రపూరి వంగ దేశంలో ప్రవేశపెట్టినాడు. ఆయన శిష్యుడైన ఈశ్వపూరీ చైతన్య మహాప్రభువు శిష్యుడు. చైతన్య ప్రభువు జయదేవుని భక్తి జ్యోతిని అందుకొని వంగ వైష్ణవ ప్రపంచాన్ని ఉద్యోతితం చేసాడు. అందువల్ల వంగ వైష్ణవానికి ప్రథమ ప్రవక్త జయదేవుడే అని చెప్పుకోవాలి.

గోష్ఠిలో 9 లేక 10 మంది ప్రాకృత పురుషులు, 5 లేక 6 గురు స్త్రీలు ఉంటారు. అంకం ఒకటే. గర్భ విమర్శ సంధులు ఉండవు. ఉదాత్త వచనం ఉండదు. వృత్తి కైశికి, కామ శృంగార ప్రధానం.

పీయూష లహరిపై మొదటగా భారతి పత్రికలో వావిలాల సోమయాజులు ఒక సుదీర్ఘ వ్యాసం రచించాడు. తరువాత తెలుగు అనువాదాన్ని, సంస్కృత మూలంతో సహా తెలుగు విశ్వవిద్యాలయం 1990 సంవత్సరంలో ముద్రించింది.

## జయదేవపురం

ఒడిషా రాజైన పురుషోత్తదేవునకు జయదేవునిపై ఎడతెగని ఈర్ష్య. అందువలన జయదేవుని “గీత గోవిందము”ను పోలి ఉన్న ‘అభినవ గీత గోవిందం’ అను గ్రంథమును రచించెను. తన గ్రంథములోని రచనలనే పాడవలెనని ప్రజలను నిర్బంధించెను. కాని ప్రజలు గీతగోవిందమునే పాడుచుండిరి. అందుకు ఇష్టపడక తన గ్రంథము గొప్పదో లేక జయదేవుని “గీతగోవిందం” గొప్పదో పరిశీలించుటకు ఇద్దరి గ్రంథములను శ్రీ జగన్నాథస్వామి యొద్ద పెట్టి తలుపులు మూసివేసిరి. మరునాడు ప్రాతః కాలమున తలుపులు తెరచి చూచుసరికి జయదేవుని గ్రంథము శ్రీ స్వామి చేతిలోనూ, రాజుగారి గ్రంథము గర్భగుడిలో ఒకమూల నుండుటను గమనించి, రాజు ఖిన్నుడై “గీత గోవిందము” శ్రేష్ఠతను కొనియాడెను. ఈ అష్టపదులు రచింపబడిన స్థలము నాటి నుండి జయదేవపురముగా పిలువబడుచున్నది.

శృంగార తాదాత్మ్యమున ఆధ్యాత్మిక పరాకాష్ఠయైన మోక్ష మార్గము చూపునది ఈ గీతగోవింద కావ్యము. ఈ కావ్యమును శృంగార కావ్యముగా కొందఱు భావించవచ్చును, కానీ కామము కూడ శాశ్వతమైన భక్తి సాధకమని ఈ క్రింది శ్లోకమున తెలియచేయుచున్నది.

**శ్లో ॥ భక్తిః కామసమేతాపి కామాంతే న నివర్తతే**
**శ్రద్ధా వృద్ధా పరే పుంసి భూయ యేవాభివర్ధతే ॥**
**(భగవాన్ రమణ మహర్షి)**




మరియు ఈ క్రింది శ్లోకముల వలన రాధాకృష్ణుల అమలిన ప్రేమైక్యత తెలియవచ్చుచున్నది.

**శ్లో ॥ కృష్ణమూలా కృష్ణశాఖా కృష్ణహృత్పద్మ కర్ణికా**
**కృష్ణజీవాత్మికా రాధా వృషభాను తనూద్భవా ॥**

**శ్లో ॥ శ్రీకృష్ణ నయనానంద రసకర్పూర వర్తికా**
**శ్రీకృష్ణానన పూర్ణేందో రాధికా చారుచంద్రికా॥**

రాధ అను పేరుగల పురాణకాంతలు అనేకులున్నారు, గర్గ భాగవతమున గోలోక ఖండమున రాధా దేవి చరిత్ర చాలా ఉత్కృష్టముగా చెప్పబడినది. గోలోకాధిపతులు రాధాకృష్ణులు ద్వాపరయుగంలో రాధాకృష్ణులుగా జన్మించినట్లు గర్గసంహితలో శంఖచూడోపాఖ్యానములో చెప్పబడినది. ఇంద్రాణియే రాధగా జన్మించినట్లు పూర్వగాథా లహరిలో తెలియచేయబడియున్నది. శతగోపుని పుత్రికయైన గోపికయే రాధగా చెప్పియున్నారు. ఏదిఏమైనా రాధ పదహారువేల గోపికా స్త్రీలలో అష్టమహిషులలోను అగ్రగణ్యయైన శ్రీకృష్ణ ప్రేమైక స్వరూపిణి.

**శా ॥ కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా**
**సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులున్,**
**ప్రేమన్ మీరలు, భక్తి నేము, నిదె చక్రింగంటి; మెట్లైన ను**
**ద్దామ ధ్యానగరిష్ఠుఁ డైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా!**

పోతన భాగవతములో నారదుడు ధర్మరాజుతో చెప్పిన ఘట్టమిది. గోపికలు కామోత్కంఠత చేత హరిని పొందినారు. అది శృంగారాత్మకము. ఆ గోపికలలో శ్రేష్ఠురాలు, మధుర ప్రేమ భక్తికి అత్యున్నత ప్రతీక శ్రీరాధాదేవి. ఆ రాధాకృష్ణుల ప్రేమ విహారములను వర్ణించునదే జయదేవుని "గీతగోవిందము". విరహవశులై ఆ ప్రేమమూర్తులు ఆడిన ఆటలు, పాడిన పాటలు, చేసిన చేతలు రసమయ కవితాకృతి ధరించి రసిక భక్తులకు, భావుకులకు ఆస్వాదనీయములైనవి. మధురభక్తి సాహిత్యంలో మకుటాయమానమైన రచన ఇది.

కృష్ణ ప్రేమలోని ముఖ్యమైన సూత్రమొకటి ఇందులో నిక్షిప్తమైయున్నది. పరకాంతా కాముకుడైన స్వామిని లోకములో సహింపలేరు. కాని రాసమండలిలో పురుషుడొక్కడే. అతడు పరమ

పురుషుడగు శ్రీకృష్ణుడు. గోపికలు కృష్ణునిపై ఈర్ష్య వహించినను, అలుకచెందినను పరగోపికాసక్తుడని తిరస్కరించినను, మరల సమాధానపడి అతనినే ప్రేమింతురు. ఏలయనగా అతడు ఒక్కడే కాదు ప్రతియొక్కరి కొక్కడు కాగలడు. అటువంటి కృష్ణునిగాక మరెవ్వరి నారాధింతురు ఆ గోపికలు? గోపికా నాయకురాలైన రాధాదేవియు, కృష్ణునికై పరితపించినది. కృష్ణునికై జీవించినది. కృష్ణునకు సర్వస్వమును సమర్పించినది. ఆ ఇరువురి ప్రణయ లీలలీగ్రంథమున జయదేవ విరచితమైనవి.

నిజంగా అష్టపదులలోని సౌందర్యాన్ని గ్రహించాలంటే అర్థమయినా కాకపోయినా మూలాన్ని చదువుకోవాల్సిందే!

## శ్రీ జయదేవ కవి రచించిన శ్రీ గీతగోవింద మహాకావ్యం

శ్రీమహావిష్ణువు అవతార మూర్తుల స్మరణతో కావ్యం ఆరంభమవుతుంది. మూల వస్తువు విరహ వేదన. పన్నెండు సర్గలున్న ఈ కృతిలో మొదటి పది సర్గలలో విరహ శృంగారమూ, తర్వాతి రెండు సర్గలలో సంభోగ శృంగారమూ వర్ణించబడ్డాయి. మొదటి కీర్తన తప్పించి మిగతా అష్టపదులు 10 చరణాలుగా వ్రాయబడ్డాయి. ప్రతి సర్గ శ్రీకృష్ణారాధనతో ప్రారంభమౌతుంది.

ద్వాపర యుగంలో ద్వారకను ఏలిన శ్రీకృష్ణుణ్ని ఆ రాజ్యంలోని ప్రజలందరూ ఇష్టపడేవారు. నయనానందకరమైన ఆ మధురాధిపతిని స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ ప్రేమించేవారని భాగవతం చెబుతోంది.

వ్రేపల్లెలో నందుడి ఇంట పెరిగిన శ్రీకృష్ణుడి అందం, చిలిపి చేష్టలు గోప బాలబాలికలనందరినీ ఆనంద పరచేవి. శ్రీకృష్ణుడు కిశోర కౌమార దశలోనే గోప భామలను పారవశ్యానికి గురిచేశాడని భాగవతం చెబుతోంది. యౌవనంలోకి అడుగిడిన మాధవుడు గోపకన్నెలకు ప్రణయమూర్తిగా మారాడు. శ్రీకృష్ణుడి బంధువర్గం లోనివాడు విశ్వభానుడు. అతడు యశోదకు సోదరుడి వరస. ఈ విశ్వ భానుడు, కీర్తిదేవి దంపతుల కూతురే రాధ. శ్రీకృష్ణుడికన్నా మూడేళ్లు పెద్దది. ఈ రాధాకృష్ణుల మధ్య అమలిన శృంగారానికి సంబంధించిన భావకావ్యమే జయదేవ విరచిత గీత గోవిందం. మధుర భక్తిని ప్రతిబింబించే ఈ కావ్యం నాడు నేడూ సదా అనురంజకమే.

సంస్కృతభాషలో విలక్షణమైన అతి చిన్నకావ్యం గీతగోవిందం. కాళిదాసు రాసిన ఋతుసంహారము, మేఘదూతం కావ్యాలకు దీటుగా ప్రాచీన కవులతో పాటు ఎందరో సాహితీవేత్తలు గీతగోవిందాన్ని సరిపోల్చారు. ఈ కావ్యంలో నాయికా నాయకుల ప్రణయం, శృంగారాన్ని జయదేవుడు మనోహరంగా వర్ణించాడు. ఇందులో పన్నెండు సర్గలు ఉన్నాయి. ఇరవై నాలుగు అష్టపదులు ఈ కావ్యంలో వలపులు వర్షిస్తాయి. తొంభైనాలుగు వర్ణనాత్మకమైన శ్లోకాలతో గీతగోవిందం జయదేవుడి భావ వ్యక్తీకరణకు పరాకాష్ఠగా హృదయాలను రంజింపజేస్తుంది.

తొలి అష్టపది పరమాత్ముడి దశావతార వర్ణనతో ఆరంభమవుతుంది. రెండో అష్టపదిలో రాధా మాధవుల ప్రణయాన్ని సుందరంగా చూపాడు. రాధ కుచాలింగనపరుడై పరవశించే కృష్ణా దివ్య కుండలాలను, వనమాలను ధరించిన నీ ముగ్ధ మనోహర రూపానికి మంగళం అంటాడు. ఆయన వాడిన పదాలు అతి మనోహరం. మకరందంలా రుచిస్తాయి. ఆ యమునా తీర పరిసరాలను, చల్లని గాలులు కోకిల రాగాల తుమ్మెదల ఝుంకారాలను వర్ణిస్తూ నీకోసం వేచి ఉన్న గోపికల మానసాలు తల్లడిల్లిపోతున్నాయని పల్లవిస్తాడు.

మరో శ్లోకంలో కందర్ప జ్వరం అంటూ నాయిక విప్రలంబ శృంగారం ఎలా అనుభవిస్తుందో ఉదాహరిస్తాడు జయదేవుడు. తీపి రుచి తెలియాలంటే ముందు కారం తినాలట. రాధ విరహానికి వసంతం ఉద్దీపన అయింది. విరహ తాపాన్ని భరించలేక బృందావనంలోని చెట్టు, పుట్ట మొక్క కొమ్మలను నిమురుతూ రాధిక విప్రలంబ విరహోత్కంఠిత అయిందట. నాలుగో అష్టపదిలో శ్రీకృష్ణుడు మేఘశ్యాముడై చందనపు పూతలతో పరిమళిస్తున్నాడు అంటాడు జయదేవుడు. ఆయన సామోద దామోదరుడట. గోపికలందరికీ బృందావనంలో మాధవుడు ఆమోదయోగ్యుడైన వాడు. ఈ అష్టపదిలో గోపికా వల్లభుడు దక్షిణ నాయకుడు. రాధ... స్మిత మనోహరి. ఇలా గీతగోవిందం పన్నెండు సర్గల్లోనూ జయదేవుడు మాధవుణ్ని పలురకాల రూప లావణ్యాలతో వర్ణిస్తాడు.

కృష్ణుడు ఇతర గోపికలతో క్రీడిస్తున్నట్టు రాధ ఊహించుకొని అసూయ చెందుతుంది. రాధిక విరహ వేదనను మధురమైన హృదయంగమమైన వర్ణనతో జయదేవుడు పాఠకులను పరితపింపజేస్తాడు. ఎనిమిదో సర్గలో మోహనుడు విలక్షణ లక్ష్మీపతి. తొమ్మిదో సర్గలో మురళీధరుడు ముగ్ధ ముకుందుడు. పదో సర్గలో మానస మాధవుడు. పదకొండో సర్గలో సానంద గోవిందుడు. పన్నెండో సర్గలో సుప్రీత పీతాంబరుడు. ఇలా పన్నెండు సర్గల్లోని ఇరవై నాలుగు అష్టపదులతో జయదేవుడు ఈ కావ్యాన్ని రసరమ్యంగా రాగరంజితం చేశాడు.

గీతగోవిందంలో వున్న 12 సర్గలలో 24 ప్రబంధాలున్నాయి. ఒక్కో ప్రబంధము ఒక్కో అష్టపదిని కలిగి వుంది.

### గీతగోవిందం ప్రథమః సర్గః - సామోద దామోదరః

గీతగోవిందంలోని దశావతార స్తుతి చాలా ప్రాచుర్యం పొందింది. సంగీత, నాట్య రంగాలలో విరివిగా నుతించబడి, ప్రదర్శించబడినది. ఈ వర్ణనలో బుద్ధుని ఒక దశావతారంగా చెప్పబడినది. కాబట్టి అప్పటికే బౌద్ధ మతం ప్రాచుర్యం బాగా చెందినదని తెలుస్తోంది. సాహిత్యం, తాత్పర్యము.

| వ. సం. | సర్గ సంఖ్య | సర్గ నామము | ప్రబంధ సంఖ్య | ప్రబంధ నామము | రాగము- తాళము | ధ్రువం | అష్టపది |
|---|---|---|---|---|---|---|---|
| 1 | ప్రథమః సర్గః | సామోద దామోదరః | ప్రథమ | దశావతారకీర్తి ధవళమ్ | మాళవ - రూపక | జయ జగదీశ! హరే! | ప్రళయ పయోధిజలే ధృతవా నసి వేదం |
| 2 | | | ద్వితీయ | హరివిజయ మంగళాచారమ్ | భైరవి - త్రిపుట | జయ జయ దేవ! హరే! | శ్రిత కమలా కుచమండల |
| 3 | | | తృతీయ | మాధవోత్సవ కమలాకరమ్ | వసంత - ఆది | విహరతి హరిరిహ సరస వసంతే నృత్యతి | లలిత లవంగ లతా పరిశీలన |
| 4 | | | చతుర్థ | సామోద దామోదర భ్రమర పదమ్ | రామక్రియా - యతి | హరిరిహ ముగ్ధ వధూనికరే విలాసిని విలసతి కేళి పరే | చందన చర్చిత నీల కళేబర |

## ప్రథమ సర్గము – సామోద దామోదర:

## మంగళాచరణములు

**శ్లో ॥ మేఘైర్మేదుర మంబరం వన భువః శ్యామాస్తమాల ద్రుమైః**
**నక్తం భీరురయం త్వమేవ తదిమం రాధే! గృహం ప్రాపయ ।**
**ఇత్థం నంద నిదేశతశ్చలితయోః ప్రత్యధ్వ కుంజద్రుమం**
**రాధా మాధవయోర్జయంతి యమునా కూలే రహః కేళయః ॥ 1 ॥**

శ్రీకృష్ణుని పెంపుడు తండ్రి నందుడు రాధతో ఇలా అంటున్నాడు: “మబ్బులు ఆకాశంలో దట్టంగా వున్నాయి. అరణ్యసీమలు చీకటి కానుగు చెట్లతో నల్లగా వున్నాయి. కృష్ణయ్య రాత్రుల్లో భయపడతాడు. నీవు తొందరగా కృష్ణుణ్ణి ఇంటికి తీసుకువెళ్ళు” అని రాధకు కృష్ణుణ్ణి అప్పగించాడు. యమునా నదీతీరంలో వెళుతూ పొదరిండ్లలో విహరిస్తూ రాధాకృష్ణులు చేసిన రహస్యక్రీడలు విజయవంతమగు గాక.

## ఇష్టదేవతా ప్రార్థన

**శ్లో ॥ వాగ్దేవతా చరిత చిత్రిత చిత్తసద్మా**
**పద్మావతీ చరణ చారణ చక్రవర్తీ ।**
**శ్రీ వాసుదేవ రతి కేళి కథా సమేత**
**మేతం కరోతి జయదేవ కవిః ప్రబంధమ్ ॥ 2 ॥**

వాగ్దేవతయైన సరస్వతీదేవి విలాసములు తన హృదయములో కలిగి, గీతాలకు తనభార్య పద్మావతితో నాట్యం చేయించే జయదేవుడను నేను, శ్రీకృష్ణుని శృంగారకేళిని వివరించు ప్రబంధాన్ని రచిస్తున్నాను.

## కావ్య వివరణ

**శ్లో ॥ యది హరి స్మరణే సరసం మనో**
**యది విలాస కలాసు కుతూహలం ।**
**మధుర కోమల కాంత పదావళీం**
**శృణు తదా జయదేవ సరస్వతీమ్ ॥ 3 ॥**

హరిని స్మరించుటయందు మీ మనస్సు రసవంతమైతే, స్వామి విలాస కళలయందు మీకు కుతూహలం వుంటే, మధురములు కోమలములు మనోహరములు అయిన పదములు గల ఈ జయదేవ కవి కవితలను వినండి.

## కవి ప్రశంస

**శ్లో ॥ వాచః పల్లవయత్యుమాపతిధరః సందర్భ శుద్ధిం గిరాం**
**జానీతే జయదేవ ఏవ శరణః శ్లాఘ్యో దురూహ ద్రుతేః ।**
**శృంగారోత్తర సత్ప్రమేయ రచనైరాచార్య గోవర్ధన**
**స్పర్ధీ కోఽపి న విశ్రుతః శ్రుతిధరో ధోయీ కవి క్ష్మాపతిః ॥ 4 ॥**

జయదేవుడు లక్ష్మణసేన మహారాజు యొక్క ఆస్థానకవి. ఆ ఆస్థానంలో ఇతర కవీశ్వరుల గురించి, తన గురించి ఇలా చెబుతున్నాడు “ఉమాపతిధరుడు పదములను చిగురింపజేయును. ఆయన మాటలలో సందర్భ శుద్ధి జయదేవ కవియే ఎరుగును. శరణ కవి ఊహించడానికే వీలుగాని శబ్దవేగం విషయంలో శ్లాఘాపాత్రుడు. శృంగారరసమే ప్రధానంగా కల కావ్యరచనలో గోవర్ధనాచార్యుల వారితో పోటీపడగలవారు లేరు. శ్రుతిధరుడను కవి సుప్రసిద్ధుడు. ధోయీకవి సాక్షాత్తు కవిరాజే”.

(సశేషం)

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ వామన పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

ఆయన కాళ్ళకు దివ్యమైన బంగారు అందెలను ధరించాడు. వాటిల్లోని చిన్నగజ్జెలు అందమైన కాంతులను విరజిమ్ముతూ మంగళకరమైన ధ్వనులను చేస్తున్నాయి. వాటిలోని మణులకాంతులు దశదిశలను ప్రకాశింపజేస్తున్నై. ఆయన కాలిగోళ్ళు ఎర్రగా అనేక వేల సూర్యుల వలె ప్రకాశిస్తున్నై. అవి ఉదయిస్తున్న చంద్రునివలె తెల్లగా శోభిస్తూ గుండ్రంగ ఉన్నై. ఆ గోళ్ళ చివరి భాగాలు (కొసలు) ఎఱ్ఱగా విరాజిల్లుతున్నాయి.

ఆయన దివ్యమైన పాదపద్మాలు ఎర్రగా ఎత్తుగా ఉన్నై. వాటిలో అంకుశము, ధ్వజము, చక్రము, పద్మము, శంఖము, వజ్ర చిహ్నాలున్నై. మహారాజా! ఆ పాదాల క్రింది భాగాలు ఆ చిహ్నాలతో శోభిస్తున్నాయి. ఆయన దివ్యపాదపద్మాలు ముత్యాల, వజ్రాలతో సూర్యకాంతితో ప్రకాశిస్తున్నాయి. ఆయన చేతి వ్రేళ్ళకు అనేక వేల, వందల ఉంగరాలు అలంకరింపబడి ఉన్నాయి. అవి వివిధ రత్నాలలతో పొదగబడి ఉన్నాయి.

ఆ దేవదేవుని ముంగురులు ఉంగరములవలె గుండ్రంగాను, నల్లగాను, మిక్కిలి మృదువుగాను, సుందరంగాను ఉన్నాయి. కిరీటం నుండి బయటకు వచ్చి, క్రిందికి వ్రేలాడుతూ శోభిస్తున్నాయి. ఆయన ముఖం మేఘాలతో కప్పబడిన చంద్రునివలె ఉన్నది. ఆయన రత్నజటితమైన బంగారు యజ్ఞోపవీతాన్ని ధరించి ఉన్నాడు. అనేక మణులు చెక్కబడిన దివ్యాభరణాలు ధరించాడు. దివ్యమాలలు ధరించాడు.

ఆయన నేత్రాలు విశాలంగా ఉన్నాయి. అనేక విధాలుగా ఆశ్చర్యం కలిగించే మణిమయాలైన ఆభరణములతో విరాజిల్లుతున్నాడు. తన దివ్య తేజస్సుతో దిక్కులన్నిటిని ప్రకాశింపజేస్తున్నాడు. ఉదయాద్రి నుండి ఉదయిస్తున్న సూర్యునివలె స్వర్ణమయులైన తన దివ్యకాంతులతో వెలిగిపోతున్న ఆ నారాయణుని దివ్యస్వరూపం అత్యద్భుతంగా దర్శనమిచ్చింది. చూడనలవి కాని ఆ దివ్యతేజస్సును మునులు, దేవతలు కూడ దర్శించలేక పోయారు.

ఆ పరాత్పరుని నుండి వెలువడిన దివ్యతేజస్సు దేవతలు, అసురులు, గంధర్వులతో సహా సకల చరాచరజగత్తును తపింపజేస్తున్నది. ఆ దివ్యరూపం బంగారుకాంతులతో, సూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్నది. ఆయన అనేక వందల, వేల బంగారు ఆభరణాలు ధరించి ఉన్నాడు. ఆయన దివ్యహస్తాల్లో తీక్షణమైన ఆయుధాలు తళతళమెరుస్తూ ప్రకాశిస్తున్నాయి.

ఓ మిథిలాధిపా! ఉదయాచలం నుండి వెలువడే సూర్యకిరణాలు జగత్తును ప్రకాశింపజేసేటట్లు ఆ భగవంతుని దివ్యాయుధాల నుండి వెలువడిన దివ్యకాంతులు ధదిశలను ప్రకాశింపజేస్తున్నాయి. జగత్ప్రభువైన ఆ శ్రీహరి కనుబొమలనే



ధనుస్సునుండి చూపులనే బాణాలు వదులుతూ, ప్రసన్నంగా, చూచుటకింపుగా, నిర్మలంగా వెలువడుతున్నాయి. ఆయన కనురెప్పలు ఎర్రని పద్మదళాలవలె తేజోవంతములై, చక్కని కాంతితో, శోభాయమానంగా విరాజిల్లుతున్నాయి.

ఆ దేవాధిదేవుని దృష్టిపాతం వల్ల వేల కొలది రాక్షసులు, దానవులు భయపడి అరుస్తూ యమలోకానికి వెళ్ళారు. మానవులు కూడ దుర్లభములైన దేవత్వాన్ని, ఇతర కోరికలను, ముక్తిని కూడ ఆయన క్రీగంటి చూపుల వలన పొందుతున్నారు. మహారాజా! ఏ క్రీగంటి చూపుల కోసం భక్తులు రాత్రింబవళ్ళు ఎదురుచూస్తూ తపిస్తారో అటువంటి దేవదేవుని కరుణామృత దృక్కులు దివ్యములై వందలు వేలు కాంతులీనుతూ ప్రకాశిస్తున్నాయి.

ఆయన దివ్యహస్తాలు అనేక వేల, వందల భయంకరమైన ఆయుధాలతో వెలుగొందుతున్నాయి. ఆ ఆయుధాలు ప్రళయాగ్ని సదృశములై జాజ్వల్య మానంగా ఉన్నాయి అవి దేవతలకు విరోధులైన మహాబలవంతులైన రాక్షసులను భయపెడుతున్నాయి. అవి సర్వత్రా వ్యాపిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేస్తున్నాయి.

తీక్షణములు, ప్రసన్నములు అయిన ఆ దివ్యకాంతులవల్ల సూర్యచంద్రులు తేజోరహితులుగా కనిపించారు. అనంతుడు, సర్వవ్యాపి, సకల చరాచర జగత్తుకు ప్రభువు అయిన ఆ పరాత్పరుని రూపం మహాశ్చర్యకరంగా ఉంది. అనేక రంగులతో, అనేక కిరీటాలతో, వివిధ మాలలతో ప్రకాశిస్తూ, తన తేజోమాలికలతో వెలుగొందుతూ ప్రళయకాలంలో సూర్యునివలె ఆ దివ్యరూపం శోభిస్తున్నది.

ఆభగవంతునిదివ్యమైనముఖపద్మంనిర్మలంగా,ఆనందంగా, తన తేజస్సుతో ప్రకాశిస్తున్నది. ఆ పరాత్పరుని దివ్యదేహం ప్రళయకాలాగ్ని వలె అత్యద్భుతంగా, మహాశ్చర్యకరంగా విరాజిల్లుతున్నది. సకల సృష్టికి ఆది కారణమైన ఆయన దివ్యస్వరూపం ఈ విధంగా సాక్షాత్కరించింది.

**ఆద్రూపమాశ్చర్యమనేక వర్ణం కిరీటమాలాభిరశేషమూర్తేః ।**
**వ్యరాజాఇతాదిత్య ఇవాన్త కాలే స్వరశ్మిమాలాభిరనేకరశ్మిభిః ॥**
**తద్దీప్త వక్త్రం విమలం విశో కం జాజ్వల్యమానం మహతా స్వతేజసా।**
**అశోభతాద్యం వపురద్భుతీక్షణం యుగాన్తకాలాగ్నిరివ ప్రదీప్తమ్ ॥**

**- వామనపురాణం, అధ్యాయం 34, శ్లోకాలు 49,50.**

## మహర్షులు భగవంతునికి నమస్కరించుట

వామదేవమహర్షి జనక మహారాజుతో 'రాజా! భగవంతుడు ఆ మహర్షులందరికి ఈ విధంగా సాక్షాత్కరించాడు. ఆ దివ్య స్వరూపాన్ని అంతకుముందు దేవతలుగాని, మునులుగాని, సిద్ధులు, చారణులు, యోగులు, గంధర్వులు, విద్యాధరులు, యక్షులు, వాలఖిల్యులు, తపశ్శాలురు. నాగులు, రాక్షసులు, కింపురుషులు మొదలైన వారెవ్వరూ చూచియుండలేదు. ఆ వాసుదేవుని దివ్యస్వరూపం మహాద్భుతంగా మహాశ్చర్యంగా ఉండింది. ఆ విశ్వరూపం అన్నివైపులా ముఖములు కలిగి ఉన్నది. ఆయన కిరీటములు బహువిధములైన రత్నములతో పొదగబడిఉన్నాయి. ఆయన చేతికుండలాలు ఇటు అటు కదలుతూ ఆయన ముఖాలకు శోభను చేకూరుస్తున్నాయి. వారంతా కలవరపాటు చెందుతూ తమ నేత్రాలతో ఆయన దివ్యస్వరూపాన్ని తాగుతున్నవారి వలె రెప్పపాటు లేకుండా ఆనందంతో ఆయన దివ్యస్వరూపాన్ని దర్శించారు.



మహారాజా! వారంతా 'ఓ దేవ దేవా! మేమంతా మిక్కిలి ఆర్తి చెంది ఉన్నాము' అని వెంటనే నిర్మల మనస్సు కలవా రై సంభ్రమంతో ఆయన దివ్యపాదారవిందాలకు సాష్టాంగ నమస్కారం చేశారు. అంతట వారంతా వేలకొలది మహర్షులందరూ ఒకచోట గుమికూడి భక్తిభావంతో వినమ్రులై శిరస్సులు వంచి నేలపై పడి జగత్ప్రభువు వేంకటాచలవాసి అయిన ఆ దేవాదిదేవుని దర్శించి నమస్కరించారు. బృహస్పతి, అగస్త్యమహర్షి, శుక్రాచార్యుడు, వసుమహారాజు, మేరుపర్వత శిఖరంపై నీలమేఘం వలె ఆవిర్భవించిన గరుడారూఢుడైన భగవంతుని దర్శించి ఇటు అటు చూస్తూ మరల మరల ఆయనకు సాష్టాంగ నమస్కారాలు చేస్తూ మరల మరల దర్శిస్తూ 'స్వామీ! ప్రసన్నుడవుకా! మమ్మల్ననుగ్రహించు' అని పలుకుతు, ప్రార్థిస్తూ అనేకసార్లు భక్తితో నమస్కరించారు.

ఇంతలో ఆకాశంలో సంచరించే దేవతాగణాలు వందలు వేల కొలది పాంచజన్యము వంటి స్వర్ణభూషితాలైన శంఖాలను పూరించారు. అనేక విధాల స్వర్ణరత్న ఖచితాలైన మృదంగాది వాద్యాలను మ్రోగించారు. ఆ మహత్తరమైన శంఖనాదంతో మృదంగ ధ్వనులతో జగత్తంతా నిండిపోయింది. దానవులందరూ క్షోభించారు. ఆ నారాయణగిరిలో నివసించే వారంతా సంతోషంతో వెంటనే లేచి గుంపులు గుంపులుగా బయటకు వచ్చారు. ఆ వేంకటాద్రిలో సంచరించే సింహాలు, పక్షులు, మృగాలు అన్నీ ఆ శబ్దాన్ని విని ప్రశాంతిని పొందాయి.

## వేంకటాచలానికి బ్రహ్మరుద్రాదుల రాక

లోక పితామహుడైన బ్రహ్మదేవుడు నిరుపమానమైన ఆ గొప్ప శంఖధ్వనిని విని వాసుదేవుడు శ్రీహరి సాక్షాత్కరించాడని తెలుసుకొని అఘటన ఘటనా సమర్థుడైన ఆ పరాత్పరుని సన్నిధికి విచ్చేశాడు. త్ర్యంబకుడు, త్రిపురాంతకుడు అయిన శంకరుడు కూడా ఆ శబ్దాన్ని విని భగవంతుడు ఆవిర్భవించాడని తెలుసుకొని మునీంద్రులు, దేవతలు, గంధర్వులతో కూడి సూర్యునివలె ప్రకాశిస్తున్న జటామండలంతో శోభిస్తూ దూర్వాసమునీంద్రునితో పాటు నందినధిరోహించి శ్రీహరి సన్నిధికి ఏతెంచాడు.

మహారాజా! దేవతాశ్రేష్ఠుడైన దేవేంద్రుడు అద్భుతమైన ఆ శబ్దాన్ని విని జనార్దనుడైన శ్రీహరి ప్రత్యక్షమైనాడని తెలుసుకొని సనాతనుడైన ఆయన సన్నిధికి దేవతలతో పాటు విచ్చేశాడు. మహాప్రతాపవంతుడైన విష్వక్సేనుడు ఆ శంఖ ధ్వనిని విని నిరామయుడైన నారాయణుడు భూమిపై ఆవిర్భవించాడని తెలుసుకొని వెంటనే లేచి మహాపరాక్రమవంతులు. ఆదరం కలవారు, నిర్మలచిత్తులు అయిన ఏడుగురు మంత్రులతో పాటు ఆ భగవంతుని సన్నిధికి వచ్చి చేరాడు.

ఓ మిథిలాధిపా! సనకసనందనాది మహాయోగులు ఆ శబ్దాన్ని విని వాసుదేవుని సన్నిధికి విచ్చేశారు. నేను పూర్వం చెప్పిన సప్తర్షులు కూడా ఆ శబ్దాన్ని విని భగవంతుని సన్నిధికి ఏతెంచారు. అంతకు ముందు ఆ మహర్షులు ఆ పర్వతం వాయవ్యదిక్కులో శిలాతలంపై కూర్చుని ఆశ్చర్యకరమైన రూపంతో అద్భుతంగా దర్శనమిచ్చిన మహాపురుషుడు కూడా ఆ శంఖ ధ్వనిని విని భగవంతుని సన్నిధికి వచ్చాడు.

మహారాజా! ఈ విధంగా ప్రజాపతైన బ్రహ్మదేవుడు, పరమశివుడు, విష్వక్సేనుడు, దేవలోకాధిపతియైన దేవేంద్రుడు, సప్తమహర్షులు, మునులు సనకసనందనాది యోగులు, వాయువ్య దిక్కులో మునులకు కనబడిన మహాపురుషుడు, వీరంతా కలిసి ఆ పరాత్పరుని సన్నిధికి విచ్చేసి పరమానందంతో మిక్కిలి భక్తియుక్తులై మహాబలవంతుడైన గరుత్మంతునిపై అధిరోహించి బంగారు (మేరు) పర్వత శిఖరంపై ఉన్న నీలమేఘము వలె విరాజిల్లుతున్న విశ్వేశ్వరుడు, విశ్వరూపుడైన ఆ దేవదేవుని దర్శించి శిరస్సులు వంచి ఆయనకు నమస్కరించారు.

ఆ దేవతా గణాలన్నీ ఆ పుండరీకాక్షునికి సాష్టాంగ నమస్కారము చేసి 'ఓ దేవదేవా! నీకు జయమగు గాక!'

అని పలికారు. వారంతా 'ఓ దేవదేవా! నీవు మాయందు ప్రసన్నుడవుకా, మమ్మల్ని అనుగ్రహించు' అని మరల మరల ప్రార్థించారు.

బ్రహ్మాది దేవతలు తపోధనులైన మునీశ్వరులు అలాగే శ్వేతద్వీపవాసులైన సిద్ధులు, ప్రళయకాల మార్తాండుని వలె ప్రజ్వరిల్లుతున్న శ్రీమన్నారాయణుని తమ చర్మచక్షువులతో దర్శించలేక పోయారు. ఆ తేజస్సు యొక్క వేడికి తీక్షణతకు తట్టుకోలేక వారంతా కళ్ళు మూసుకున్నారు.

## బ్రహ్మ చేసిన భగవత్స్తుతి

దేవదేవుడైన శ్రీమహావిష్ణువు యొక్క తేజస్సుచే బాధితుడైన బ్రహ్మదేవుడు సర్వదేవతలకు ప్రభువు నాశరహితుడు, గరుడారూఢుడు అయిన నారాయణుని తన నాలుగు శిరస్సులతో నమస్కరించి ఈ విధంగా స్తుతించాడు.

**నమామి త్వాం జగన్నాథ! సహస్రవదవేక్షణ ।**
**జ్వలత్కిరీట సాహస్రధారణం పురుషోత్తమమ్ ॥**

**- వామనపురాణం, అ.35, శ్లో.38.**

వేయి ముఖములు, నేత్రములు కల ఓ జగన్నాథా! ప్రకాశిస్తున్న వేయి కిరీటములను ధరించిన పురుషోత్తముడవైన నీకు నమస్కరిస్తున్నాను. జగత్ప్రభువవు, విశ్వరూపుడవు, బహుసుందరములై, దివ్యములైన పరిఘాయుధములవలె నున్న అనేక బాహువులతో కూడిన ఆదిపురుషుడవైన నీకు నమస్కారము.

అణువులలోకెల్ల అణువువంటి వాడవు, సకల ప్రాణికోటిలో గొప్ప వారందరి కంటె గొప్పవాడవు, సనాతనుడవు, నారాయణుడవు, భక్తాభీష్ట వరప్రదుడవు, పరమేశ్వరుడవు అయిన నీకు నమస్కారము. యోగులకు మాత్రమే పొందదగిన వాడవు, జనలోకవాసివి, సర్వవ్యాపివి, పరాత్పరుడవు, పురాణపురుషుడవు, దేవాదిదేవుడవు అయిన నీకు నమస్కారము.

ఓ మహావిష్ణూ! మీరు నాకు ప్రసన్నులు కండి. నీవు ప్రాకృతములైన సత్త్వరజస్తమోగుణాలు లేని వాడవు. నిర్మలుడవు. పరమ పురుషుడవు. సకల ప్రాణులను సృష్టించినవాడవు. ఓ జగత్ప్రభూ! ఈ సకల చరాచర జగత్తుకు నీవు సాక్షీభూతుడవు. చలించుచున్న విశాల నేత్రములు కల శాశ్వతుడవైన నీకు నేను నమస్కరిస్తున్నాను. ఓ సర్వేశ్వరా! పరమ పవిత్రుడ వైన నీకు నమస్కారము. కేశవా! సర్వభూతాంతరాత్మా, సర్వకారణములకు మూలకారణుడవు. సకలలోక ప్రభువవు, నాశరహితుడవు అయిన నీకు నమస్కరిస్తున్నాను.

బ్రహ్మజ్ఞానివి, వేదవేద్యుడవు, యోగులను, ప్రజలను పాలించేవాడవు అయిన నీకు నమస్కారము. మునులు గాని, దేవదానవులు గాని, నేను కాని పరమశివుడు కాని, పరమపదమైన నీ విష్ణుపదాన్ని ఎరుగము. వందల కొలది దేవేంద్రులు, ముల్లోకాధిపతులు, రూపరహితుడవైన నీ దివ్య స్వరూపాన్ని దర్శింపగోరి కూడా నిన్ను తెలుసుకోలేరు. అటువంటి విమలమైన, శాశ్వతమైన, అవ్యయమైన నీ దివ్యపదాన్ని నేను స్తుతించలేను. ఓ దేవదేవా! సర్వేశ్వరా! అచ్యుతా! లోకనాథా! అనంతమైన నీ దివ్యగుణాలను నేను వర్ణించలేను. కావున ఓ వేదరక్షకా! మమ్మల్నందరినీ నిర్మలములైన, ప్రసన్నములైన నీ కరుణాకటాక్ష వీక్షణాలతో అనుగ్రహించు.

## శంకరుడు చేసిన భగవత్స్తుతి

బ్రహ్మదేవుడు భగవంతుని ఈ విధంగా స్తుతించగా అవ్యక్తరూపుడు, అచ్యుతుడు, పురుషోత్తముడు అయిన భగవంతుని శంకరుడు ఈ విధంగా స్తుతించాడు -

గొప్పవారికి కూడా ప్రభువవు, పరమపురుషుడవు, దుష్టులైన రాక్షసులను సంహరించినవాడవు, జగత్తును పరిపాలించేవాడవు, జగత్సృష్టికారకుడవు, ప్రజాపతులందరినీ కూడా సృష్టించినవాడవు, నిర్మలమైన చూపులు కలవాడవు, భక్తుల ఆర్తిని పోగొట్టేవాడవు, భక్తులకు అభీష్టములను ప్రసాదించేవాడవు, పరబ్రహ్మస్వరూపుడవు, దివ్యమూర్తివి అయిన ఓ శ్రీహరీ! నీకు నమస్కరిస్తున్నాను. జగత్తు సృష్టికి కారణములైన ప్రధాన పురుషులకు, జన్మలేనివి, నిత్యమైనవి, సర్వవ్యాపకమైన ప్రకృతి పురుషులకు పరమ కారణమైనవాడవు, జగత్ప్రభువైన నీకు నమస్కరిస్తున్నాను.

సర్వప్రాణులకు ప్రభువు, సర్వజీవులకు కారణమైన వాడవైన నీకు నమస్కారము. నిత్యసూరులు ఏ శాశ్వతమైన పరమోత్కృష్ట స్థానాన్ని దర్శిస్తున్నారో ఆ పరంధామము సనాతనమైన పరబ్రహ్మము నీవే. వేయి సూర్యుల కాంతితో ప్రకాశిస్తున్న గోవిందుడివైన నీకు నమస్కరిస్తున్నాను. ఓ దేవదేవా! మహర్షులు అనేక వందల సంవత్సరాలు నిన్నారాధించిన నీ అనుగ్రహం వలన నీయందే లయమౌతున్నారు.

ఓ పురుషోత్తమా! దేవేంద్రుడు కూడా నూరు అశ్వమేధయాగాలతో నిన్ను పూజించి ఇంద్ర పదవిని పొందాడు. బ్రహ్మదేవుడు వేల అశ్వమేధయాగాలు చేసి దివ్యము, దుఃఖశోకరహితము అయిన బ్రహ్మపదవిని పొందాడు. ఓ దేవాదిదేవా! నేను సర్వమేధయాగము చేత నిన్నారాధించి దేవతలందు కూడా దుర్లభమైన దేవాధిపత్యాన్ని పొందాను.

ఓ జగత్ప్రభూ! ఈ జగత్కర్తవు నీవే. దీన్ని ధరించేవాడవు నీవే. పాలించేవాడవు నీవే. ఈ జగత్తుకు నీవే దిక్కు. నీవే ఆధారం. దీన్ని సృజించునది, లయం చేసేది కూడా నీవే. శోకాన్ని, బాధను, మోహాన్ని, ప్రమాదాన్ని పోగొట్టే నీకు నమస్కారము.

ఓ మహామాయా స్వరూపా! సహస్రవదనా! సహస్రనేత్రా! సకల లోకనాతా! సర్వలోకేశ్వరా! సర్వలోక సంరక్షకా! ప్రభూ! ప్రసన్నుడవుకా! ఓ విష్ణుమూర్తీ! చీకటి వృక్షముల వలె



నల్లని వర్ణము కలిగి అనేక బాహువులనే శాఖలతో కూడ ఉండి అనేక ముఖ ములు, నేత్రములు కలిగి, నానావిధ రత్నములచే కూడి జాజ్వల్యమానంగా వెలుగొందుచున్న కిరీటములతో ప్రకాశిస్తున్న నీ దివ్యస్వరూపానికి నమస్కరిస్తున్నాను.

**త్వమేవేశ! జదద్ధాతా త్వమేవ జగతో గతిః ।**
**స్రష్టా త్వమేవ జగతః సంహర్తా చ త్వమేవ హి ॥**
**తం త్వాం నమామి శోకార్తి మోహహాని ప్రదాయినమ్ ।**
**ప్రసీదేశ! మహామాయ! సహస్రవదనేక్షణ ॥**
**సర్వలోకపతే! నాథ! సర్వలోక పరాయణ! ॥**

- వామనపురాణం, అ.35, శ్లో.60-62.

## మహర్షు లు చేసిన భగవత్స్తుతి

మహారాజా! పరమశివుడు జగన్నాథుని ఈ విధంగా స్తుతించిన తరువాత నిర్మలచిత్తులైన మహర్షులు ఆయనకు నమస్కరించి ఈ విధంగా స్తోత్రం చేయసాగారు.

**నమః కృష్ణాయ హరయే పరస్మై బ్రహ్మరూపిణే ।**
**నమో భగవతే తస్మై విష్ణవే పరమాత్మనే ॥**
**సర్వభూత శరణ్యాయ సర్వజ్ఞాయ నమో నమః ।**
**వాసుదేవాయ భక్తానాం సర్వకామ ప్రదాయినే ॥**
**నమః పంచనేత్రాయ జగద్ధాత్రేచ్యుతాయ చ ।**
**హృషీకేశాయ సర్వాయ నమః కమలమాలినే ॥**

**- వామనపురాణం, అ.35, శ్లో.65-67.**

శ్రీకృష్ణ పరబ్రహ్మ, శ్రీహరి, సర్వవ్యాపియైన పరమాత్మ, భగవంతుడవైన నీకు నమస్కారం. సర్వజ్ఞుడవు, సర్వజీవులను రక్షించేవాడవు, భక్తుల సకల కోరికలను తీర్చేవాడవు, వాసుదేవుడవు అయిన నీకు నమస్కారము. పద్మముల వంటి నేత్రములు కలవాడవు, జగత్తు కాధారమైన వాడవు, అచ్యుతుడవు, హృషీకేశుడవు (ఇంద్రియాలను నియమించే వాడవు) సర్వవ్యాపివి, సకల విశ్వరూపుడవు, పద్మమాలను ధరించిన నీకు నమస్కారము.

వేయి పడగలతో శోభిస్తున్న నిర్మలమై దివ్యంగా ప్రకాశిస్తున్న వేయి సూర్యకాంతులతో వెలుగొందుతున్న, శేషపాన్పుపై యోగనిద్రను పొందియున్న, భగవంతుడవైన నీకు నమస్కారము. నిత్యసూరులు కాని, యోగులు కాని, ఏ నీ దివ్యరూపాన్ని చూడలేరో, క్షీరసాగరంలో శయనించే జగత్ప్రభువైన నీకు శిరసు వంచి నమస్కరిస్తున్నాను.

లోకనాథుడవు, సర్వలోక శరణ్యుడవు అయిన నిన్ను మేము ఆర్తితో శరణు వేడుతున్నాము. అనంతా! అవ్యయా! నాశ రహితా! శరణు వేడిన వారి బాధలను పోగొట్టే ప్రభూ! మమ్ములను కాపాడు. గోవిందా! వేయి సూర్యుల కాంతితో దేదీప్యమానంగా మహాతేజస్సుతో వెలుగొందుతున్న నీ దివ్యస్వరూపాన్ని మేము చూడలేకున్నాము.

మందస్మిత వదనారవిందా! కరుణారస సంప్లావితనేత్రా! మాయందు ప్రసన్నుడవు కమ్ము! మమ్ములను అనుగ్రహించు. కేశవా! మా అందరికీ నీవే దిక్కు. దేవాధిదేవుడవు, సర్వేశ్వరేశ్వరుడవు, పరమ పురుషుడవు, పురాణ పురుషుడవు, అప్రమేయుడవు ప్రళయకాలాగ్ని వంటి ప్రతాపం కలవాడవు. ప్రజ్వలిస్తున్న ముఖములు, నేత్రములు కల నీ దివ్యస్వరూపానికి శిరస్సులు వంచి నమస్కరిస్తున్నాము.

**నతాః స్మ దివ్యం పురుషం పురాణం త్వామేవ సర్వేశ్వరమీశ్వరాణామ్ ।**
**యుగాన్తకాలాగ్ని సమ ప్రతాపం ప్రదీప్త వక్త్రేక్షణమప్రమేయమ్ ॥**

- వామనపురాణం, అ.35, శ్లో.73

## సప్తర్షు లు భగవంతుని స్తుతించుట

రాజా! మహర్షులు భగవంతుని ఇలా స్తుతించిన అనంతరం మహాతేజ స్సంపన్నులైన, మహాత్ములైన

సప్తర్షులు మహాబుద్ధిమంతుడు, వాక్పతియైన బృహస్పతి, భ క్తశిఖామణియైన వసుమహారాజు, మహాపరాక్రమశాలియైన దేవేంద్రుడు ఆ దేవదేవునికి శిరస్సులు వంచి నమస్కరించి ఆయనను ఈ విధంగా స్తుతించసాగారు –

ఓ విశ్వవ్యాపీ! విశ్వరూపా! సర్వాంతర్యామీ! నీవే పరబ్రహ్మవు. నీవే పినాకపాణియైన పరమ శివుడవు. నీవే చంద్రుడవు, ఇంద్రుడవు. సూర్యుడవు. అశ్వినీ దేవతలు, మరుత్తులు కూడా నీవే. ఓ జగత్పతీ! నీవే అందరికీ అంతర్యామిగా ఉన్నావు. సృష్టి, స్థితి, లయకారుడవూ నీవే! వేయి సూర్యుల కాంతితో ప్రకాశించే సుదర్శన చక్రాన్ని హస్తంలో ధరించిన నీకు నమస్కారం.

సర్వదా శంఖాన్ని చేతిలో ధరించే ఓ మహాత్మా! విష్ణుమూర్తీ! నీకు నమస్కారము. ఎల్లప్పుడు కిరీటాన్ని కౌస్తుభమణిని, ధరించేవాడవు. నీలమేఘ శ్యాముడవు, పరబ్రహ్మము అయిన నీకు నమస్కారం. ఖడ్గాన్ని, గదను, చాపాన్ని, శక్తిని, తోమరాన్ని (చిల్లకోల) హస్తములతో ధరించినవాడవు. ప్రజ్వలిస్తున్న ఆయుధములను ధరించి జాజ్వల్యమానమైన శరీరంతో వెలుగొందుతున్న నీకు నమస్కారము.

యజ్ఞస్వరూపుడవు, యజ్ఞఫలభోక్తవు, యజ్ఞేశ్వరుడవైన నీకు నమస్కారము. ప్రకాశిస్తున్న కుండలాలను ధరించిన వాడవు. పద్మనాభుడవు, విశ్వకారణుడవు అయిన నీకు నమస్కారము.

శ్రేష్ఠములై, కనిష్ఠములైన వారందరికీ అధిపతివి, భయంకరమైన రూపము కలవాడవు, కాలనేమి – హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు మొదలైన వారిని సంహరించిన వాడవు, భయంకరమైన ఉగ్రరూపం కల నారసింహుడవు, పుట్టుక లేనివాడవు. వరప్రసాదుడవు, సర్వవ్యాపివి, శారఙ్గపాణివి అయిన నీకు మరల మరల నమస్కరిస్తున్నాము.

సర్వాయుధాలతో కూడిన దోషరహితమైన నీ విశ్వరూపానికి శిరసు వంచి నమస్కరిస్తున్నాము. పరమపురుషుడవైన నీ పుట్టుకను మేము ఎరుగము. అనాది, పరమోత్కృష్టమైన నీ దివ్యరూపాన్ని నీ నాభి కమలము నుండి పుట్టిన బ్రహ్మదేవుడు కూడా ఎరుగజాలడు. ఇక మేమెంతటి వారము.

**ఉగ్రరూపాయ తే నిత్యం నృసింహాయాప్యనాదయే ।**
**నమోస్తు పరద్మనాభాయ నమోస్తు వరదాయ చ ॥**
**భూయో భూయో నమో నిత్యం వ్యాపినే శారఙ్గపాణయే ॥**

- వామనపురాణం, అ.35, శ్లో.82.

సనకాది పరమ యోగులు చేసిన భగవంతుని స్తుతి

జనక మహారాజా! సప్త మహర్షులు స్తుతించిన తదుపరి సనకసనందాది యోగి పుంగవులు గరుడా రూఢుడైన ఆ దేవదేవునికి నమస్కరించి, ఆ పరాత్పరుని ఈ విధంగా స్తుతించసాగారు –

**జయ యజ్ఞపతే! దేవ! జయనాథ! జయాక్షర! ।**
**జయ శంఖధరాచింత్య! జయ చక్రధరావ్యయ! ॥**

- వామనపురాణం, అధ్యాయం 35, శ్లోకం 84.

ఓ యజ్ఞేశ్వరా! దేవదేవా! జగన్నాథా! నాశరహితా! నీకు జయమగుగాక! నీవు అనంతుడవు. నీ శక్తి అనంతం. నీవు సర్వవ్యాపివి. ప్రభూ! పరమాత్మా! విశాలమైన నేత్రములుగల ఓ అచ్యుతా! నీకు జయమగుగాక! సకలాభీష్ట ప్రదాతా! సర్వేశ్వరా! స్వజీవహృదయవాసీ! పద్మనాభా! పరమపురుషా! ఎవరిచేతను జయింపవీలుకాని జయశీలా! భక్తులకు గౌరవాన్ని ప్రసాదించే నీవు సర్వోత్కృష్టుడవై విరాజిల్లుదువుగాక!

సకల జగత్తును మోహింపజేసే నీ మాయచేత దేవతలు కూడా వ్యామోహం పొందుతున్నారు. అనేక రత్నములు పొదిగిన బంగారు కిరీటములు గల వాడవు. ఎవరికి తెలియని రూపం కలవాడవు, యోగీంద్రులచే ధ్యానింపబడువాడవు, మిక్కిలి విశుద్ధుడవు, సర్వజ్ఞుడవు, ఆదిబ్రహ్మవు అయిన నీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

పరబ్రహ్మ స్వరూపుడవు, వరములనిచ్చువాడవు, వేదములచేత కూడ తెలియబడనివాడవు, అప్రమేయుడవు, లక్ష్మీదేవిని వక్షస్థలంలో ధరించిన వాడవు, మంచి వర్చస్సు గల నీకు నమస్కారం. లక్ష్మీపతివి, జితేంద్రియుడవు, భక్తులకు ముక్తినిచ్చేవాడవు, ఇంద్రుడు మొదలైన లోకపాలురను పరిపాలించే నీకు నమస్కారం. ప్రతినిత్యం పీతాంబరమును ధరించే పురుషోత్తమా! నీకు వందనం.

ప్రభూ! జగన్నాథా! విశ్వరూపుడవు, సకల లోకవాసివి అయిన నీ చేత తమస్సనే మూలప్రకృతి వ్యాపింపజేయబడింది. జగత్ప్రభువు, జగన్నియామకుడవు, పద్మములవంటి కాంతి గలిగి చలించుచున్న నేత్రములు గల నీకు మేమందరం ఇప్పుడు నమస్కరిస్తున్నాము.

శ్రీహరీ! ఈ జగత్తులో నీవు లేని వస్తువేదీ లేదు. నీకంటె భిన్నమైనదేదీ లేదు. సకల లోకాలలోను ఒకప్పుడు కూడ ఉండబోదు. నిర్మలమైన, స్వచ్ఛమైన సూర్యుని వంటి కాంతిగలవాడవు, కిరీటములతోను, హారములతోను ప్రకాశిస్తున్నవాడవు, శుభప్రదమైన ఊరువులు (తొడలు) గల నీకు మేమంతా నమస్కరిస్తున్నాము.

ఈ నీ దివ్యస్వరూపం పుట్టుక, ముసలితనము మొదలగు దోషములు లేనిది. నిర్మలమైనది, దుఃఖరహితమైనది, దుఃఖాన్ని పోగొట్టేది. ఇటువంటి అద్భుత రూపాన్ని ఇంతకుముందు మానవులు, దేవతలు మొదలగువారు చూడలేదు. మెరపు తీగెల వలె జాజ్జ్వల్యమానంగా ప్రకాశిస్తున్న నీకు మేము శిరస్సులు వంచి నమస్కరిస్తున్నాము.

**ఏతత్పరం రూపమపేత జన్మజరాది దోషం విమలం విశోకమ్ ।**
**అదృష్ట పూర్వం మనుజామరాద్యైః నతాః స్మ విద్యుజ్జ్వలితోరు శోభమ్ ॥**

- వామనపురాణం, అధ్యాయం 35, శ్లోకం 94.

(సశేషం)

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## సాలకట్ల తెప్పోత్సవం

వేసవి కాలంలో తాపం తీర్చుకోవడానికి మనం చల్లని ప్రదేశాలను, ఈత కొలనులను సందర్శించినట్లే; ఆ వేంకటేశుడు కూడా సతుల సమేతంగా నౌకా విహారానికి వెళతాడు.

వేసవి ప్రారంభంలోని (ఫిబ్రవరి-మార్చి) పున్నమిరోజుల వెన్నెల కాంతుల్లో, స్వామి పుష్కరిణి యందలి చల్లటి నీళ్ళలో జరిగే ఈ ఉత్సవాల్ని ''సాలకట్ల తెప్పోత్సవాలు''గా వ్యవహరిస్తారు. ఏటా ఫాల్గుణమాస శుక్లపక్ష ఏకాదశి నాడు ప్రారంభమై, ఐదు రోజుల పాటు రాత్రి 7 నుండి 8 గంటల మధ్య జరిగే ఆర్జితసేవలో పాల్గొనటం కోసం వ్యక్తికి 500 రూపాయల చొప్పున చెల్లించాలి.

తిరుమలలో అతి ప్రాచీన కాలం నుండి జరుగుతున్న తెప్పోత్సవాల్ని మరింత ఘనంగా నిర్వహించటానికి, 1468వ సంవత్సరంలో పుష్కరిణి మధ్యభాగము నందు ''నీరాళి మంటపాన్ని'' సాళువ నరసింహరాయలు నిర్మించాడు.

సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన పుష్కరిణిలో, విద్యుద్దీపాలంకార శోభితమైన తెప్పయందు స్వామివారు విహరించే ఈ తెప్పోత్సవం ఇలా సాగుతుంది.

**మొదటి రోజు** – సీతాలక్ష్మణ ఆంజనేయ స్వామి సమేతంగా శ్రీరామచంద్రమూర్తి పుష్కరిణిలో మూడుసార్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తాడు.

**రెండవ రోజు** – రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణుడు మూడు సార్లు విహరిస్తాడు.



**మూడవ రోజు** – ఉభయ నాంచార సమేతులైన మలయప్ప స్వామివారు పుష్కరిణిని మూడుసార్లు చుట్టి వస్తారు.

**నాల్గవ రోజు** – మలయప్ప స్వామివారు మరలా ఐదు సార్లు విహరిస్తారు.

**ఐదవ రోజు** – చివరిసారిగా మలయప్ప స్వామివారు ఏడు మార్లు నౌకావిహారం చేస్తారు.

తాళ్ళపాక అన్నమయ్య ఈ తెప్పోత్సవ శోభను హిందోళ రాగంలో ఇలా కీర్తించాడు.

**"దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ**
**వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా!!"**
**"తెప్పగా మర్రాకు మీద తేలెడువాడు**
**ఎప్పుడు లోకములెల్ల నేలేటి వాడు!!"**

## ప్రణయ కలహోత్సవం

శికారుకెళ్ళొచ్చిన శ్రీవారిపై సతీమణి అలకబూనటం, శ్రీవారు సంజాయిషీలిచ్చుకుని సతీమణిని బుజ్జగించటం, ఇవన్నీ ఈనాడు మొదలైన ముచ్చట్లు కావు. శ్రీనివాసుడే ఈ సాంప్రదాయానికి శ్రీకారం చుట్టి ఉంటాడు. అదెలా అంటే ఏటా వైకుంఠ ఏకాదశి ఆరో రోజు, అంటే అధ్యయనోత్సవాల్లో 17వ రోజున (అధ్యయనోత్సవాల గురించి తరువాత తెలుసుకుందాం) రెండవ ఘంట నివేదన తరువాత, మలయప్ప స్వామివారు పల్లకీ ఎక్కి ఒంటరిగా మహా ప్రదక్షిణ మార్గంలోని స్వామి పుష్కరిణి వద్దకు వేంచేస్తారు. ఇంతలో ఇద్దరు అమ్మవార్లు చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా వచ్చి స్వామివారికి ఎదురుగా నిల్చుంటారు.

పురాణ పఠనం జరుగుచుండగా అలక పూనిన అమ్మవార్ల తరఫున జియ్యంగార్లు, వేటకు వెళ్ళి వచ్చిన స్వామివారిని మూడు మార్లు పూలచెండ్లతో తాడించుతారు. స్వామివారు బెదిరినట్లు నటించి, తానేమీ తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు. జియ్యర్ స్వాములు నమ్మాళ్వార్ విరచిత నిందాస్తుతి పాశురాలను గానం చేస్తుండగా అమ్మవార్లు శాంతించి, స్వామికి ఇరు పార్శ్వాలా చేరి కర్పూర నీరాజనాలందుకుంటారు. అనుభవజ్ఞులైన అయ్యంగార్లు, అర్చకస్వాములు రసవత్తరంగా, హావభావ ప్రదర్శన చేస్తూ ప్రణయ ఘట్టాన్ని రక్తి కట్టించే ఈ ఉత్సవం ఆర్జితసేవ కాదు.



ఏడాదికోమారు శ్రీవారి బంగారు కవచాన్ని మార్చే అభిషేకం; దేశ విదేశాల నుండి తెప్పించిన, టన్నుల కొద్దీ రంగు రంగుల పరిమళభరిత పుష్పాలతో శ్రీవారికి చేసే యాగం; సుమారు ఐదువేల ఏళ్ళక్రితం తిరుమలకు 30 కి.మీ దూరంలో శ్రీవారికి పద్మావతీ అమ్మవారితో జరిగిన వివాహాన్ని స్ఫురణకు తెచ్చే ఉత్సవం – ఇవన్నీ పఠనాసక్తితో బాటుగా అలౌకికమైన ఆధ్యాత్మికానుభూతులు కలిగించేవే.

## జ్యేష్ఠాభిషేకం

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో, జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేటట్లుగా, మూడు రోజుల పాటు సంపంగి ప్రదక్షిణం నందున్న కళ్యాణోత్సవ మంటపంలో శ్రీవారికి జరిగే అభిషేకాన్ని జ్యేష్ఠాభిషేకం లేదా అభిధేయక అభిషేకంగా వర్ణిస్తారు. అభిధేయకం అంటే ''నశింప శక్యం కాని రక్షణ కవచం''.



శ్రీదేవి-భూదేవి సమేత మలయప్పస్వామి విగ్రహాలు 800 సంవత్సరాలకు పైగా పురాతనమైనవి. ఇవి ఇత్తడి, బంగారం, రాగి, వెండి, సీసంల మిశ్రమమైన పంచలోహంతో తయారు చేయబడ్డాయి. నిరంతరం అభిషేకాలు అందుకునే ఈ మూర్తులు అరిగిపోకుండా భద్రపరచడం కోసం ఎల్లవేళలా అవి బంగారు కవచంతో కప్పబడి ఉంటాయి. ఏడాదికోమారు ఈ బంగారు కవచాన్ని జాగ్రత్తగా తొలగించి, అభిషేకాదులు నిర్వహించి, అత్యంత భక్తి శ్రద్ధలతో కవచాన్ని తిరిగి ధరింప చేయటమే ఈ ''అభిధేయక అభిషేకం''. అలంకార కవచం లేకుండా మలయప్ప స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునే భాగ్యం, ఈ అభిషేకం సందర్భంగా మాత్రమే కలుగుతుంది.

- **మొదటిరోజు** శ్రీ మలయప్పస్వామికి ఉన్న బంగారు కవచాన్ని తొలగించి హోమ, అభిషేక, పంచామృత, స్నపన, తిరుమంజనాదులు జరిపిన తరువాత శ్రీవారికి వజ్రకవచాలంకరణ చేసి పురవీధుల్లో ఊరేగిస్తారు.
- **రెండవరోజు** ముత్యాల కవచాన్ని ధరింపచేసి ఊరేగిస్తారు.
- **మూడవరోజు** తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచ ధారణ చేసి మాడ వీధుల్లో ఊరేగిస్తారు. ఈ కవచాన్ని ఏడాది తర్వాత జ్యేష్ఠాభిషేక సందర్భంగానే మరలా తీస్తారు.

ఈ ఆర్జితసేవలో పాల్గొన్న భక్తులను స్వామివారు అభేద్యమైన కవచంలా కాపాడుతారని భక్తుల విశ్వాసం. అంటే అరిషడ్వర్గాలనే శత్రువులు మనపై దాడి చేయకుండా ''ఆత్మ నిగ్రహమ''నే కవచాన్ని మనకు ప్రసాదిస్తారు. ఈ ఆర్జిత సేవా రుసుము ప్రతి ఒక్కరికీ 400 రూపాయలు.

## పద్మావతీ పరిణయోత్సవాలు

సుమారు ఐదు వేల ఏళ్ళ క్రితం, కలియుగారంభంలో శ్రీమహావిష్ణువు వైకుంఠం నుండి వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చి వేంకటాచలంలో కొలువై ఉన్నాడు. ఆ సమయంలో ''నారాయణవనం'' రాజ్యాన్ని పరిపాలించే ఆకాశరాజు తన కుమార్తె అయిన పద్మావతీ దేవిని వైశాఖ శుద్ధ దశమి, శుక్రవారం, పూర్వ ఫల్గుణీ నక్షత్ర లగ్నంలో, శ్రీనివాసునికిచ్చి కన్యాదానం చేశాడు. తిరుపతి పట్టణానికి 30 కి.మీ దూరాన ఉన్న ''నారాయణవనం'' అనే గ్రామంలో కళ్యాణ వేంకటేశ్వరుడి ఆలయాన్ని, అందులో పద్మావతీ పరిణయ సందర్భంలో పసుపుకొమ్ములు విసరటానికి ఉపయోగించిన పెద్ద తిరగలినీ ఈనాడు మనం చూడవచ్చు. పట్టుచీరలకు ప్రసిద్ధి గాంచిన ఈ గ్రామాన్ని, అందున్న కళ్యాణ వేంకటేశ్వరుని మరియు సొరకాయలస్వామి ఆలయాలను, వాటితో పాటు మరెన్నో దేవాలయాలనూ ఈసారి తప్పక దర్శించండి.

వేంకటేశుడు-పద్మావతిల కళ్యాణానికి విచ్చేసిన ముక్కోటి దేవతలకు ఆకాశరాజు విలాసవంతమైన భవనాల్లో విడిది ఏర్పాటు చేశాడు. కొండలు-కోనల్లో ఉండటానికి ఇష్టపడే శివుని కోర్కెపై, శివపార్వతులకు మాత్రం సమీపంలోని, ఓ పర్వతగుహలో విడిది ఏర్పాటు చేశాడు. ప్రకృతి ఒడిలో పరవశిస్తూ ''కైలాసకోన''గా పిలువబడే ఆ గుహను, అందులో ప్రతిష్ఠితమైన శివ పరివారాన్ని, కొండల మీంచి జాలువారే తీర్థాన్ని నారాయణవనానికి కొద్ది దూరంలో నేడూ చూసి తరించవచ్చు.

శ్రీవేంకటేశ్వరుడి కళ్యాణం గురించి మరోసారి వివరంగా తెలుసుకుందాం.

ఆనాటి కళ్యాణ వైభవానికి గుర్తుగా ప్రతి వైశాఖ శుద్ధ దశమికీ, మూడు రోజుల పాటు ఈ కళ్యాణోత్సవాలు జరుగుతాయి. ''నారాయణ వనానికి'' ప్రతీకగా, తిరుమలలోని ''నారాయణగిరి ఉద్యానవనం''లో ఈ వేడుకలు జరుపబడుతాయి. 1992వ సంవత్సరంలో ఈ ఆర్జితసేవా ఉత్సవాల్ని ప్రారంభించారు.



ముందు రోజు అంటే వైశాఖ శుద్ధ నవమి రోజు సాయంత్రం మలయప్ప స్వామివారు, ఉభయనాంచారులు ప్రత్యేకమైన పల్లకీలలో కళ్యాణోత్సవ మంటపానికి వేంచేస్తారు.

రెండవ, మూడవ రోజులైన దశమి, ఏకాదశి నాడు వరుసగా, అశ్వవాహనం మరియు గజవాహనంపై కళ్యాణ మంటపానికి సర్వ లాంఛనాలతో చేరుకుంటారు. మూడు రోజులూ కళ్యాణ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహింపబడతాయి.

అన్నమయ్య తన ''శ్రీరాగ'' కీర్తనలో పెండ్లి ముచ్చట్లను, పెండ్లికూతురి సిగ్గును, నగలను, తలంబ్రాల వేడుకను ముగ్ధమనోహరంగా వర్ణించాడు.

**"పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు కొంత**
**పెడమరలి నవ్వీనె పెండ్లికూతురు**
**పేరు కల జవరాలె పెండ్లికూతురు పెద్ద**
**పేరుల ముత్యాల మెడ పెండ్లికూతురు**
**పేరంటాండ్ల నడుమ పెండ్లికూతురు విభు**
**పేరుకుచ్చ సిగ్గుపడీ పెండ్లికూతురు!!"**

ఈ కళ్యాణోత్సవ వేడుకలు దర్శించిన భక్తుల గృహాల్లో శుభకార్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఈ ఆర్జితసేవలో పాల్గొనటానికి ప్రతి వ్యక్తికీ 1000 రూపాయలు చెల్లించాలి.

## పుష్పయాగం

''పుష్పమండపం''గా పేరొందిన తిరుమల, పరిమళాలు వెదజల్లే రంగు రంగుల పుష్పాలకు పెట్టింది పేరు. తిరుమల నాడూ, నేడూ కూడా అనేక పూలతోటలతో శోభిల్లుతూ ఉంది. ఆగమ శాస్త్రానుసారం స్వామివారికి నిర్వహించే పూజాదికాలయందు విరులకో ప్రత్యేక స్థానముంది. పుష్పార్చన ద్వారా, పంచ ఫలాలైన – శ్రీవారి అనుగ్రహం, పుష్టి (శారీరక దృఢత్వం), వృష్టి (సకాల వర్షాలు), ఐహిక సంపద (ధన ధాన్యాలు, భోగ భాగ్యాలు), ఆధ్యాత్మిక సంపద (మోక్షం) – పొందవచ్చని పెద్దలు చెబుతారు.

ఆ దేవదేవునికి ప్రకృతి వల్ల, క్రిమికీటకాల వల్ల, మానవ తప్పిదాల వల్ల జరిగే అసౌకర్యానికి పరిహారార్థం, దాదాపు అయిదు శతాబ్దాలుగా ఈ పుష్పయాగం నిర్వహింపబడుతోంది. తిరుమలలో అత్యంత కోలాహలంగా జరుపబడే అతి పెద్ద వేడుక – లక్షలాది భక్తులు విచ్చేసే తొమ్మిది రోజుల ''బ్రహ్మోత్సవాలు''. అంత భారీస్థాయిలో, అనేక విభాగాల సమన్వయంతో జరిగే ఉత్సవాల్లో, ఎంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినప్పటికీ, తెలిసో తెలియకో కొన్ని తప్పులు దొర్లుతాయి. ఆ దోష పరిహారార్థం, బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత వచ్చే స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం నాడు సంపంగి ప్రదక్షిణ మార్గంలోని కళ్యాణోత్సవ మంటపంలో, ఈ పుష్పయాగం

నిర్వహించబడుతుంది.

15వ శతాబ్దంలో ప్రారంభమైన పుష్పయాగం ఆలయ ఆదాయ వ్యయాలపై ఎక్కువ దృష్టి పెట్టిన ఈస్టిండియా కంపెనీ హయాంలో, రెండు శతాబ్దాల క్రితం అర్ధంతరంగా ఆగిపోయింది. 1980 సంవత్సరంలో అప్పటి తి.తి.దే ఆస్థాన విద్వాంసులైన జగన్నాథాచార్యులు, శ్రీ మాడబాకం ఆచార్యులు ఈ ఉత్సవాన్ని పునరుద్ధరించారు.

పుష్పయాగానికి ముందు రోజున జరిగే ''అంకురార్పణ'' ఘట్టంలో భాగంగా శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారిని ఊరేగిస్తూ, వసంత మంటపంలో పుట్టమన్ను సేకరించి, ఆ మట్టితో ఆలయం చేరుకుని, కళ్యాణోత్సవ మండపంలో బీజావాపం (నవధాన్యాలను మొలకెత్తించటం) చేస్తారు. పుష్పయాగం జరిగే రోజున రెండో అర్చన, నివేదనానంతరం ఉభయ నాంచారుల సమేతంగా మలయప్ప స్వామివారు, ఉదయం తొమ్మిది గంటలకు కళ్యాణోత్సవ మంటపానికి వేంచేస్తారు. తొలుతగా స్వామివారికి పంచామృత ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తరువాత పంచగవ్యప్రాసనం, రక్షాబంధనం, హోమం, రాజోపలాంఛనాలు, నక్షత్ర హారతి సమర్పిస్తారు.

రెండుసార్లుగా జరిగే ఈ ఉత్సవంలో, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు – అనేక రకాలకు చెందిన, సుమారుగా 7 టన్నుల సుమాలతో – ఈ యాగం నిర్వహిస్తారు.

ప్రకృతి ప్రసాదితమైన మల్లె, గులాబీ, చేమంతి, కనకాంబరం, గన్నేరు, తెల్లగులాబీ, సంపంగి, నందివర్ధనం, జాజులు, కలువ తామరలు; వాటితో పాటు దవనం, మరువం, తులసిదళాలతో స్వామివారిని పూజిస్తారు. వీటితో పాటుగా అనేక రకాలైన, విదేశాల నుండి దిగుమతి చేసుకున్న పూలతో ఈ యాగం సర్వాంగ శోభితమవుతుంది.

పుష్పయాగానికి వినియోగించే కుసుమాలన్నింటికీ, ఉద్యానవన కార్యాలయంలో ఆలయాధికారులు శాస్త్రోక్త పూజలు నిర్వహిస్తారు. అనంతరం అధికారులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారి సేవకులు, భక్తులు ఊరేగింపుగా ఈ పూలన్నింటినీ ఆలయం వద్దకు చేర్చుతారు. పుష్పయాగం సందర్భంగా, శ్రీవారి ఆలయం మొత్తాన్ని, ముఖ్యంగా కళ్యాణోత్సవ మంటపాన్ని పుష్పాలతో, విద్యుద్దీపాలతో అత్యంత కళాత్మకంగా అలంకరిస్తారు. అంతేకాకుండా, ఆలయ ముఖద్వారం వద్ద నయనానందకరంగా పుష్పాలతో స్వామివారి రూపాన్ని ఏర్పాటు చేస్తారు. సాధారణంగా పుష్పాలకు, అలంకారాలకు అయ్యే ఖర్చంతా భక్తులైన దాతలే భరిస్తారు.

అన్ని రకాల పుష్పాలను, అంత పెద్ద మొత్తంలో, ప్రపంచంలో బహుశా మరెక్కడా చూడబోము. నేత్రానందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతినీ కలిగిస్తూ శ్రీవారి వైభవానికి, శ్రీవారి సేవలో పుష్పాలకున్న ప్రాశస్త్యానికి అద్దం పట్టే ఆ పుష్పయాగాన్ని చూసి తరించవలసిందే.

ఆ రోజు తిరుమల క్షేత్రమంతా పూల పరిమళంతోనూ, అపరిమిత భక్తిభావంతో పుష్పాలను గంపలతో దేవాలయానికి చేర్చే ఆలయ సిబ్బంది భక్తుల సందడితోనూ, పులకితమవుతుంది. ఆ యాగాన్ని తిలకించి పరవశిస్తున్న భక్తుల మదిలో మెదిలేది ఒకే ఒక్క తలంపు, అన్ని కోట్ల పుష్పాలలో తానూ ఒకటై, స్వామివారి పూజాభాగ్యానికి ఎందుకు నోచుకోలేదూ? ఆ భాగ్యం పొందాలంటే మరెన్ని జన్మలెత్తాలి?

జియ్యరు స్వాములు భక్తిపూర్వకంగా పుష్పాలను అందిస్తుండగా అర్చకస్వాములు, శ్రీవారి-అమ్మవారి హృదయాలను తాకే వరకూ పూజ చేసి ఆ తరువాత పుష్పాలను తొలగిస్తారు. మరల పుష్పాలతో పూజిస్తారు. ఈవిధంగా 20 సార్లు చేసి, పుష్పాలకు అధిపతియైన ''పుల్లుడు'' అనే దేవతను ఆవాహన చేస్తారు. ఈ ఆర్జిత సేవకు 700 రూపాయల రుసుము చెల్లించాలి.

**"పూజలందరు చేసేదే పుష్పయాగము**
**ఆజి నర్జునుడు చేసినది పుష్పయాగము!!"**
**"తొరలి అలమేల్మంగ తురుమున విరులే నీకు**
**పొరసి నీ యురముపై పుష్పయాగము**
**సిరులతో మునులెల్ల శ్రీవేంకటాద్రీశ నీకు**
**పోరి పోరి జేసేరు పుష్పయాగము!!"**

ప్రతి ఆర్జితసేవలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీవారి దర్శనభాగ్యం కలుగజేస్తారు.

## వేంకటేశుని సేవలో విజయనగర సామ్రాట్టులు

''తిరుమల'' చరిత్రలో స్వర్ణయుగంగా చెప్పుకోబడే ''విజయనగర'' రాజుల పరిపాలనా కాలంలో దేవాలయం సర్వతోముఖాభివృద్ధి చెందింది. మనం ఈనాడు తిరుమలలో చూస్తున్న యాత్రికుల వసతి, మంచినీటి, భోజన సదుపాయాలు, రహదారులు, నిఘావ్యవస్థ, కట్టడాలు మొదలైన వాటన్నింటికీ అప్పటికి ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో, ఆ రాజుల కాలంలోనే శ్రీకారం చుట్టబడింది. వారు స్వామివారి నిత్య కైంకర్యాలకు, ప్రత్యేక ఉత్సవాలకు, ప్రసాదాలకు, అర్చకస్వాముల ఉదరపోషణకు లెక్కలేనన్ని మడులు, మాన్యాలు సమర్పించుకున్నారు. ఇక వారు స్వామివారికిచ్చిన నగలు, వజ్రవైఢూర్యాలు, వెండి, బంగారు పాత్ర, పూజా సామగ్రికైతే లెక్కే లేదు. నూతన సేవలు, ఉత్సవాలు, తిరునాళ్ళు ప్రవేశపెట్టి, అవకాశం వచ్చినప్పుడల్లా మంత్రులు, సేనాధిపతులు, దండనాయకులు, సామంతరాజులు, సిబ్బంది, పరివారజన సమేతంగా తిరుమలకు విచ్చేసి, తమకు లభించిన ప్రతి విజయాన్ని స్వామివారికి అంకితం చేసి, స్వామివారి ప్రాభవం

దక్షిణభారత దే శమంతటా వ్యాప్తి చెందటానికి ఎంతగానో దోహదపడ్డారు. తరచూ పాలకులు సందర్శించటం వల్ల ఆలయ అధికారగణం అప్రమత్తమై ఉండడంతో దేవాలయ నిర్వహణ, పూజావిధానాలు ఏవిధమైన లోటుపాట్లు లేకుండా సక్రమంగా జరిగేవి.

## శ్రీకృష్ణదేవరాయలు

విజయనగర సామ్రాజ్య చక్రవర్తులందరికీ మకుటాయమానంగా చెప్పుకోబడే, సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు 1509-1530 సంవత్సరాల మధ్య కాలంలో కటకం (నేటి ఒరిస్సాలో భాగం) మొదలు కన్యాకుమారి వరకు విస్తరించి యున్న సువిశాల సామ్రాజ్య పరిపాలనలో వ్యస్తుడై ఉండి కూడా, తిరుమల క్షేత్రాన్ని ఏడుసార్లు దర్శించుకుని, స్వామివారికి అమూల్యమైన కానుకలు సమర్పించి తన భక్తి తత్పరతను చాటుకున్నాడు. తిరుమలలో లభ్యమైన దాదాపు 50 కు పైగా శాసనాల్లో రాయల వారు, ఆయన కుటుంబ సభ్యుల ప్రస్తావన ఉందంటే, ఆలయానికి, ఆయనకు ఎంత ప్రగాఢ అనుబంధం ఉందో చెప్పుకోవచ్చు. రాయలవారు తిరుమలను సందర్శించిన ప్రతి సందర్భంలో ఏమేమి విజయాలు సాధించాడో, ఎన్నెన్ని కానుకలు సమర్పించాడో ఇప్పుడు వివరంగా చూద్దాం.

## మొదటి యాత్ర

రాయలు వారు తన పరిపాలన ఆరంభ సమయంలోనే సంగమ, సాళువ రాజుల కాలంలో ఛిన్నాభిన్నమైన విజయనగర సామ్రాజ్య లక్ష్మిని గజపతుల నుంచి జయించి, తన పాలనను సుస్థిరం చేసుకున్నాడు. దక్షిణాన మైసూరు వరకూ తన రాజ్యాన్ని విస్తరించుకుని, పెనుగొండ పాలకులను మరియు ఉమ్మత్తూరులో గంగరాజును ఓడించి, ఇక్కేరి రాజుల పరిపాలనలో ఉన్న ప్రాంతాన్ని యుద్ధం చేయకుండానే స్వాధీనం చేసుకున్నాడు. ఆ సందర్భంలో మొదటిసారిగా 1513 సంవత్సరం ఫిబ్రవరి మాసంలో తిరుమల క్షేత్రాన్ని దేవేరులిద్దరితో సందర్శించుకుని, తన మహత్తర విజయాన్ని స్వామికి అంకితమిస్తూ వారికో నవరత్న కిరీటం, మూడుపేటల ముత్యాలహారం, వజ్రాలు-రత్నాలు పొదిగిన 15 కంఠాభరణాలు, 5 రకాల మాణిక్యాలతో చేయించిన పతకం, 25 వెండిపళ్ళాలు సమర్పించుకున్నాడు. మహారాణులూ తమవంతుగా స్వామివారికి బంగారు హారతి పళ్ళాలు ఇచ్చారు.

## రెండవ యాత్ర

మరో మూడు నెలలకల్లా స్వామివారు మళ్ళీ తలంపుకు రాగా అదే సంవత్సరం మే నెల మండుటెండల్లో, ఒంటరిగా




స్వామివారిని సందర్శించుకున్నారు. అది అంతకుముందే సాధించిన విజయాలకు కృతజ్ఞతా భావంతోనో లేక ముందు ముందు చేపట్టబోయే విజయ యాత్రలకు నాందీ ప్రస్తావనగానో తెలియదు గానీ కానుకలు మాత్రం మునుపటి కంటే భారీగా సమర్పించుకున్నాడు. ఆ కానుకల జాబితా ఇలా ఉంది –

1. 5 వజ్రాలు, 17 అడ్డిగలు, ఇతర మాణిక్యాలు పొదిగిన ఉదుధార నగ
2. వజ్రాలు, మాణిక్యాలు, కెంపులు పొదిగిన ఒరలో చురకత్తి
3. ముత్యాల ఒరతో వేరొక కత్తి
4. కెంపుల ఒరతో కూడిన ఖడ్గం
5. 87 క్యారట్ల వజ్రాల పతకం
6. వజ్రాలు, రత్నాలు, కెంపులు పొదిగిన ఐదు బంగారు భుజకీర్తులు
7. రెండు బంగారు గొలుసులు
8. ఉత్సవమూర్తులకు, మూలమూర్తికి, దేవేరులకు నవరత్న ఖచిత కిరీటాలు

## మూడవ యాత్ర

మరో నెలన్నర కాలంలోనే, అదే సంవత్సరం జూన్ నెల వర్ష ఋతువులో మళ్ళీ శ్రీవారిని దర్శించుకుని, తన తల్లితండ్రుల పేరిట బంగారు తాంబూలాలను సమర్పించుకున్నాడు. స్వామివారి సంవత్సర ఉత్సవాల నిమిత్తం కరకంబాడి (చిత్తూరు జిల్లాకు తలమానికమై, వేలమందికి ఉపాధి కల్పిస్తున్న ''అమరరాజా బ్యాటరీస్'' కర్మాగారం ప్రస్తుతం ఈ గ్రామం చెంతనే ఉంది), ఛత్రవాడి, తూరూరు గ్రామాలను దేవదేయంగా ఇచ్చాడు. ఈ దాన శాసనంలో శ్రీకృష్ణదేవరాయ వంశ వృక్షానికి చెందిన సుదీర్ఘ వర్ణన ఉంది. ఆయన చంద్ర వంశస్థుడనీ, చంద్రుడు, బుధుడు, పురూరవుడు, నహుషుడు ఆయన పూర్వీకులనీ, వీరనరసింహేంద్రుడు-నాగలదేవి ఆయన తల్లితండ్రులని ఆ శాసనంలో పొందుపరచబడి ఉంది. ఆయన తల్లిగారైన ''నాగలదేవి'' పేరుమీద ''నాగులాపురం''

అనే గ్రామం నిర్మించి, అందులో విస్తృతమైన ప్రాకారాలతో, అత్యద్భుత శిల్ప సౌందర్యం ఉట్టిపడే ''వేదనారాయణస్వామి'' ఆలయాన్ని నిర్మించాడు. తిరుపతికి 60 కి.మీ దూరంలో ఉన్న ఈ దేవాలయాన్ని నేడూ చూసి తరించవచ్చు.

తిరుమలలో అప్పటికే ఏడు బ్రహ్మోత్సవాలు జరుగుచుండగా, రాయలవారు మూడవసారి తిరుమల యాత్రలో ఎనిమిదవ బ్రహ్మోత్సవాన్ని ప్రవేశపెట్టాడు.

## నాల్గవ యాత్ర

సరిగ్గా సంవత్సరం తరువాత ఉదయగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకుని, ఉభయదేవేరులతో 1514 సంవత్సరం జూన్ నెలలో నాల్గవసారి ఆలయాన్ని సందర్శించుకుని, అన్నమయ్య జన్మస్థలమైన ''తాళ్ళపాక'' గ్రామాన్ని దేవదేయంగా ఇచ్చి, ఆ ఆదాయంతో స్వామివారి ప్రత్యేక నైవేద్యానికి ఏర్పాట్లు చేశాడు. 30,000 వరహాలతో కనకాభిషేకం చేసి, మూడు పేటల ముత్యాలహారం, రెండు బంగారు కడియాలు కానుకగా ఇచ్చాడు.

ఆ యాత్రలో చిన్నమ్మ, పెద్దమ్మ కూడా పెద్దయెత్తున బంగారు కానుకలు సమర్పించుకుని – ముదియారు, పిరాట్టి, కులత్తూరు – అనే గ్రామాలను దేవదేయంగా ఇచ్చుకున్నారు. తిరుమలలో యాత్రికుల సౌకర్యార్థం ఓ సత్రం కూడా ఏర్పాటు చేశారు.

ఆ తరువాత 15 నెలల కాలం అద్దంకి, వినుకొండ కోటల ముట్టడిలో గడిపి, వాటిని వశం చేసుకుని, ధరణికోటలో విజయోత్సవ సంబరాలు అట్టహాసంగా జరుపుకుని, కృతజ్ఞతా సూచకంగా, 1515 సంవత్సరం అక్టోబర్ నెలలో శ్రీవారికి ఓ నవరత్న ప్రభావళిని, మకరకంఠిని రాజలాంఛనాలతో పంపించారు.

## ఐదవ యాత్ర

కొండపల్లి, అనంతగిరి, ఉర్లకొండ దుర్గాల్ని జయించి, హంపి-విజయనగరం నుండి బయలుదేరి 1517 సంవత్సరం జులై నెలలో ఐదవసారి తిరుమలను ఒంటరిగా సందర్శించుకుని స్వామివారికి ఓ కంఠమాల, పచ్చల పతకం బహూకరించాడు. అంతేకాకుండా ఆలయ విమానానికి నాలుగవ సారి బంగారు పూత పూయించడానికి 30,000 వరహాలు ఇచ్చాడు. సెప్టెంబర్ నెల, 1517 సంవత్సరం నాటికి ఆ బృహత్తర కార్యక్రమం పూర్తయింది.

## ఆరవ యాత్ర

తాను చేపట్టిన బంగారు తాపడం పని పూర్తయిన నలభై రోజులకల్లా, మేలిమి బంగారు కాంతులతో మెరిసిపోతున్న విమాన గోపురాన్ని కళ్ళారా చూసుకోవాలని, అక్టోబర్ నెల 1519 సంవత్సరంలో భార్య తిరుమలదేవమ్మ, నెలల కొడుకుతో మళ్ళీ తిరుమలకు వచ్చాడు. అప్పటికి రెండవ భార్య స్వర్గస్తురాలయింది. తన కుమారునికి ''తిరుమల రాయలు'' అని నామకరణం చేసి, అతని పేరున ఉన్న కొన్ని భూములు దేవదేయం చేశాడు. ఇలా తన కుటుంబం మొత్తాన్ని స్వామిసేవలో తరింపచేశాడు.

## ఏడవ యాత్ర

1521 సంవత్సరం ఫిబ్రవరి నెలలో భార్య తిరుమలదేవమ్మతో కలిసి చివరిసారిగా తిరుమల క్షేత్రానికి విచ్చేసి, నవరత్నాలు పొదిగిన పట్టు పీతాంబరం, ముత్యాలు, కెంపులు పొదిగిన తలపాగా, ఆణిముత్యాలు పొదిగిన రెండు చామరాలూ సమర్పించాడు.

తరువాతి కాలంలో అనేకసార్లు తిరుమల యాత్రకు ప్రయత్నించినప్పటికీ, ఎడతెరిపి లేని యుద్ధాలతో కాలం గడిచిపోయింది. అయితే, తరచుగా శ్రీవారికి ఘనమైన కానుకలు సమర్పించుకోవడం మాత్రం జీవితాంతం కొనసాగింది.

స్వతహాగా తెలుగు, కన్నడ భాషల్లో విశేష పాండిత్యం కలిగిన రాయలవారు శ్రీనివాసునికి చేసిన సాహిత్య సేవ కూడా తక్కువేం కాదు. విజయవాడ వద్ద ఉన్న శ్రీకాకుళంలో రాయలవారు ఆంధ్రమహావిష్ణువు దర్శనం చేసుకున్నప్పుడు, ఆయనకు స్వప్నంలో శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చి తనపై ''ఒక రచన చేసి తిరుమల వేంకటేశునికి అంకితమివ్వ''వలసిందిగా ప్రేరేపించాడు. స్వామి ఆదేశానుసారం రంగనాథస్వామి, ఆండాళ్ కథను ''ఆముక్తమాల్యద'' అనే ప్రబంధంగా రచించి శ్రీనివాసునికి అంకితమిచ్చాడు. ''ఆముక్తమాల్యద'' అంటే ''ముడిచి విడిచిన దండలను ఇచ్చే అమ్మ''. గోదాదేవి ముందుగా తానలంకరించుకున్న పూమాలలను దేవునికి సమర్పించేది.

500 ఏళ్ళ క్రితం శ్రీకృష్ణదేవరాయలు పునరుద్ధరించిన ''శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు'' దేవాలయాన్ని విజయవాడకు 30 కి.మీ దూరంలో నేటికీ దర్శించుకోవచ్చు.

నేటి ప్రకరణం ఆధ్యాత్మిక వాతావరణం నుండి కొద్దిగా వైదొలగి, చరిత్ర పుటల్లోకి తొంగి చూచింది. సహృదయంతో అర్థం చేసుకోగలరు. తెలుగువారి ఇలవేలుపు శ్రీవేంకటేశుని ఆలయాభివృద్ధికి విశేషంగా పాటుపడి, దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాచీన దేవాలయాలను పునరుద్ధరించి, తిరుమల క్షేత్రంలో భక్తులకు ఆనాడే తగిన వసతులు కల్పించి, అష్టదిగ్గజాలనబడే కవిపుంగవుల నాదరించి తెలుగు సాహిత్యాభివృద్ధి కెంతగానో పాటుపడిన రాయలవారిని స్మరించుకోకపోతే ''తిరుమల సర్వస్వం'' సంపూర్ణం కాదనిపించి ఈ ప్రకరణాన్ని రాయలవారికి అంకితమివ్వటం జరిగింది.

**(ఇంకా ఉంది)**




# అక్షయ తృతీయ

- డా. దేవులపల్లి పద్మజ,
9849692414

**లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం శ్రీరంగధామేశ్వరీం!**
**దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం!!**

హిందూ సాంప్రదాయములో సంవత్సరంలోని 12 నెలల్లోను అమావాస్య నుంచి పౌర్ణమి వరకు గల తిథులు విశిష్ట దినాలుగా సంతరించుకున్నాయి. అమావాస్య దీపావళికి, పాడ్యమి పోలి పాడ్యమిగా, తృతీయ లేక తదియ అక్షయ తదియగా, చవితి గణేశ చవితిగా, పంచమి నాగుల పంచమిగా, షష్టి సుబ్రహ్మణ్య షష్టిగా, సప్తమి రథ సప్తమిగా, అష్టమి శ్రీకృష్ణాష్టమిగా, నవమి మహర్నవమిగా, దశమి విజయదశమిగా, ఏకాదశి వైకుంఠ ఏకాదశిగా, ద్వాదశి క్షీరాబ్ది ద్వాదశిగా, త్రయోదశి శని త్రయోదశిగా, చతుర్దశి నరక చతుర్థశిగా, పౌర్ణమి కార్తీక పౌర్ణమిగా విశేషతను సంతరించుకున్నాయి. ఈ క్రమంలో అక్షయ తదియగా ప్రఖ్యాతి గాంచిన వైశాఖ శుద్ధ తదియను గూర్చి తెలుసుకుందాము.

అన్ని జన్మలలోకి ఉత్తమమైనది మానవ జన్మ. దీనిని సద్వినియోగం చేసుకుని అనంతమైన పుణ్యఫలాలు అందుకోవాలని అందరూ ఆకాంక్షిస్తారు. అక్షయ అంటే తరగిపోనటువంటిది. నేడు చేసే పుణ్యకార్యాల ఫలం అక్షయం చేస్తూ తరగిపోకుండా చేయమని చేసే వ్రతమే అక్షయ తృతీయ వ్రతము. ఈ రోజు చేసే దేవతా ప్రీతి కర్మలు, జపదాన, హోమాలు క్షయం కానంత మంచి ఫలితాన్నిస్తాయి. ఈ రోజు చేసే దానాలు అనుష్ఠానపరులకు, యోగ్యులకు చేసినట్లయితే శ్రీ మహావిష్ణువు సంతృప్తి చెంది అనుగ్రహిస్తాడని శాస్త్ర వచనం. మనలో జీవుడు మరొక శరీరంలో ప్రవేశించిన తరువాత కూడా అన్న వస్త్రాలకు లోటు లేకుండా అక్షమై సంపదలు కలుగుచేసేదే ఈ పండుగ.

సంకల్ప సహిత సముద్రస్నానం విశేష ఫలితాన్నిస్తుంది. నక్త వ్రతం, ఏక భుక్తం విశేషము. ఈ రోజు పరశురామ జయంతిగా కూడా కొలుస్తారు. క్లిష్ట సమస్యలకు పరిష్కారం కావాలనుకునేవారు ''పరశురామ స్తుతి'' ఈ రోజునుంచి మండల కాలం పారాయణ చేసినట్లయితే అద్భుత ఫలితాలు కలుగుతాయి. రోజంతా ఉపవసించి రాత్రి సమయంలో స్త్రీలు లక్ష్మీదేవిని పూజించి కనకధారా స్తోత్రం, శ్రీ సూక్తం, అష్టలక్ష్మి స్తోత్రం మొదలైనవి పారాయణ చేసినట్లయితే సౌభాగ్యవంతులై, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతాయి. ఈ రోజున చల్లని పానీయాలైన నారికేళం, తేనె, చెరకు రసం, గోక్షీరం మొదలైన వాటితో అభిషేకం చేసి, వాటిని గృహమంతా చిలకరించినట్లయితే క్షేమ సౌభాగ్యాలతో, శాంతి ప్రదముగా జీవించగలుగుతారు.

జాతక చక్రములో పితృదోషం ఉంటే, దాని నివారణకు పరమ పవిత్రమైన పుణ్యదినం అక్షయతృతీయ. మన కంటికి కనిపించే గ్రహాలు సూర్యుడు మరియు చంద్రుడు. సకల పితృదేవతలను మనము సూర్యభగవానునిలో దర్శించవచ్చును. అక్షయ తృతీయ శుభకాలములో పితృదేవతలను తలచుకుంటూ

అన్నం, నెయ్యి, పప్పు కలిపిన చిన్న ముద్దలను ఎండు కొబ్బరిలో నిక్షిప్తం చేసి ఆహుతి చేసినట్లయితే వంశపారంపర్యంగా శుభఫలితాలు పొందవచ్చునని జ్యోతిష పండితులు చెబుతారు. అక్షయ తృతీయ నాడు శ్రీ మహావిష్ణువుకి చందనం సమర్పిస్తే విశ్వమంతా చల్లగా సుభిక్షంగా వుంటుంది. దేవాలయాలలో ధవళ వర్ణానికి అధిక ప్రాధాన్యమిస్తారు. ధవళ పీత వస్త్రాలతో విగ్రహాలంకారాలు చేస్తారు. ఈ రోజు చేసే ఏ దానానికైనా అక్షయ ఫలితం ఉంటుంది. మనం చేసే దాన ఫలితం మన తరువాత తరాలు కూడా అనుభవించ వచ్చును అనే నమ్మకం. కొన్ని ముఖ్యమైన దానాలు తెలుసుకుందాము.

1. స్వయం పాకము - బియ్యం, కందిపప్పు, రెండు కూరలు, చింతపండు, మిరపకాయలు, పెరుగు, నెయ్యి, తాంబూలంతో సహా దానమిస్తే అన్నానికి లోటు ఉండదు అని భావిస్తారు.

2. వస్త్రదానం - ఎర్రని అంచు కలిగిన పంచెల చాపు, కండువా తాంబూలంతో బ్రాహ్మణునికి దానమిస్తే వస్త్రాలకు లోటుండదు.

3. ఉదక దానం - కుండ నిండుగా మంచి నీటిని నింపి దానం చేస్తే ఉత్తర కర్మ ద్వారా పరలోక యాత్రకు సహకరించే చక్కని సంతానం కలుగుతుంది. ఉత్తమ గతులు సంప్రాప్తించటానికి ఇది ఎంతో సహకరిస్తుంది.

ఈ రోజు సింహాచల నరసింహుని చందనోత్సవం జరుగుతుంది. సంవత్సర కాలమంతా చందనం పూతలో సేదదీరే స్వామి తన నిజ స్వరూపాన్ని భక్తులకు చూపి కనువిందు చేస్తాడు. స్వామి వారిది ఉగ్రరూపం కావటం వలన, వారికి శాంతి కలుగుటకై చందనాన్ని ఆయనపై లేపనంగా పూస్తారు. ఈ రోజు లక్షలాది భక్తులు స్వామి వారి నిజస్వరూపాన్ని చూడటానికి అన్ని రాష్ట్రానుండి తరలి వస్తారు.

ఈ ఆచార వ్యవహారాలు మరుగున పడిపోయి, నేడు బంగారం కొనుగోలుకు మాత్రమే పరిమితమౌతోంది. శ్రీ పార్వతీ పరమేశ్వరులను, శ్రీ లక్ష్మీనారాయణులను భక్తి శ్రద్ధలతో పూజించి, శక్తి మేరకు దానధర్మాదులు ఆచరించి ఉత్తమ గతులు పొందుదాం. మన తోటివారిని కూడా సుఖసంతోషాలతో జీవించేలా సహకరిద్దాం. పండుగలలోని పరమార్థాన్ని గ్రహించి వ్యవహరిస్తే లోకానికి ఎంతో కొంత మేలును చేసిన వారమౌతాము.

# మీ ప్రశ్న - మా సమాధానం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

1. **శ్రీవేంకటేశ్వరస్వామివారి రెండు చేతుల భంగిమకు అంతరార్థం సెలవియ్యండి! - పరవస్తు కణ్ణన్**

జవాబు – కలియుగవరదుడూ ఆపదమొక్కులవాడూ అయిన స్వామివారు తన హస్తాలలో ఒకదానితో తన దివ్య పాదాలను ఆశ్రయించి తనకు శరణాగతి చేసినవారి బాధ్యత తనదేనని పాదాలను చూపుతూ మరో హస్తంతో వారికి ఎటువంటి లౌకిక బాధలు కలగనీయనని ఒకవేళ కలిగినా అవి మోకాళ్ల వరకే అనగా వాటి తీవ్రత (కర్మ ప్రకారంగా)బాగా తగ్గించి, వాటినుండి తేలికగా బయట పడేస్తానని హామీ ఇస్తున్న భంగిమ అని పెద్దలు చెప్తారు.

2. **శంకరుడూ శివుడూ అనే వాటి మధ్య గల భేదం తెలియచేయగలరు – Bh వెంకటేశ్వర రావు**


జవాబు – లోకంలో రెండు నామాలనూ పరమశివునికే వాడుతున్నా, ఆకారమూ గుణమూ ఉన్న త్రిమూర్తులలో ఒకరైన మహేశ్వరునికే శంకర నామాన్ని, రూప గుణ రహితుడై లింగాకారుడైన ముగ్గురకూ అతీతుడైన దైవానికి శివనామాన్ని ఉపయోగించడం మనం గమనించవచ్చు. శివరాత్రి అని అంటారుగానీ శంకరరాత్రి అని బహుశా ఇందుకే అనరేమో!

3. **అయ్యా! శ్రీపాద వల్లభుల విశిష్టత, ఘనతలు దయచేసి వివరించండి. – పాల ప్రసాద్, ఖైరతాబాద్.**

జవాబు – శ్రీపాద వల్లభులు ఒక అవతార పురుషుడు. సద్గురువు. సమాజ శ్రేయస్సుకై ఎంతో తపించి, కృషి చేసిన కారణ జన్ముడు. ఆంధ్రప్రదేశ్ లోని పిఠాపురంలో జన్మించి, తన లీలలు ప్రదర్శించి, భక్తులకు జ్ఞాన వైరాగ్యములు, మానవ జన్మ సార్థకతలు, ఆధ్యాత్మిక విలువలు, మానవత గురించి బోధించిన మహా పురుషుడు. ఆనాటి సమాజాన్ని సన్మార్గంలో నడిపించి నేటికీ ఆదర్శంగా నిలిచిన వీరిని దత్తాత్రేయుల మరో అవతారంగా భక్తులు విశ్వసిస్తారు. ఆత్మహత్య వల్ల అనర్థమేనని, దానివల్ల సమస్య ఏవిధంగానూ పరిష్కారం కాదని, ఆనాడే ప్రజలకు హితం పల్కిన మహానుభావుడు. నేటికీ వీరిని అనుసరించే భక్తులు దేశమంతటా మనకు కనిపిస్తారు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

**– ఎడిటర్, శ్రీవేంకటేశం**



# మద్ది ఆంజనేయస్వామి

– మందరపు వి.జి.శంకరాచారి

సనక సనందనాదు లు ఇచ్చిన శాపం వలన వైకుంఠ ద్వారపాలకులైన జయ విజయులు కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగాను, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగాను, ద్వాపరంలో శిశుపాల దంతవక్త్రులు గాను జన్మించడం జరిగింది.

త్రేతాయుగంలో విశ్వవసు బ్రహ్మ పుత్రునిగా జన్మనెత్తిన రావణాసురుడు అమితమైన శివభక్తుడైనప్పటికీ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే గుణాలను పరిపూర్ణంగా కలిగిన వ్యక్తి... ఈ కామపు కోరికతోనే చెల్లి శూర్పణఖ సలహా విని అతిలోక సుందరి మహాసాధ్వి. మహాపతివ్రత సీతాదేవిని చెరపట్టాడు.

రావణుడి కోటలో ఉన్నవారంతా రాక్షస గుణాలను కలిగి యున్నవారే. అయితే వారిలో సత్వగుణం పూర్తిగా కలిగియున్నవారు కొందరున్నారు. వారిలో ప్రథమంగా విభీషణుడు వస్తాడు. నీతి తప్పని నిజాయితీపరుడు. మరియొక వ్యక్తి విభీషణుడి కుమార్తె త్రిజట.

సీతాదేవి దగ్గర కాపలాదారునిగా యున్న త్రిజట మంచి మాటల వలనే సీతాదేవికి కొండంత మహాధైర్యం కలిగేది. వీరిద్దరితో పాటుగా మద్వాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. ఇతడు పరమ సాత్వికుడు. యుద్ధానికి పూర్తిగా వ్యతిరేకి. అంతేకాదు, పరమ శివభక్తుడు. ప్రహ్లాదుడిలాగా రాక్షస గణానికి శివబోధ చేసేవాడు. అందరితోనూ పంచాక్షరీ మంత్రం జపిస్తూ ముక్తినీ... శివసాయుజ్యాన్నీ పొందమని బోధ చేస్తూ ఉండేవాడు.

రావణాసురుడు ఎన్నిసార్లు చెప్పినా యుద్ధానికి వెళ్ళేవాడు కాదు. రాక్షస మాయను మునివర్యులపై ప్రదర్శించేవాడు కాదు. ఇతడు పరమ శివభక్తుడు కనుక ఏమీ అనేవాడు కాదు. అతడిని వధిస్తే శివుడిని ఎదిరించినట్లుగా అవుతుందని అతడి ప్రవర్తనని మార్చుకోమని చెప్పేవాడు కాదు. ఈ కారణం వలన మధ్వాసురుడు రాక్షసమూకలో సాత్వికుడిగా మనగలిగేవాడు.

ఒక సందర్భంలో సీతాన్వేషణలో సీతాదేవి దగ్గరకు వచ్చిన ఆంజనేయస్వామిని చూస్తాడు మద్వాసురుడు. సీతాదేవి దగ్గర అతడి వినయ విధేయతలు, రాముడిపై గల అతడి భక్తి ఎంతటిదో గ్రహించిన మధ్వాసురుడు ఆంజనేయస్వామి యొక్క భక్తుడిగా మారిపోతాడు. అప్పటినుండి ఇతడు హనుమ జపాన్ని ప్రతిక్షణం జపిస్తూ తన్మయత్వాన్ని పొందేవాడు. హనుమ స్మరణలో ధ్యానంలో అతడికి హనుమతో శివుడు కనబడేవాడు కాదు.

హనుమ లంకను కాల్చి వెళ్ళిన తర్వాత కాలంలో రామ రావణ యుద్ధం ఖరారైంది. గొప్ప భక్తుడే కాక మహావీరుడైన మధ్వాసురుడిని సేనాధిపతిని చేస్తాడు రావణుడు. అంతేకాదు, రామరావణ యుద్ధంలో రావణ సేనను ముందుండి నడిపించి

విజయుడివై తిరిగి రమ్మని ఆజ్ఞాపిస్తాడు.

మరుసటి రోజు మధ్వాసురుడు తన నేతృత్వంలో రావణసేనను నడిపి రాముడితో యుద్ధం చేయడానికి ఇష్టపడక ముందురోజు రాత్రి హనుమ నామాన్ని జపిస్తూ ఆత్మాహుతి చేసుకుని తనువు చాలిస్తాడు.

ఈ విధంగా మధ్వాసురుడు త్రేతాయుగంలో జీవితం అంతం చేసుకున్న తర్వాత ద్వాపరంలో మద్వకుడిగా జన్మిస్తాడు. అయితే ఈ జన్మలో కూడా మద్వకుడు దుర్మార్గులైన కౌరవసేనలో భాగమౌతాడు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడి రథంపై కపిరాజుగా వెలుగుతున్న ఆంజనేయస్వామిని జెండాపై చూసి గతజన్మ గుర్తుకు వచ్చి అస్త్ర సన్యాసం చేసి ఆత్మ త్యాగం చేసుకుంటాడు.

ఈ విధంగా త్రేతాయుగంలోను, ద్వాపరంలోను జన్మనెత్తిన మద్వాసురుడు కలియుగంలో మద్యుడు అనే మహర్షి నామధేయంతో ప్రసిద్ధుడౌతాడు. ఈ జన్మలో కూడా అతడు ఆంజనేయ స్వామికి పరమభక్తుడు. ఎల్లవేళలా హనుమనామం జపం చేస్తూ తన్మయత్వం పొందుతూ ఉండేవాడు.

ఒకరోజు ప్రాతఃకాల సమయంలో తన ఆశ్రమానికి దగ్గరలో యున్న నదీ తీరానికి వెళ్ళి స్నానం చేసి సూర్య నమస్కారాలు ఆచరించి తిరిగి తన ఆశ్రమమునకు వస్తూ మార్గ మధ్యంలో కళ్ళు తిరిగి పడిపోతాడు. ఆ విధంగా స్పృహ లేకుండా పడిపోయిన



మద్యు మహర్షిని ఒక వానరం చూస్తుంది.

ఆ వానరం (కోతి) తక్షణమే నీళ్ళను తీసుకుని వచ్చి అతడిపై చల్లి దోరముగ్గిన మామిడిపళ్ళను, జామపళ్ళను తీసుకుని వచ్చి తినమని సైగచేస్తూ తనే అతడికి తినిపిస్తుంది. ఈ విధంగా మద్యు మహర్షితో జత కట్టిన వానరం ప్రతిరోజూ అతడి పూజకు అవసరమైన పువ్వులను, ఫలాలను మరియు ఇతర సామగ్రిని తీసుకుని వచ్చి అతడికిస్తూ ఉండేది.

ఈ విధంగా తనకు సేవ చేస్తూ తన దగ్గరే ఉండిపోయిన ఆ వానరాన్ని చూసి ఆశ్చర్యపోతాడు మద్యు మహర్షి.

ఒక రోజు మద్యు మహర్షి వానరంతో ''నీకు నాకు ఏమీ సంబంధం లేదు. అయినా నేను మార్గమధ్యంలో పడియుంటే నా ప్రాణం పోతుందేమోనని చింతిస్తూ నాకు కావలసిన పదార్థములను, పండ్లను, పుష్పాలను ఇంకా ఇతరములైన సామగ్రిని తెస్తూ యున్నావు. అసలు నీవెవరు? అని ప్రశ్నిస్తాడు.

అప్పుడు వానర రూపంలో వచ్చి సేవ చేస్తూ ఉన్న ఆంజనేయస్వామి ప్రత్యక్షమవుతాడు.

తను ఆరాధించే దైవం ఆంజనేయస్వామిని ప్రత్యక్షంగా కనులారా గాంచిన మద్యు మహర్షి పరమానంద భరితుడౌతాడు.

''తండ్రీ! నిరంతరం నీ నామ జపంతోనే జీవిస్తున్న నేను ఇకనుండి నీకు దూరమై జీవించలేను. నీతో కలిసి జీవించాలన్న కోరికతో ఏనాటినుండో అలుపెరుగక తపిస్తూ జీవిస్తూ యున్నాను. నేటికి కనికరించావు. నీతో పాటుగా కలిసి జీవించే వరాన్ని ఇవ్వమని'' వేడుకుంటాడు.

అప్పుడు ఆంజనేయస్వామి ''మద్యు మహర్షీ! నీవు ఈ జన్మలోనే, ఈ ప్రదేశంలోనే కొంతకాలం తర్వాత మద్దిచెట్టుగా నీ ఈ జన్మ రూపాంతరం చెందిన తర్వాత ఒక శుభముహూర్తాన నీ చెట్టు తొర్రలో నేను ఒక చేతిలో గదను మరియొక చేతిలో అరటిపండును పట్టుకుని స్వయంభువుగా వెలుస్తాను. అప్పుడు ప్రజలు నన్ను నిన్ను కలిపి మద్ది ఆంజనేయస్వామిగా పిలుస్తూ కలియుగాంతం వరకూ కొలుస్తారు'' అని వరమును అనుగ్రహిస్తాడు.

తదనంతర కాలంలో మద్యు మహర్షి మద్ది వృక్షముగా మారితే ఆంజనేయస్వామి తన భక్తునికి చెప్పినట్లుగానే రూపాన్ని ధరించి స్వయంభువుగా వెలుస్తాడు.

ఈ విధంగా వెలసిన మద్ది ఆంజనేయస్వామిని పూజిస్తే తమ వెంటే దైవం ఉంటాడని భక్తులు నమ్ముతారు. ఈ కారణం వలననే మాల వేసుకున్న హనుమద్భక్తులు ఏలూరు జిల్లాలోని గురవాయి గూడెం గ్రామంలో గల మద్ది క్షేత్రానికి వచ్చి మాలలు ధరించిన వారు ఇక్కడ విరమణ చేస్తారు.

మద్ది ఆంజనేయస్వామి అనుగ్రహం పరిపూర్ణంగా పాఠకులందరికీ లభించాలని ప్రార్థిద్దాం.

# నవవిధ భక్తిమార్గాలు

– డా|| కూర్మాచలం
శంకరస్వామి



## అర్చన భక్తి

నవవిధ భక్తి మార్గములలో అర్చన భక్తి ఒకటి. అనుదినము శ్రీహరిని పూజించిన వారికి పరమపద సోపానం లభిస్తుందని వేదాలు ఘోషిస్తున్నాయి.

**"హరి గొల్చుచుండు వారికి**
**బరమేష్ఠి పదంబు మొదలు పదభోగంబుల్**
**నరక సమంబని తలపున**
**ధరణీ రాజ్యంబు తోడి తగులము మానెన్"**

అనునిత్యము ఆ శ్రీహరిని ఎవరు భక్తి శ్రద్ధలతో పూజిస్తారో వారికి ఆ సర్వేశ్వరుడు సకల భోగ భాగ్యాలను ప్రసాదిస్తాడు. నరక భయాలను రూపుమాపి ఉన్నత పదవులు సమకూర్చే శక్తి ఆ పరమేశ్వరునికి మాత్రమే ఉంది. అతనిని ఏవిధంగా పూజించాలో పసివాడు, పరమాత్మ కొరకు పరితపించే ధృవునితో పూజ చేయు విధానము గురించి నారదుడు ఇలా చెప్పాడు.

**"దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము**
**జలజంబులను జారు జలజ నయను**
**తులసీ దళంబుల దులసికా దాముని**
**మూల్యంబులను వినిర్మల చరితు**
**పత్రంబులను బక్షిపుత్రుని గడు వన్య**
**మూలంబులను నాది మూలఘనుని**
**నంచిత భూర్జత్వగాది నిర్మిత**
**వివిధాంబురంబులను బీతాంబర ధరు**
**దనరు భక్తిని మృచ్ఛిలాదారు రచిత**
**రూపంబుల యందు గాని నిరూఢమైన**
**సలిలముల యందు గాని సంస్థలము లందు**
**గాని పూజింపవలయు నక్కమల నాభు"**

ఆ పరమేశ్వరుని పూజించుటకు భక్తితో కూడిన దుర్వాంకురములు అనగా గరిక దూర్వాలు చాలు, ఆ నీలమేఘ శ్యామునకు, ఆ కలువ కన్నుల స్వామికి, కలువ పూవులే చాలును. ఆ తులసీదామ దారునకు తులసీదళములే చాలును. ఆ నిర్మల చరిత్రునకు వన పుష్ప మాలికలే చాలును. ఆ పక్షివాహన ప్రభువుకు పత్రి పత్రములే చాలును. ఆ ఆది మూలునకు కందమూలములే చాలును. ఆ పీతాంబర ధారునకు వృక్షముల నారతో చేసిన వస్త్రములే చాలును. అతిశయించిన భక్తితో మట్టితో గాని, రాతితో గాని, దారువు (కర్రతో) గాని చేయబడిన విగ్రహముల యందు గాని, ప్రసిద్ధి చెందిన తీర్థముల యందు గాని, పుణ్యస్థలముల యందు గాని, పూజింపవలెనని నారదుని

పలు కులను బట్టి కొలిచిన వారికి కొలిచినంత ఫలితాన్ని ఆ పరమాత్మ కల్పిస్తాడని తెలుస్తోంది. అర్చన భక్తితో అన్నమయ్య పదార్చన అతి పవిత్రమైనది. అందరూ ఆచరించవలసినది. వారు షోడశోపచారముల గురించి వివరిస్తూ...

**"షోడశ కళానిధికి షోడశోపచారములు**
**జాడతోడ నిచ్చలును సమర్పయామి"**
**అలరు విశ్వాత్మునకు ఆవాహన మిదె సర్వ**
**నిలయునకు ఆసనము నెమ్మినిదే**
**అల గంగా జనకునకు అర్ఘ్యపాద్యాచమనాలు**
**జలధి శాయికి నిమజ్జనమిదే"**
**వర పీతాంబరునకు వస్త్రాలంకారమిదె**
**సరి శ్రీమంతునకు భూషణంబు లివె**
**ధరణీ ధరునకు గంధపుష్ప ధూపములు**
**తిరమిదే కోటి సూర్యతేజునకు దీపము**
**అమృత మథనునకు అదివో నైవేద్యము**
**రవిచంద్ర నేత్రునకు కప్పుర విడెము**
**అమరిన శ్రీవేంకటాద్రి మీద దేవునకు**
**తమితో ప్రదక్షిణాలు దండములివిగో"**

పున్నమి చంద్రుడిలోని పదహారు కళల్ని పోత పోసుకున్న పరిపూర్ణ పురుషుడు పరమాత్మ. ఆ సంపూర్ణ సౌందర్యముతోనే శ్రీనివాసుడిగా తిరుమల కొండపైనే కొలువు దీరి యున్నాడు. ఆ ప్రత్యగాత్మ ఆ అలంకార ప్రియుడికిని, ఆ అర్చామూర్తిని అన్నమయ్య షోడశ కళానిధిగా కొనియాడాడు. షోడశోపచారములతో పదార్చన చేశాడు. ఈ పదకవితా పితామహుడు ఆ పద్మావతీ ప్రియుని పదాలతో ప్రస్తుతించడమే కాదు. పూజలతో పరవశింపచేశాడు కూడా. అందుకే ఆనాడు ఆ ఆనందనిలయునికి చేసిన సేవా సంప్రదాయాలే నేటికీ కొనసాగడం విశేషం. సాకార మూర్తిగా సర్వేశ్వరుడిని ప్రసన్నం చేసుకునేందుకు పూజకు మించిన పవిత్ర కార్యము మరొకటి లేదని అన్నమయ్య భావించాడు. అయితే పూజలు ఎప్పుడూ మొక్కుబడిగా చేయకూడదు. పూజ చేస్తుంటే మనస్సుప్పొంగిపోవాలి. మరలా మరలా చేయాలనిపించాలి. భగవంతుని కోసం ఏదైనా వదిలేస్తాననే పూనిక రావాలి. అలాంటి పూజతో భగవంతునిపై ప్రీతి పెరుగుతుంది. మనశ్శుద్ధి కలుగుతుంది. అందుకే భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస ఇలా అంటారు. ''ఉపచారాలు చేయడం ద్వారా భగవత్ కార్యాలలో చాలా సమయం నిమగ్నం కావచ్చు. పూలు సేకరించడం, పూజ పాత్రలు శుభ్రం చేయడం, మాలలల్లడం, చందనం తీయడం, నైవేద్యం తయారు చేయడం తదితరమైన కార్యములు చేస్తున్నప్పుడు మనసు అటువైపే మరలి ఉంటుంది. కోపం, ఈర్ష్య, ద్వేషం లాంటివి తొలగిపోతాయి. కేవలం భగవంతునికి సంబంధించిన విషయాలే స్ఫురిస్తాయి'' అని వారు చెప్పిన ఈ మాటలు అక్షర సత్యాలు, ఆచరణ యోగ్యాలు.

నెలరాజు పదహారు కళలైన అమృత, మానద, పూష, తుష్టి, పుష్టి, ధ్రుతి, కామదాయిని, శశిని, చంద్రిక, కాంతి, జ్యోత్స్న, శ్రీ, ప్రీతి, అంగద, పూర్ణ, అపూర్ణలు సొంపారగా కలగలిసిన మూర్తి ఆ శ్రీవేంకటాచలపతి. అంతటి ఆ కళానిధిని అన్నమయ్య పదహారు ఉపచారాలైన ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, అభిషేకం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, నమస్కారం, దక్షిణాదులతో ఉపచరించి ''షోడశ కళానిధికి షోడశోపచారములు జాడతోడ నిచ్చలునూ సమర్పయామి'' అంటూ ఉప్పొంగిపోయారు. జాడతోడ అంటే యుక్తమైన రీతిలో, నిచ్చలు అంటే నిత్యం అని భావం. ఇలా సదా ఆ శేషాద్రి నిలయుడిని షోడశోపచారాలతో సేవించుకుంటూ అన్నమాచార్యులు ఒక సత్సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

విశ్వాత్మకుడైన వేంకటేశ్వరుడికి ఆవాహనంతో ఉపచారాలు ఆరంభించి ఆ సర్వనిలయునికి ఆసనం వేసి, గంగా జనకుడికి అర్ఘ్య పాద్యాలిచ్చి, ఆచమనం చేసి, పవిత్ర జలాలతో సాగర శయనుడిని అభిషేకిస్తూ, అలరు విశ్వాత్మకు ఆహ్వానమిదే అంటూ వేడుకగా పాడుకున్నాడు అన్నమయ్య. నెమ్మి అంటే ప్రేమ, ప్రీతి. వామనమూర్తి ఇంతింతై తన పాదంతో ఆకాశాన్ని కప్పినప్పుడు బ్రహ్మ తన కమండలంలోని ఉదకంతో విష్ణుమూర్తి అవతారమైన వామనుడి పాదాలను కడిగాడు. ఆ కడిగిన జలమే ఆకాశ గంగయై ప్రవహించింది. ఆ విధముగా విష్ణువు తన పాదాల నుంచి గంగానదికి జన్మనిచ్చిన కారణంగా గంగా జనకుడయ్యాడు. ఇలా పరమ భక్తుడైనవాడు పూజలోను ఆ పరంధాముని దర్శించుకోగలగాలి. అందుకే శ్రీ త్యాగరాజస్వామి కూడా ఆ సీతారాముల విగ్రహాలను ప్రాణప్రదంగా చూసుకుంటూ, పూజాదికాలు ఆచరిస్తూ-

**"ఉపచారాలు చేసేవారున్నారని మరువకురా**
**కృప కావలెనని నేనీ కీర్తిని పల్కుచునుండగా**
**వాకిటనే పదిలముగా వాతాత్మజుడున్నాడని**
**శ్రీకరమగు నీ తమ్ములు చేరి యున్నారని**
**ఏకాంతమునను జానకి యేర్పడి యున్నది**
**శ్రీకాంత పరులెవ్వరు శ్రీ త్యాగరాజ వినుత**
**నాతోపాటు వాతాత్మజుడైన హనుమంతుడు**
**లక్ష్మణ భరత శత్రుఘ్నులును"**

ఓ స్వామీ! జానకీమాత కూడా నిన్ను సేవించుకునేందుకు వేచి చూస్తున్నారని విన్నవించాడు. ఇలా మనసు పెట్టి మందిరంలో కూర్చుని ప్రేమగా పూజించాలి. అలా మనసు నిలిపే శక్తి లేకపోతే మధుర ఘంట విరుల పూజేమి చేయను.

విద్యా ప్రకాశాన్నిచ్చే గురుగ్రహానికి అత్యంత ప్రీతిపాత్రమైన రంగు పసుపు. అందుకే జ్ఞానాన్నివ్వగలిగిన శ్రీమన్నారాయణుడు

కూడా పీతాంబరధారియై ఉంటాడు. అలాంటి వర పీతాంబరునకు వస్త్రాన్ని అలంకరిస్తూ శ్రీమంతుడికి భూషణంగా యజ్ఞోపవీతాన్ని ధరింపచేస్తూ ధరణీధరుడైన ఆ దేవదేవునికి గంధ పుష్ప ధూపాలను నివేదిస్తూ కోటి కాంతుల తేజో మూర్తికి ప్రేమతో హారతినిస్తూ ''వర పీతాంబరునకు వస్త్రాలంకారమిదే'' అని పాడుకున్నాడు అన్నమయ్య. ఆ సర్వేశ్వరుడు సులభ ప్రసన్నుడు. సమస్త సృష్టి కర్తకు మనం కొత్తగా సమర్పించేదేమి ఉంటుంది. కాని తానిచ్చిన పైకములోనుంచే కొడుకు కొంత దాచి తన పుట్టిన రోజున కానుక కొని తెస్తే పొంగిపోయే కన్నతండ్రిలా ఆ భగవంతుడు కూడా తాను సృజించిన ప్రకృతి నుంచే కొన్ని పూలో, పత్రాలో సేకరించి ప్రేమతో తన ముందు పెడితే ఎంతగానో మురిసిపోతాడు.

ఆ పరమాత్మ పంచభక్ష్య పరమాన్నాలకు, పట్టు పుట్టాలకు లొంగడు. కేవలం ప్రేమపాశమొకటే ఆయనను బంధించేది. అందుకే రాముడు, కృష్ణుడు నుంచి రామకృష్ణుల వరకు అన్ని అవతారాల్లో భగవంతుడు భక్తికే లొంగాడు కానీ భోగైశ్వర్యాలకు లొంగలేదు. అదే నమ్మకంతో ఆ అమృత మథనుడికి, అంతర్యామికి నైవేద్యం సమర్పించాడు ఆ శ్రీనివాస భక్తాగ్రేసరుడు. ఎక్కడ భగవంతుడికి భుక్తాయాసం వస్తుందోనని తాంబూలమిచ్చాడు. చివరకు భక్తితో నమస్కరిస్తూ ప్రేమతో ప్రదక్షిణం చేస్తూ ''అమృత మథనునకు అదిగో నైవేద్యం అని, రవిచంద్ర నేత్రునకు అంటే సూర్యచంద్రులే నేత్రాలుగా గలవానికి అని, తమితో అంటే ప్రేమతో అపేక్షతో అని అర్థం. ఇలా చేసే ఉపచారాలన్నీ బాహ్యంగా భగవంతుని కోసమన్నట్లుగా కనిపిస్తాయి. కానీ అవన్నీ అంతశ్శుద్ధి కోసమే.

ఈ పూజా ప్రక్రియలన్నీ మనల్ని పునీతుల్ని చేయడం కోసమే. ఈ విధంగానైనా మన మనస్సు, బుద్ధి వక్రమార్గం పట్టకుండా సన్మార్గంలో పయనిస్తాయి. అందుకే శ్రీ భరద్వాజ మహర్షి శ్రీ శివకర్ణామృత స్తోత్రంలో ''శివాభిషేకం చేసిన జల కణాలను'' బహిరంగాన చల్లుకున్న భక్తుల అంతరంగం నిర్మలం కావడం ఎంత విచిత్రమో కదా! అని ఆనందాశ్చర్యాలకు లోనవుతాడు.

విశ్వవ్యాపకుడు, తేజో విరాజితుడు అయిన ఆ దివ్యాత్మకుణ్ణి తన దేహాన్నే దేవాలయంగా మలచి అర్చించాడు అన్నమయ్య. పరమాత్మ ప్రసాదించిన పాంచభౌతిక శరీరాన్ని ఆయన పాదసేవలో తరింపచేయాలని ప్రబోధించాడు. ఆ ఆపద్బాంధవుణ్ణి ఆవాహన చేసుకున్న అన్నమయ్య ఆపాదమస్తకము ఆ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికే అర్పించాడు. తనువే గుడిగా చేసి, తలను శిఖరంగా నిలిపి ప్రేమ నిండిన హృదయాన్ని ఆయనకు పీఠంగా మలచి, చూపులనే దీపాలుగా చేసి, పలుకులనే మంత్రాలుగా మలచి సర్వ సమర్పణ భావంతో శ్రీనివాసుణ్ణి సేవించుకున్నాడు. ఈ శరీరం ఆ సర్వేశ్వరుని సమారాధనకే నన్న సత్యాన్ని తెలుసుకుంటే భక్తులు, తనువును తుచ్ఛమైన కార్యకలాపాలకు వినియోగించలేరు. ఇదే భావనతో నిలకడ లేని ఈ శరీరాన్ని ఆ నీరజ నాభుని నిత్య పూజకు ఎలా సమర్పించుకోవాలో ఈ కీర్తనలో ఇలా సూచించాడు.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడి ఆత్మీయ అర్చకుడిగా తన జీవితాన్నే అంకితం చేసిన ఆయన నిజమైన పూజ అంటే ఏమిటో తెలియజేశాడు. కట్టెదుట కనిపించే కైవల్యమూర్తికి బాహ్యపూజల కన్నా అంతరంగ పూజకే ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ''నిత్యపూజలివిగో నేరచిన నోహో – ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి'' అంటూ తన పదామృతాన్ని వర్షింపచేశారు. ఈ పరమ భాగవతోత్తములు శ్రీనివాసుని సేవాగ్రగణ్యునిగా సాధనా మాహాత్మ్యంతో నిత్యపూజల్లో నిబిడీకృతమైన అంతరార్థాన్ని అవగతం చేసుకున్నారు. అందుకే భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస ఇలా అంటారు ''భగవంతుణ్ణి ఈ చర్మచక్షువులతో చూడలేం. సాధనలు చేయగా చేయగా ప్రేమ చక్షువులు ప్రేమ కర్ణాలతో కూడుకున్న ప్రేమమయ దేహం ఏర్పడుతుంది. అలా ప్రేమ చక్షువులతో భగవంతుణ్ణి దర్శించవచ్చు. ఆ ప్రేమ కర్ణాలకు దైవవాణి వినబడుతుంది''. అంతా ప్రేమమయమే. ప్రేమయే నిజమైన భక్తి. తనువును గుడి చేసి, తలను గోపురం చేసి ఆ కరుణాంతరంగునికి తన హృదయాన్నే పీఠంగా పరచి ఆసీనుణ్ణి చేశాడు. ఈ దృశ్య ప్రపంచాన్ని పరికించే తన నయనాలను అంతర్యామియైన నిత్య నిర్మలుడికి ఘన దీపాలుగా భావించి, వెలిగించి, పులకించిపోయాడు.

**"తనువే గుడియట తలయే శిఖరమట**
**పెను హృదయమే హరి పీఠమట**
**కనుగొన చూపులే ఘన దీపములట**
**తన లోపలి అంతర్యామికిని"**

పలికే ప్రతి పలుకూ ఆ పరాత్పరుడికి పరమ మంత్రమై పల్లవించింది. పలుకుకు పాదైనా అంటే ఆశ్రయమైన నాలుకను, ఆ గోకుల నందనుని ప్రాంగణంలో మ్రోగించే పిడిగంటతో పోలుస్తూ ఆ జిహ్వ చవిచూసే అన్ని రుచులు మనస్సులోని మాధవుడికి మంచి నైవేద్యములని వర్ణిస్తూ –

**"పలుకే మంత్రమట పాదైన నాలుకే**
**కలకలమను పిడి ఘంటయట**
**నలువైన రుచులే నైవేద్యములట**
**తలపు లోపలనున్న దైవమునకు"**

ఇలా దేహక్రియలన్నీ ఆ దీనజన బాంధవుని పూజాదికాలకు ప్రతిరూపాలేనని స్పష్టం చేశాడు అన్నమయ్య. మనలో ఇలాంటి భావనలు పొడచూపిన మరుక్షణం నిత్యజీవనం ఒక పవిత్ర కార్యంగా పరిణమిస్తుంది. చేసే ప్రతి కార్యంలో ఒక పూజా భావం ప్రతిఫలిస్తుంది. అందుకే ఇలా అంటాడు ''మనిషి గమనం, గమ్యం అన్నీ ఆ భగవన్మయమే కావాలి. నడత, నడక ఆయన వైపుకే సాగిపోవాలి. వేసే ప్రతి అడుగూ ఆయనకు చేసే ప్రదక్షిణంగా భావించుకోవాలి. అప్పుడే ఆ అడుగులు తడబడవు.

తప్పటడుగులు వేయవు. అదే భావనతో అన్నమయ్య ''గమన చేష్టలే అంగరంగ గతియట – తమిగల జీవుడే దాసుడట, అమరిన వూర్పులే ఆలపట్టములట – క్రమముతో శ్రీవేంకటరాయునికి''. తన గమన చేష్టలన్నీ ఆ గోవిందుడి అంగరంగ చేష్టలేనని గుర్తు చేస్తూ తమిగల జీవుడు అంటే – ప్రేమ నిండిన ఈ జీవుడు ఆయనకు ఎప్పుడో దాసుడైపోయాడు. ఇక క్రమబద్ధమైన ఊర్పులు అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆ వేంకటేశ్వరుడికి ఆలపట్టములై సేద తీరుస్తున్నాయట. ఆలపట్టములు అంటే విసనకర్రలు. ఇలా అశాశ్వతమైన శరీరానికి ఆ భగవదర్పితంతో అమృత తత్త్వాన్ని సిద్ధింప చేసుకోవాలి. అప్పుడే అది నిజమైన అర్చన భక్తి అవుతుంది. ఈ భక్తి మార్గంలో కూడా ఆ పరమాత్మ మనకు పరమప్రాప్తి కలిగిస్తాడనడంలో సందేహం లేదు.

# హనుమజ్జయంతి

**– ఎస్.ధర్మారావు**

**అంజనాదేవి సంతాన మందగోరి**
**మౌని యామతంగునడిగె । మగువ యపుడు**
**పుడమి గలిగిన క్షేత్రాల । పుణ్యమైన**
**క్షేత్ర మెయ్యది సంతాన । సిద్ధి గలుగ**
**పుణ్య క్షేత్రాల లోనతి । పుణ్య ప్రదము**
**కామితార్థాల దీర్పంగ । కల్ప తరువు**
**క్షేత్ర రాజమ్ము, గరుడాద్రి । క్షితిని గలదు**
**దాని మించిన క్షేత్రమ్ము । ధరణి లేదు**

హనుమంతుడు తిరుపతి కొండపై పుట్టాడు. శ్రీనివాసుడు శ్రీలక్ష్మిని వెదకుచు వచ్చి తిరుమలలో ఉండిపోయాడు. అది గమనించి అతని వాహనమైన గరుడుడు వైకుంఠమును భూలోకమునకు దెచ్చి తిరుమల కొండలలో నుంచెను. గరుడునిచే తేబడినది కావున దానికి గరుడాద్రియను పేరు కలిగెను. అంజనా దేవి ఆ పర్వతముపై తపస్సు చేసి హనుమంతుని కనెను. కావున దానికి అంజనాద్రి యను పేరు వచ్చెను.

**అంజనా దేవి తపమును । ఆచరించి**
**పుత్రసంతతి నొందిన । పుణ్యభూమి**
**అంజనాద్రిగ ఖ్యాతిని । అందుకొనియె**
**దీని దర్శింప కోరికల్ । దీరు చుండు**
**అంజనాదేవి గరుడాద్రి । కరిగి యచట**
**తపము చేయంగ బూనెను । తక్షణమ్ము**
**వాయు దేవుని వరమున । బడసె సుతుని**
**అమిత విక్రమ బలశాలి । అంజనకును**

**జయంతి**

హనుమంతుడు వైశాఖ మాసం కృష్ణపక్షంలో దశమి తిథి పూర్వాభాద్రా నక్షత్రం శనివారం కర్కాటక లగ్నంలో వైధృతీ యోగంలో జన్మించాడు. ఇవి ఖగోళాది సకల ప్రమాణాలతో నిరూపితమైన విషయం.



**హనుమన్నవావతారాలు**

హనుమంతునకు తొమ్మిది అవతారాలున్నాయి.

1. ప్రసన్నాంజనేయ స్వామి
2. వీరాంజనేయ స్వామి
3. వింశతి భుజాంజనేయ స్వామి
4. పంచముఖాంజనేయ స్వామి
5. అష్టాదశ భుజాంజనేయ స్వామి
6. సువర్చలాంజనేయ స్వామి
7. చతుర్భుజాంజనేయ స్వామి
8. ద్వాత్రింశద్భుజాంజనేయ స్వామి
9. వానరా కారాంజనేయ స్వామి

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము.

శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ–పురుషులు ప్రతి విషయంలో మాట్లాడేటప్పుడు ఉద్రేకంగా మాట్లాడకుండుట శ్రేయస్కరం. ఎదుటివారితో వినయం, విధేయత పాటించినచో మీపై గౌరవము పెరుగును. ఆదాయ వనరులు మెరుగుపడి ఆకస్మిక ధనసంపాదన కలుగును. ఏకపక్ష నిర్ణయముల వలన సమస్యలు తలెత్తగలవు. అఖండ దీపారాధన చేయుట శుభప్రదం.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు చాలా అనుకూలమైన మాసము. గ్రహానుకూలత వలన ఉద్యోగం లేనివారికి ఉద్యోగ ప్రాప్తి, వివాహ ప్రయత్నములు ఫలించుట, బంధుమిత్రులతో ఆనందం కలుగును. ఆకస్మిక ధనలాభములు. స్త్రీలకు గౌరవ మన్ననలు లభించును. అయితే నోటి దురుసు వలన అపకీర్తి కలగకుండ జాగ్రత్త వహించవలెను.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు కలుగును. జన్మకుజుని ప్రభావముచేత ప్రయాణములలో బయటకు వెళ్లునప్పుడు ఆకస్మిక ప్రమాదములు జరుగుటకు అవకాశములు ఉన్నవి. శకునం చూసి ప్రయాణము శ్రేయస్కరము. స్త్రీలకు అనారోగ్య సమస్యలు. సుబ్రహ్మణ్య స్వామి పూజలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. వృత్తి, ఉద్యోగములలో ఉన్నవారికి కొంతవరకు అనుకూలత. శుభకార్యముల నిమిత్తం ధనవ్యయం కలుగును. వివాహ ప్రయత్నములు ఫలించును. నిల్వ ధనం తగ్గే అవకాశమున్నది. అవసరార్థం నూతన అప్పులు చేయవలసి రావచ్చు.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సాధారణ పరిస్థితులు కనిపిస్తాయి. నిర్లక్ష్యం లేకుండా కార్యసాధనగా ముందుకు సాగితే, ఆకస్మికంగా అవసరమైన సహాయం లభిస్తుంది. ముఖ్యంగా కనకదుర్గమ్మ కృప వలన అవసరమైనది సమకూరగలదు. శుభకార్య ప్రయత్నములు ఫలిస్తాయి.

మంత్రజపం: ఓం శ్రీ కనకదుర్గాదేవి నమోనమః – 108 సార్లు.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ–పురుషులకు గ్రహానుకూలత లేదు. అధిక ధనవ్యయం, మానసిక ఆందోళనలు కలుగుతాయి. ప్రతి విషయంలో ఖర్చులు అధికముగా ఉండును. ప్రయాసలు వెంటాడగలవు. బంధువులు, స్నేహితుల వలన మానసిక వేదన కలుగవచ్చు. నవగ్రహ శాంతి చేయుట శ్రేయస్కరం. నవగ్రహ జపాలు, దానాలు చేయాలి. శక్తిలేనివారు నవగ్రహ ప్రదక్షిణలు చేయవలెను.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య లాభములు. అధికారుల వలన ఇబ్బందులు కలుగగలవు. ప్రతి విషయంలో ఒత్తిడి పెరుగుతుంది. బలవంతంగా నిర్ణయాలు తీసుకోకుండా సౌమ్యంగా, ప్రశాంతంగా వ్యవహరిస్తే అనుకూలత. గ్రహకలయిక బలహీనంగా ఉన్నందున నవగ్రహ ఆరాధన చేయవలెను.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూల కాలం. ఆకస్మిక ధనలాభము కలుగును. బంధు–మిత్రుల ఆదరాభిమానములు పెరుగుతాయి. ప్రతి విషయం పాజిటివ్‌గా కనిపిస్తుంది. శత్రువులు మిత్రులుగా మారే సూచనలు ఉన్నాయి. అయితే తెలియని ఆటంకములు. ఆభరణములు, స్థిరాస్తుల వృద్ధి కలుగును. గురువారం దక్షిణామూర్తికి శనగలు, గుగ్గిళ్లు ప్రసాదంగా సమర్పించుట శుభప్రదం.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు చాలా జాగ్రత్తగా ఉండవలసిన కాలము. వృత్తి, ఉద్యోగ, వ్యాపారములలో అనుకూలత కనిపించును. వివాహ విషయములు కలిసి వచ్చును. ఆకస్మిక ధనలాభము. యాక్సిడెంట్లు, ప్రాణాపాయాలు నివారణకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు చేయుట శ్రేయస్కరం.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. ఆర్థికంగా కొంత ఇబ్బంది ఎదురయ్యే అవకాశమున్నది. అధికారులతో అభిప్రాయ భేదములు కలగవచ్చు. అవసరానికి ధనం సమకూరును. దూరప్రాంతాలకు బదిలీ. కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ అనవసర విషయాలపై శ్రద్ధ పెట్టక సూర్యభగవానుని ఆరాధన చేయుట శ్రేయస్కరం.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలంగా ఉంటుంది. అధికారుల నుండి, ఇతరుల నుండి సహాయ సహకారములు లభిస్తాయి. తోటివారితో కలిసిమెలిసి సహకరించినచో మానసిక ఒత్తిడి తగ్గి ఆర్థిక వనరులు సమకూరగలవు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు చేయుట అవసరం.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య లాభములు కలుగును. ఆర్థికంగా వెసులుబాటు కొంత తక్కువగా ఉంటుంది. బంధువులు, మిత్రుల నుండి ఆశించిన సహాయం లభించదు. భార్యకు అనారోగ్య సూచనలు ఉన్నాయి. మనోనిగ్రహంతో ముందుకు సాగవలెను. నవగ్రహ జపాలు, ప్రదక్షిణలు, దానాలు చేయుట వలన మనశ్శాంతి కలుగును.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. వసంత నవరాత్రులలో ఎవరిని పూజిస్తారు?
2. సాయిరెడ్డి గారు చేయించిన మొదటి శ్రీవారి కళ్యాణం ఎప్పుడు జరిగింది?
3. నహుషుని శపించిందెవరు?
4. కాశీలో మరణించినవారి చెవిలో విశ్వనాథుడు స్వయంగా చెప్పేదేమిటి?
5. అగస్త్యుని భార్య ఎవరు?
6. 'రా' అంటేనే రాముడు గుర్తుకొచ్చిందెవరికి?
7. మండోదరి తండ్రి ఎవరు?
8. రావణునికి హితవు చెప్పిన తమ్ముడెవరు?
9. విష్వక్సేనునికి మరో పేరు ఏమిటి?
10. జయదేవుని ఎవరి అవతారంగా భావిస్తారు?
11. మైథిలీ కృష్ణదత్తుడు వ్రాసిన కావ్యమేది?
12. జయదేవుని అష్టపదులను ఏయే దేవాలయాలలో గానం చేస్తారు?
13. వందన భక్తికి ఉదాహరణ ఎవరు?
14. వసురాజును భూలోకంలో దించిందెవరు?
15. వాల్మీకి ఎప్పుడు జన్మించాడు?

1. ................................................
2. ................................................
3. ................................................
4. ................................................
5. ................................................
6. ................................................
7. ................................................
8. ................................................
9. ................................................
10. ................................................
11. ................................................
12. ................................................
13. ................................................
14. ................................................
15. ................................................

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. శివుడు, 2. గోవిందదాసు/సాయిరెడ్డి గారు, 3. భృగువు
4. మెట్లెలను, 5. ఇల్వలుడు, 6. లోపాముద్ర, 7. విష్ణుమాయ నుండి,
8. అగస్త్యుడు – శ్రీరామునికి, 9. నీలుడు, 10. కర్నాటకం,
11. విదలుడు, 12. మఖ నక్షత్రం, 13. లక్ష్మీదేవి,
14. ఆమలక ఏకాదశి, 15. చ్యవన మహర్షికి

## సరైన సమాధానాలు రాసినవారు

ఎవరై సరైన జవాబులు రాయలేదు

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________





RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



**If Un Delivered Please Return to:**

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

**Srivenkatesham Magazine in Google Drive**
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGIh6kVYyLq